


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com
WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital




Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 288 పేజీలు: 12 వెల: 6.50


## ఆంధ్రప్రదేశ్ రైతులకు మరో పండుగ




'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకంలో 2వ విడతగా
రాష్ట్రంలోని 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,135 కోట్లు జమ

గౌ॥ భారత ప్రధాని
**శ్రీ నరేంద్ర మోదీ గారు**
గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
**శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు**
అందిస్తున్న 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్'
పథకంలో భాగంగా... నేడు రెండో విడత నిధుల విడుదల

వేదిక : కమలాపురం నియోజకవర్గం, కడప జిల్లా
తేదీ : 19 నవంబరు, 2025 సమయం : మధ్యాహ్నం 2 గంటలకు

మొదటి విడతలో
ఇప్పటికే రూ.7,000 జమ

నేడు 2వ విడత కింద
మరో రూ.7,000
చొప్పున జమ

రాష్ట్రంలోని 46,85,838 మంది
రైతులకు 2 విడతలుగా
రూ.6,310 కోట్ల లబ్ధి








అర్హులైన రైతులు
చనిపోయిన పక్షంలో
వారి వారసులకు అర్హత బదిలీ
(డెత్ మ్యుటేషన్) చేసి
పథకం వర్తించేలా చర్యలు

ఎన్‌పీసీఐలో వినియోగంలో లేని
ఖాతాలను తిరిగి
వినియోగంలోకి తెచ్చిన
వెంటనే నిధుల జమ

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

అన్నదాతల కుటుంబాల్లో ఆనందమే కూటమి ప్రభుత్వానికి ఆశీర్వచనం

19-11pg2exHMNWJQEPCK 2_19-11pg2exHMNWJQEPCK.qxd 19/Nov/25 12:38 AM Page 1





మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను చూపుతున్న పోలీసులు

# నిఘా పెట్టి మట్టుపెట్టాం

**రంపచోడవరం నవంబర్ 18 ప్రభాతవార్త:** పక్కనున్న రాష్ట్రంలో పోలీస్ నిఘా తో ఉక్కిరిబిక్కిరి అయిన మావోలు షెల్టర్ తీసుకునేందుకు ఆంధ్ర వైపు వచ్చినట్లు పోలీసులకు పక్కా సమాచారం ఉన్నట్లు ఇంటలిజెంట్ ఐజి మహేష్ చంద్రలడ్డ తెలిపారు. మంగళవారం ఉదయం రంపచోడవరంలో మంగళవారం రాష్ట్ర ఇంటలిజెంట్ డీజీ మహేష్ చంద్రలడ్డ విలేకరులతో మాట్లాడారు. గత రెండు నెలలుగా నిఘా పెంచి మావోల కదలికలను నిశితంగా గమనిస్తున్నట్లు వెల్లడించారు. మావోలు పట్టణాలలో షెల్టర్ తీసుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. గత రెండు రోజులుగా అందుతున్న పక్కా సమాచారంతో అల్లూరి జిల్లా పోలీసులు మారేడుమిల్లి అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టడం మొదలుపెట్టారని అన్నారు. మంగళవారం ఉదయం 6 నుండి 7 గంటల మధ్యలో మావోలు ఎదురుపడ్డారని ఎన్కౌంటర్లో ఆరుగురు మృత్యువాత పడ్డారని అన్నారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత సెంట్రల్ కమిటీ కమాండర్ హిడ్మా అతని భార్య రాజే, మరో నలుగురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. పదిహేను మంది మావోయిస్టులు తప్పించుకున్నట్లు తెలిపారు. తమకు లభించిన సమాచారంతో విజయవాడ కాకినాడ లో భారీ సంఖ్యలో మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

# మావోయిస్టు అగ్రనేత హిడ్మా హతం

>> ఆక్టోపస్ బలగాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో మొత్తం 57 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. అరెస్టయిన మావోయిస్టులందరూ ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారుగా, హిడ్మా అనుచరులుగా పోలీసులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారిలో 12 మంది మహిళలు కూడా ఉన్నారు. నలుగురు కీలక నేతలు ఉన్నట్లు సమాచారం. స్థానిక పోలీసుల సహాయంతో ఆక్టోపస్ బలగాలు మావోయిస్టులను అరెస్ట్ చేసింది. అరెస్టయిన మావోయిస్టులు కానూరు పరిసర ప్రాంతాల్లో నాలుగు చోట్ల డంప్‌లు (ఆయుధాలు, పేలుడు పదార్థాలు దాచిన స్థావరాలు) ఏర్పాటు చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్రస్తుతం ఈ డంప్‌లను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**అపార్ట్‌మెంట్లో తనిఖీలు..**

కృష్ణా జిల్లా పెనమలూరు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలో ఆయుధాల కలకలం రేగింది. ఈ ప్రాంతంలోని ఒక భవనంలో ఆయుధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

**ఇంటలిజెన్స్-ఆక్టోపస్ బృందాల జాయింట్ ఆపరేషన్ : ఎస్పీ విద్యాసాగర్ నాయుడు**

విజయవాడ,ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఇంటలిజెన్స్,ఆక్టోపస్ బృందాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టినట్లు కృష్ణాజిల్లా ఎస్పి విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఖచ్చితమైన సమాచారంతో సోదాలు చేశామన్నారు. విజయవాడతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల సోదాలు నిర్వహించామని,మావోయిస్టులకు సంబంధించి 5 జిల్లాల్లో ఆపరేషన్ జరుగుతోందని చెప్పారు.'ఆటోనగర్ లోని కానూరులో మావోయిస్టులు షెల్టర్ తీసుకున్నట్లు సమాచారం వచ్చింది. వారందర్నీ అదుపులోకి తీసుకున్నాం. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది చత్తీస్‌గఢ్‌కు చెందినవారున్నారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ సెక్రటరీ తిప్పిరి తిరుపతి బృందాన్ని పట్టుకున్నాం. పట్టుబడిన మావోయిస్టులకు సంబంధించిన సమాచారం రేపు చెబుతాం'అని అన్నారు.

**ఏపీ పోలీసు మావోయిస్టులకు గట్టి షాక్:** ఏపీ పోలీసు మావోయిస్టులకు గట్టి షాక్‌ను ఇచ్చింది. ఇప్పటి వరకు విజయవాడలో 28, కాకినాడలో 2, ఏలూరులో 15 మందిని మిగతా ప్రాంతాల్లో మరికొంతమందితో కలుపుకుని మొత్తంగా రాష్ట్రంలో 57 మందికి పైగా మావోయిస్టులను అరెస్టు చేశారు. అలానే రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టు డంప్‌ల కోసం గాలింపు కొనసాగుతుంది. హిడ్మా డైరీ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల సోదాలు నిర్వహిస్తున్నారు. సోదాలు జరిపిన బలగాలు సుమారు 28 మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించేందుకు రహస్య ప్రాంతాలకు తరలించారు. ఇంక ప్రత్యేక వాహనంలో పేలుడు పదార్థాలు, తుపాకులు పోలీసులు తరలించారు. మొత్తం భవనాన్ని కొత్త ఆటోనగర్ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృతంగా తనిఖీలు జరుపుతున్నారు. భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్న మావోయిస్టుల్లో 21 మంది మహిళలు, మరో ఏడుగురు కీలక హోదాల్లోని వ్యక్తులున్నట్లు పోలీసులు తెలిపారు. సానుభూతిపరులు, మిలీషియా సభ్యులను విజయవాడతోపాటు ఇతర ప్రాంతాల్లో రెక్కి నిర్వహించేందుకు తమవెంట తీసుకొచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. నాలుగు చోట్ల డంప్‌లు ఏర్పాటు చేసినట్లు పోలీసులకు అందిన సమాచారంతో వాటి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

**ఊరు మారినా తప్పని హిడ్మా తప్పని మృతి:** పోలీసులు అత్యంత అవసరమై క్రిమినల్.మావోయిస్టు హద్మా మృతి అనుహ్య పరిణామం,మావోయిస్టు ఉద్యమాల్లో కీలకం వ్యవహరిస్తూ వచ్చినహడ్మా. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దక్షి ణ సుక్మాలోని పూర్వతి గ్రామంలో హిడ్మా జన్మించాడు. 10వ తరగతి పూర్తి చేసిన తర్వాత, మావోయిస్టు పార్టీలో చేరాడు. సైనిక ఆపరేషన్, గెరిల్లా యుద్ధతంత్రంలో ప్రధాన వ్యూహకర్తగామారాడు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్ నంబర్ 1 యొక్క ఏరియా కమాండర్ గా ఎదిగాడు. సుక్మా, దంతేవాడ, బీజాపూర్ ప్రాంతాల్లో పనిచేసే దిశి (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో క్రియాశీల సభ్యుడిగా వ్యవహరించాడు. 2017లో సుక్మా దాడితో పాటు 2021లో సీఆర్పీఎఫ్ జవాన్లపై దాడిలో ప్రధాన నిందితుడు హిడ్మా. దాదాపు ఇరవై ఆరు వేర్వేరు దాడులకు హిడ్మా బాధ్యుడని పోలీసుల సమాచారం.



మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

**పుట్టపర్తి, నవంబరు 18, ప్రభాతవార్త:** భగవాన్ సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, ఐటి, శాఖల మంత్రి నారాలోకేష్ లకు మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5:20 గంటలకు శ్రీసత్యసాయి విమానాశ్రయంకు చేరుకున్నారు. అక్కడ మంత్రులు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రి సవితమ్మ, ఎంపి బి.కె.పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎం.ఎస్.రాజు, దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, బిజెపి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, ఆర్‌టిసి ఛైర్మన్ పూలనాగరాజు, చీఫ్ సెక్రెటరీ విజయానంద్, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్, జెసి మౌర్య భరద్వాజ్ తదితర ప్రముఖులు వారికి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏయిర్‌పోర్ట్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బస చేయడం జరిగింది.

# నిందితుల పోలీసు కస్టడీకి అనుమతి

>>కోవచ్చని తెలిపింది. గతంలో వారం రోజుల పాటు నిందితులను ఎక్సైజ్ అధికారులు విచారించారు. మరిన్ని కీలక విషయాలు రాబట్టేందుకు నిందితులను విచారించనున్నారు. ప్రస్తుతం నిందితుడు జనార్ధన్ రావు నెల్లూరు కేంద్రకారాగారం, జగన్మోహన్ రావు విజయవాడ జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్ లో ఉన్నారు.

# ఎపిని కేన్సర్ రహితం చేస్తాం

>>పాటు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్‌సీడీ 3.0 సర్వేలో ఆరోగ్యశాఖ 225 ప్రశ్నలు అడిగింది. అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడం అనేది ఇబ్బందిగా మారింది. 4.0 సర్వేలో ప్రశ్నలను 28కి తగ్గించారు. 18 ఏళ్ల పైబడిన 4.10 కోట్ల మంది ఉన్నారు. వారి నుంచి ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబడతారు. పురుషుల్లో నోటి క్యాన్సర్, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారి వివరాలు సేకరిస్తారు. ప్రాథమిక స్థాయిలో సర్వేతో ఓ అంచనాకు వచ్చిన తరువాత వైద్యుల సమక్షంలో మరోసారి పరీక్షి స్తారు. అనుమానిత కేసులని తేలితే వారిని బోధన ఆసుపత్రుల్లోని ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగాలకు పంపిస్తామన్నారు. ఎన్‌సీడీ 4.0 సర్వేలో ఇప్పటి వరకు అనుమానిత నోటి క్యాన్సర్ కేసులు 31,391 గుర్తిస్తే, గర్భాశయ ముఖద్వార కేసులు 20,298, రొమ్ము క్యాన్సర్ కేసులు 11,694 గుర్తించారు. వీరిని నిపుణుల సమక్షంలో మరోసారి పరీక్షి ంచి 125 గర్భాశయ ముఖద్వార, 170 రొమ్ము, 137 నోటి క్యాన్సర్ అనుమానిత కేసులను ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్లకు రిఫర్ చేశారు. ఆయా కేసుల్లో ఇప్పటి వరకు యూనిట్లకు వెళ్లి పరీక్షి ంచుకున్నది 32 కేసులే. క్యాన్సర్ లక్షణాలు ఉన్నా కొందరు పరీక్షలకు వెనకాడడంతో క్షేత్రస్థాయి వాస్తవ చిత్రం మాత్రం వెలుగులోకి రావట్లేదు. అవగాహన కల్పిస్తే పరిస్థితిలో మార్పు రావచ్చు. ఎన్‌సీడీ 3.0 సర్వేలో క్యాన్సర్ పీడితుల స్క్రీనింగ్‌లో 225 ప్రశ్నలు అడిగేవారు. వీటికి సమాధానాలు రాబట్టడం సాధ్యం కాక ఆ సర్వేలో స్పష్టమైన ఫలితాలు రాలేదు. దాంతో 4.0 సర్వేలో ప్రశ్నలను 28కి కుదించారు. క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పించేందుకు సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సెర్ప్ విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లనూ భాగస్వాములను చేశారు.శాఖల మధ్య సమన్వయం, కచ్చితమైన సమాచార సేకరణ, అవగాహన కార్యక్రమాలు, పర్యవేక్షణ, వైద్య పరీక్షలతో బాధితులను గుర్తించి ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్లలో చేర్పించడం లాంటి లక్ష్యాలను వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్దేశించుకుంది. ఇవి సాకారమైతే లక్ష్యాలు చేరుకునే వీలుంది.

# తిరుమల 'వైకుంఠద్వారం' ఆన్‌లైన్

>> నేరుగా తిరుమలకు వచ్చినా సామాన్యభక్తులను యధావిధిగా సర్వదర్శనంలో అనుమతిస్తారు. డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో మూడురోజులు ఆన్‌లైన్‌లో సర్వదర్శనం టోకెన్లు తప్ప మిగిలిన అన్ని దర్శనాలు రద్దుచేశారు. వివిఐపిలు, విఐపిలు స్వయంగా వస్తేనే వారికి వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు.జనవరి 2వతేదీ నుండి 8వరకు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శనాల టిక్కెట్లురోజుకు 15వేలు, శ్రీవాణి ట్రస్ట్ దర్శనాలు రోజుకు వెయ్యిలెక్కన ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. గత ఏడాది వరకు సామాన్యభక్తుల కోసం ఆఫ్‌లైన్‌లో అమలైన టోకెన్ల విధానం పూర్తిగా రద్దుచేశారు. ఈ ఏడాది డిసెంబర్ 30,31తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి దర్శనాలతోబాటు అదనంగా మరో ఎనిమిదిరోజులవైకుంఠ ద్వార దర్శనాల విధానంపై మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ధర్మకర్తలమండలి అత్యవసర సమావేశమైంది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం, వింగ్ విఎస్‌ఒ ఎస్టీవిరామ్‌కుమార్, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నర్సిరెడ్డి, పనబాకలక్ష్మి, శాంతారామ్, జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎంఎస్ రాజు,సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి,పిఆర్‌ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

**గతంకంటే భిన్నంగా:** 2020వ సంవత్సరం వరకు తిరుమల ఆలయంలో వైకుంఠద్వార దర్శనం ఏకాదశి,ద్వాదశి ఘడియల్లోమాత్రమే 48గంటలు పాటు ద్వారాలు తెరచి భక్తులను అనుమతించేవారు. ఆ తరువాత సామాన్యభక్తుల నుండి వచ్చిన వినతులు, వైష్ణవాలయం శ్రీరంగంలో అమలవుతున్న పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలను అప్పటి వైసిపి బోర్డు అమలుచేసింది. అయితే ఆన్‌లైన్‌తోబాటు ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో పదికౌంటర్లలో ఉచిత సర్వదర్శన టోకెన్లు జారీచేసి అనుమతించేవారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన విషాద ఘటనలతో టోకెన్లకోసం వచ్చి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం, యాభైమందివరకు క్షతగాత్రులయ్యారు.ఈ ఘటనతో టిటిడి ప్రస్తుత బోర్డు కొన్ని మార్పులు చేపట్టింది. గత ఏడాది వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో అమలైన ఆఫ్‌లైన్‌ను పూర్తిగా రద్దుచేశారు. ఆ స్థానంలో ఆన్‌లైన్‌లో ఈ డిప్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చారు. మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో కీలకంగా నిర్ణయాలు తీసుకున్నారు. డిసెంబర్ 30నుండి 2026 జనవరి 8వతేదీ వరకు పదిరోజులు వైకుంఠద్వార దర్శనాలు అమలవుతాయి. 182 గంటలు దర్శన సమయంలో 164 గంటలు దర్శనం సామాన్యభక్తులకుకేటాంచారు. సామాన్యభక్తులకు ప్రాధాన్యతనివ్వడం కోసం తొలిమూడురోజులు ఎస్ఇడి టిక్కెట్లు, శ్రీవాణి టిక్కెట్లు రద్దుచేశారు. అన్ని ఆర్జితసేవలు,ప్రత్యేక దర్శనాలు నిలుపుదలచేశారు. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే దర్శనాలు అనుమతిస్తారు. సిఫార్సులేఖలు స్వీకరించరు.

**పవిత్రమైన 30,31తేదీల్లో ఆన్‌లైన్‌లోనే టోకెన్లు:** డిసెంబర్ 30,31 వైకుంఠ ఏకాదశి,ద్వాదశి పర్వదినాలతోబాటు జనవరి 1కి సంబంధించి అన్ని టోకెన్లు ఆన్‌లైన్‌లో ఈ డిప్ ద్వారానే కేటాయించేందుకు నిర్ణయించారు. ఇందుకు పారదర్శకంగా అమలుచేసేందుకు భక్తులు టిటిడి వెబ్‌సైట్, మొబైల్‌యాప్, వాట్సాప్‌ద్వారా ఈ డిప్‌కోసం తెలుగు,తమిళం, హిందీ,కన్నడ,ఆంగ్ల భాషల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. నవంబర్ 27వతేదీ నుండి డిసెంబర్ 1వతేదీ వరకు టోకెన్ల కోసం ఈ డిప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డిప్‌లో ఎంపికైన వారికి డిసెంబర్ 2వతేదీ దర్శన సమాచారాన్ని పంపుతారు. తిరుపతి,తిరుమలలో ఉంటున్న స్థానికులకు జనవరి 6,7,8తేదీల్లో వైకుంఠద్వార దర్శనాలకు రోజుకు ఐదువేల టోకెన్లు మొదట వచ్చినవారికి మొదట అనే విధానంలో ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీచేస్తారు. పదిరోజులు తొమ్మిదిలక్షలమందివరకు భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు చేయించాలని ప్రణాళికలు సిద్దంచేశారు. అయితే ఆఫ్‌లైన్‌లో టోకెన్లు విడుదల లేకపోవడంతో సామాన్యభక్తులు నిరాశచెందుతున్నారు.

# రాష్ట్రమంతా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

>> పోల్చుకుంటే ఇప్పటివరకు ధాన్యం అమ్మిన రైతుల సంఖ్య 36 కు పెరిగిందన్నారు. వీరిలో ఎక్కువగా చిన్న సన్నకారు రైతులు ఉన్నారని దాదాపు 6,600 మంది కౌలు రైతులు కూడా సద్వినియోగం చేసుకోగలిగారన్నారు. గత సంవత్సరం సుమారు రూ. 12 వేల కోట్ల దాకా ధాన్యం కొనుగోలు చేసినప్పుడు 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చెప్పిన మాట నెరవేర్చుతూ రైతుల ఖాతాల్లో నగదు చెల్లిస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. ఈసారి ఒక ఛాలెంజ్ గా రైతులకు నగదు చెల్లింపుల విషయాన్ని సవాల్ గా తీసుకుని 48 గంటలు కాస్తా 24 గంటలకే రైతుల ఖాతాలో నగదు జమ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటివరకు రూ. 560 కోట్ల 48 లక్షల మంది రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. దీనికొక ఉదాహరణగా గుంటూరు మండలంలోని పత్తిపాటి సుబ్బారావు అనే రైతు ఆయన ఖాతాలోకి రూ. 2 లక్షల 8 వేల ను 6 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఏలూరు జిల్లా భీమడోలు లో నీలం త్రిమూర్తులు అనే రైతు ఖాతాలోకి 5 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. గోనె సంచుల సమస్య లేకుండా 6 కోట్ల 34 లక్షల గోతాలను రైతు సహాయ కేంద్రాల్లో రైతాంగానికి అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి వాహనానికి జిపిఎస్ డివైస్ ఏర్పాటు చేసి పూర్తి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో అల్పపీడన తుఫాన్ హెచ్చిరికల నేపథ్యంలో 50 వేల టార్పాలిన్ లు ప్రతి రైతు సహాయ కేంద్రాల్లో జిల్లా స్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు సుమారు 19 వేల టార్పాలిన్ లు రైతు సహాయ కేంద్రాల్లో రైతాంగానికి ఉచితంగా అందించడం జరిగిందన్నారు. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ద్వారా రైతాంగానికి వాళ్ళు ధాన్యాన్ని ఎక్కడ, ఏ టైమ్ కు, ఏ రోజు, ఏ మిల్లుకి అమ్ముకోవాలనేది వాళ్ళే నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఈరోజు వరకు దాదాపు 500 మంది రైతులు ఈ వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకున్నారన్నారు.

## వారం - వర్జ్యం

19-11-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
చతుర్దశి ఉ.9.44
స్వాతి ఉ.7.59, విశాఖ కార్తె
వర్జ్యం : మ.2.17-4.05
దు.ఉ.11.31-12.36
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** పట్టుదల, ఓర్పుతో ముందుకుసాగుతారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** సంఘంలో మీ మాటకు గౌరవం లభిస్తుంది. నూతన ఉద్యోగాలలో ప్రవేశిస్తారు. ఆచితూచి నిర్ణయాలు తీసుకొంటారు.

**మిథునం:** నూతన ప్రయత్నాలకు సన్నిహితుల సహాయ సహకారాలు లభిస్తాయి. దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**కర్కాటకం :** వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.వాహన సౌఖ్యం కలదు.

**సింహం:** నూతన పెట్టుబడులు అనుకూలంగా ఉంటాయి. పోటీ పరీక్షలలో పాల్గొంటారు. చర్చలు, శుభకార్యాలలో ఎక్కువగా పాల్గొంటారు.

**కన్య :** భాగస్వామ్య వ్యాపారాలలో ఆశించిన నిర్ణయాలు తీసుకోవడం మంచిది.జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

**తుల :** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు.క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. బంధువుల కలయిక. సంతానం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు.

**ధనుస్సు:** సంతాన విషయంలో కొంత ఆందోళన చెందుతారు. దైవ సంబంధిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** నిర్మొహమాటమైన మీ మాటల వల్ల సన్నిహితులు దూరమవుతారు. మెలకువలో వ్యవహరించండి. సోదరుల కలయిక.

**కుంభం:** విదేశాలలో ఉన్న మిత్రుల నుండి కానుకలు అందుకుంటారు. సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**మీనం :** నూతన వ్యాపార యత్నములను, కొద్ది కాలం వాయిదా వేయడం మంచిది. వివాదాలకు దూరంగా ఉండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వైభవంగా సత్యసాయి రథోత్సవం

>>ను హత్తుకొనే స్వామి వారి కీర్తనలతో గతంలో కంటే భిన్నంగా వేణుగోపాల స్వామి రథోత్సవం స్థానంలో సత్యసాయి రథోత్సవాన్ని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వర్గాలు నిర్వహించాయి. వేద పండితుల వేద పఠనంతో మంగళవారం ఉదయం నుండే సాయినామ స్మరణలు, వివిధ కళారూపాల ప్రదర్శనలతో ఆధ్యాత్మికత శోభతో పుట్టపర్తి పుర వీధులు పులకించాయి. భానుడి ఉదయపు కిరణాలు తాకగానే పెద్దవెంకమరాజు కళ్యాణ మండపం వద్ద రథోత్సవం వైభవోపేతంగా ముందుకు కదిలింది. సత్యసాయి రథోత్సవాన్ని పురస్కరించుకొని నూతనంగా తయారు చేసిన వెండి రథం కళాకృతులు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా రథం పైభాగంలో గోపురాకార శిరస్సు, చుట్టూ స్వామివారి జీవన సందేశాలను స్మరింపజేసే శిల్పాలు, గంటల అలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీసత్యసాయి రథం యొక్క పసిడి కాంతుల తేజస్సు చూస్తూ భక్తులు తమను తాము మైమరచి పోయారు. తొలుత జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సత్యసాయి నూతన రథాన్ని రిమోట్ సహాయంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, ట్రస్ట్ సభ్యులు నాగనంద, స్థానిక శాసనసభ్యులు సింధూరరెడ్డి, పరిటాల సునీతమ్మ, మాజీమంత్రిపల్లె రఘునాథ్ రెడ్డి, స్వచ్ఛందకార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్, సినీ నటుడు మురళీమోహన్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తదితర ప్రముకులు పాల్గొన్ని బాబా పసిడి విగ్రహం, వెండి రథం, ఆధ్యాత్మిక కళాప్రదర్శనలను ప్రత్యక్షంగా వీక్షించి మధురానుభూతి చెందారు. ప్రత్యేక డ్రోన్‌ల ద్వారా సత్యసాయి రథోత్సవం సందర్భంగా పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలో 1,100 మంది దంపతులు భక్తిశ్రద్ధలతో శ్రీ సాయి సత్యనారాయణ వ్రతంను ఆచరించారు.

**సాయివిగ్రహ దర్శనానికి ఎగబడిన భక్తకోటి:** నూతనరథం ప్రశాంతి నిలయం ఉత్తర గోపుర ద్వారం వద్దకు చేరుకోగానే ప్రత్యేకంగా తయారు చేయించిన భగవాన్ సత్యసాయి పసిడి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచుతున్న వేళ భక్తులు సంభ్రమాశ్చర్యాలతో వీక్షించాలన్న ఆకాంక్షతో భారీ సంఖ్యలో ఎగబడ్డారు.

# నేడు ప్రధాని పుట్టపర్తి రాక

## సత్యసాయి సమాధి సందర్శన, ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంపు విడుదల

**అనంతపురం, నవంబరు 18 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి (శత జయంతి) వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 19వ తేదీన పుట్టపర్తిలో పర్యటించనున్నారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రధాని నరేంద్ర మోడీకి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్ , ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,తదితర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, శ్రీ సత్య సాయి సెంటర్ ట్రస్ట్ తరపున రత్నాకర్, తదితర ప్రతినిధులు స్వాగతం పలుకుతున్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఉదయం 10 గంటల ప్రాంతంలో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకొని నివాళులర్పిస్తారు. తదనంతరం సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో జరిగే శత జయంతి ఉత్సవాల ప్రధాన కార్యక్రమంలో ఆయన పాల్గొనిప్రసంగిస్తారు. అనంతరం 100 (వంద రూపాయల) స్మారక నాణెం , ప్రత్యేక పోస్టల్ స్టాంపు సెట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేయనున్నారు. అనంతరం ప్రధానమంత్రి తమిళనాడులోని కోయంబత్తూరుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:30 గంటలకు నిర్వహించే దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సును ఆయన అధికారికంగా ప్రారంభిస్తారు.ఈ వేదికపై ప్రధానమంత్రి పిఎం ప్రధాన మంత్రి యోజన 21వ విడతను విడుదల చేస్తారు.

# 21న రాష్ట్రపతి ముర్ము శ్రీవారి దర్శనం

**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** భారతరాష్ట్రపతి ద్రౌపదిముర్ము 21వతేదీ శుక్రవారం తిరుమలకు వస్తున్నారు. రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా 20వతేదీ సాయంత్రం 3.25గంటలకు రేణి గుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుండి రోడ్డుమార్గంలో తిరుచానూరుకు చేరుకుని పద్మావతిఅమ్మవారిని దర్శనం చేసుకుని రోడ్డు మార్గంలో సాయంత్రం తిరుమల పద్మావతి అతిధిగృహం వస్తారు. రాత్రికి ఇక్కడే బస చేస్తున్న రాష్ట్రపతి 21వతేదీ ఉదయం 9.30 గంటలకు ఆలయ క్షేత్ర ప్రాశస్త్యాన్ని పాటిస్తూ వరాహస్వామిని దర్శించుకుంటారు. అనంతరం ఉదయం 10గంటలకు తిరుమల ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకుంటారు.అనంతరం తిరుపతి విమానాశ్రయం నుండి హైదరాబాద్‌కు ప్రయాణమవుతారు.

# పరకామణికేసులో నిష్పాక్షిక విచారణ

>> టిటిడి బోర్డులో కూడా చర్చచేశారు.ఓ ఉద్యోగి ఏకంగా కానుకలనే చోరీచేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందనేది బలమైన ఆరోపణలు. ఈ నేపథ్యంలో సిఐడి అధికారులు లోతైన విచారణ చేస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండో ప్రాకారం నిర్మాణానికి ఈనెల 27వతేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమిపూజలో పాల్గొంటారని ఛైర్మన్ నాయుడు తెలిపారు. ఈ సమావేశంలో టిటిడిఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం, వింగ్ విఎస్‌ఒ ఎస్టీవిరామ్‌కుమార్, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నర్సిరెడ్డి, పనబాకలక్ష్మి, శాంతారామ్, జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎంఎస్ రాజు,సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి,పిఆర్‌ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## సానుకూల స్పందన

>> కూడా దశలవారీగా ప్రారంభమయ్యాయని, కొనుగోలు ప్రక్రియ మొదలైందని తెలిపారు.అయితే మోంథా తుఫాన్ ప్రభావంతో పత్తి నాణ్యత సిసిఐ నిర్ధేశించిన ప్రమాణాలకు విరుద్ధంగా ఉండడంతో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని,మిగిలిన మూడు అంశాలైన ఎల్1,ఎల్2,ఎల్3 జిన్నింగ్ మిల్లులను ఒకేసారిప్రారంభి ంచేలాచర్యలు,వాతావరణం కారణంగా తేమ శాతం 12శాతం నుండి 18శాతం వరకు ఉన్న పత్తిని కొనుగోలు చేస్తారని తెలిపారు.

## షాక్‌కు గురయ్యాం: హైకోర్టు

>> అధికారులు సైతం పాల్గొనేందుకుకోర్టు వెసులుబాటు కల్పించింది. తదుపరి విచారణను న్యాయస్థానం డిసెంబరు 2కి వాయిదా వేసింది.

## రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సందడి

**విజయవాడ, నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు సంబంధించిన సందడి ఆరంభం కానున్నది,ఈ నెలాఖరు లోగా ఓటర్ల జాబితా ప్రచురణ ఎన్నికల అధికారుల నియామకం పూర్తి చేయాల్సి ఉందని ఇటీవల ఎస్ఇసి వెల్లడించారు.

ఈ నెల 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు చేసి, ఈవీఎంల సన్నాహాలు పూర్తిచేయాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఓటింగ్ ఈవీఎంలపై నిర్వహించాలా, బ్యాలెట్ బాక్స్‌ల్లో నిర్వహించాలనే అంశం దిశలో ఎన్నికల సంఘం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. పోటీల్లో నిలిచే ఎస్ఇసీ ప్రణాళిక సిద్ధం చేసిందని సమాచారం.నోటిఫికేషన్ తరువాత ప్రస్తుతం అధికారంలో ఉన్న స్థానిక సంస్థల పాలక వర్గాలు తమ పవర్స్ కోల్పోతాయి.

## అమిత్ షా డెడ్‌లైన్‌కు ముందే హిడ్మా ఎన్‌కౌంటర్!

**న్యూఢిల్లీ, నవంబర్ 18:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా మృతిచెందాడు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విధించిన డెడ్‌లైన్ కంటే ముందే హిడ్మాను ఎన్‌కౌంటర్ చేశారు. నవంబర్ 30లోపే హిడ్మా ఆటకట్టించాలని భద్రతా బలగాలను అమిత్‌షా ఆదేశించినట్లు సమాచారం. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించాలని అమిత్ షా గడువు విధించారు. ఈ క్రమంలో జరిగిన భద్రతా సమీక్షా సమావేశంలో నవంబర్ 30లోగా హిడ్మా పనిపట్టాలని భద్రతా బలగాలకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆ డెడ్‌లైన్ కన్నా ముందుగానే ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో హిడ్మా మృతిచెందడం గమనార్హం అని సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతోన్న ఆపరేషన్లను చూస్తుంటే మార్చి కంటే ముందుగానే నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని అంచనావేశాయి.

# జోగి రమేష్‌పై మరిన్ని కేసులు

>> నరసాపురానికి చెందిన తమ్మ కల్యాణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కృత్తివెన్ను జడ్పీటీసీ మైలా రత్నకుమారి, జోగి ప్రధాన అనుచరుడు శ్రీనివాసరెడ్డి, మైలా రమేశ్, మైలా మహేశ్‌రాజు, వై.వెంకటరాజుపై ఐపీసీ సెక్షన్లు 420, 386, 506 రెడ్ విత్ 34 కింద కేసు కట్టారు. ఇంతేరులో సర్వే నం.94లోని 30 ఎకరాల మడ, పంచాయతీ భూమిని ప్రైవేటు భూమి అని చెప్పి ఎకరం రూ.3 లక్షలకే ఇస్తున్నామంటూ బేరం పెట్టారు. ఒక్కొక్కరికి 2.5 ఎకరాలు అగ్రిమెంట్ చేస్తామని 12 మంది నుంచి రూ.7.50 లక్షలు చొప్పున వసూలు చేశారు. భూమి తమదేనని నమ్మించేందుకు అగ్రిమెంట్లు చేసుకొని తొలుత అడ్వాన్స్ తీసుకుని జోగి వద్దకు వెళ్లి మాట్లాడాక మిగిలిన డబ్బులు తీసుకున్నారని బాధితులు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయట్లేదని కృత్తివెన్ను తహసీల్దార్ కార్యాలయంలో భూముల గురించి విచారించారు. అవి మడ భూములని తేలడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని జోగి, ఆయన అనుచరులను అడితే ప్రభుత్వం తమదేనని, ఏదో విధంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇబ్బంది లేకుండా చూస్తామని నమ్మించారు. 2021లో ఘటన జరిగినా అప్పుడు జోగి మంత్రిగా ఉండడం, డబ్బులు అడిగితే చంపుతామంటూ అనుచరులు బెదిరింపులకు దిగడంతో ఎక్కడా ఫిర్యాదు చేయలేదు. ప్రభుత్వం మారాక తమ డబ్బులు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. దీంతో జోగి రమేష్, ఆయన అనుచరుల అరాచకాలు వెలుగులోకి వచ్చాయి. ఆధారాలను బాధితుడు పోలీసులకు అందించారు. త్వరలో జోగిపైనా కేసు నమోదు కానుందని సమాచారం.

19-11Pg3exHNWMJQE 3 GNT_19-11Pg3exHNWMJQE.qxd 19/Nov/25 12:39 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
45 years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 288 పేజీలు: 12 వెల: 6.50

# రాష్ట్రమంతా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం



### ఇప్పటిదాకా 2.36 లక్షల మె.ట ధాన్యం కొనుగోలు
### పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా 32,793 మంది రైతుల నుండి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసి దాదాపు రూ. 560 కోట్ల రైతుల ఖాతాల్లో జమ చేశామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ రూరల్ లోని కానూరు సివిల్ సప్లైస్ భవన్ లో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులు మాపై ఉంచిన నమ్మకం, భరోసా తో నిజాయితీగా, పారదర్శకంగా ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. రైతులు ఆశించిన మేరకు క్షేత్ర స్థాయిలో దాదాపు 16,000 మంది సిబ్బంది ఇందుకు కృషి చేస్తూ జిల్లా స్థాయిలో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతరం కొనగోళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. దీనిలో భాగంగా నేటి వరకు 32,793 మంది రైతుల నుండి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసి రూ. 560 కోట్ల 40 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఇది గత సంవత్సరంతో పోల్చితే 30 అదనంగా పెరిగిందన్నారు. గత ఏడాది ఇదే రోజున 1,81,885 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం ప్రణాళికాబద్దంగా క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహిస్తూ రైతాంగానికి కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కొంతమంది రైతులకి కొన్ని ప్రాంతాల్లో రైస్ మిల్లర్లకు లబ్ధి చేకూర్చేలా గత ప్రభుత్వాలు చేసిన నిర్వాహకాలు అందరికే తెలిసిందేనన్నారు. గత ఏడాదితో >>2

## మారేడుమిల్లిలో భారీ ఎన్‌కౌంటర్

### మావోయిస్టు అగ్రనేత
# హిడ్మా హతం

భార్య రాజె సహా మరో నలుగురు ఎన్‌కౌంటర్

హిడ్మాపై కోటి రూపాయల రివార్డు, రాజెపై 50 లక్షలు

మరి కొందరు మావోయిస్టులను అదుపులోకి తీసుకొన్న పోలీసులు

విజయవాడ, రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల్లో మొత్తం 57 మంది అరెస్టు



హిడ్మా(ఫైల్)

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత మద్ది హిడ్మా,మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో ఖతమైనట్లు ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ధృవీకరించారు. పోలీసులతో మావోయిస్టులు జరిపిన ఎదురు కాల్పుల్లోఆరుగురు చనిపోయారని,వారిలో అతని భార్య రాజే ఉన్నట్లు తెలిపారు.



మంగళవారం విజయవాడ ఆటోనగర్ ప్రాంతంలో మావోయిస్టుల కోసం వెతుకుతున్న పోలీసులు

రాష్ట్రంలో మావోయిస్టుల ఆటలను సాగనిచ్చేది లేదన్నారు. రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలను గుర్తించిన నేపథ్యంలో అయిదు జిల్లా మావోయిస్టులను అదుపులో తీసుకున్నామని తెలిపారు. క్యూంబింగ్ ఇంకా జరుగుతుందన్నారు. కృష్ణాజిల్లా, విజయవాడ, కాకినాడలో మావోయిస్టులను అరెస్టు చేశాం. మెత్తం 31 మంది మావోయిస్టులను అరెస్టు చేశాం. అరెస్ట్ చేసిన వారిలో 9 మంది సెంట్రల్ కమిటీ సభ్యులు ఉన్నారు. ఈరోజు ఉదయం 6.30 నుంచి 7 గంటల సమయంలో ఎన్‌కౌంటర్ జరిగింది. రెండ్రోజులుగాఇంటలిజెన్స్ సమాచారంతో గాలింపుచర్యలువిస్తృతం చేశామనివివ రించారు. **విజయవాడలో 57 మంది మా వోయిస్టుల అరెస్టు:** కానూరు లోని కొత్త ఆటో నగర్ ప్రాంతంలో పోలీసులు, >>2

## సతీష్ మృతిపై షాక్‌కు గురయ్యాం: హైకోర్టు

**విజయవాడ,నవంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:**పరకామణి చోరీ కేసు ఫిర్యాదుదారు సతీష్ మృతిపై షాక్‌కు గురయ్యామని ఏపీ హైకోర్టు పేర్కొంది. ఫిర్యాదుదారులు,సాక్షులకు భద్రత కల్పించాలని ఆదేశించింది.పరకామణి చోరీ కేసుపై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. టిటిడి మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ మృతి నేపథ్యంలో కోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. సాక్షులతో పాటు నిందితుడు రవికుమార్‌కు పోలీసు రక్షణ కల్పించాలని ఆదేశించింది. దర్యాప్తు పూర్తయ్యేవరకు రక్షణ కల్పించాలని సీఐడీ డీజీకి ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసు దర్యాప్తులో సీఐడీ డీజీ, కింది స్థాయి >>2

## జోగి రమేష్‌పై మరిన్ని కేసులు!

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేష్‌పై పోలీసులు మరిన్ని కేసులు నమోదు చేసే దిశలో కీలక సాక్ష్యాధారాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఆయన అనుచరులు అయిదుగురిపై ఈ కేసులు నమోదు చేసారు.ఈ కేసుల్లో జోగిని నిందితునిగా నమోదు చేసేందుకు అవసరమైన సాక్ష్యాలు పోలీసులు దగ్గర ఉన్నాయంటున్నారు. కృత్తివెన్ను మండలం ఇంతేరులోని మడ, పంచాయతీ భూములను ప్రైవేటు భూములని చెప్పి పలువురు నుంచి రూ.90లక్షలు వసూలు చేసిన వైనంపై ఆయన అనుచరులు ఐదుగురిపై కృత్తివెన్ను పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. >>2

### నకిలీ మద్యం కేసు
## నిందితుల పోలీసు కస్టడీకి అనుమతి

**విజయవాడ,నవంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:**నకిలీ మద్యం కేసులో నిందితుల పోలీసు కస్టడీకి 2వ సారి న్యాయస్థానం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది . నకిలీ మద్యం కేసులో కీలక నిందితులు జనార్ధన్ రావు, జగన్మోహన్ రావులను 5 రోజుల పాటు కస్టడీకి కోరుతూ ఎక్సైజ్ అధికారులు పిటీషన్ దాఖలు చేశారు. పిటీషన్ పై విచారణ జరిపిన ఎక్సైజ్ కోర్టు ఏ1 జనార్ధన్ ,ఏ2 జగన్మోహన్ లను 4 రోజుల పాటు కస్టడీకి అనుమతించింది. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు విచారించుకోవచ్చని ఎక్సైజ్ అధికారులను ఆదేశించింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు విచారించు >>2

# ఏపిని కేన్సర్ రహితం చేస్తాం

### ఆ వ్యాధితో రాష్ట్రంలో యేటా 30వేలమంది మృతి
### కొత్తగా 75 వేల కేసులు వస్తున్నాయి
### బాధితుల గుర్తింపునకే ఎన్‌సిడి 4.0కు శ్రీకారం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీని క్యాన్సర్ రహితంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పానికి ప్రజలు అండగా ఉండాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు. క్యాన్సర్ బాధితులను గుర్తించడానికి వీలుగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 4.0 సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేసారు.సకాలంలో గుర్తిస్తే కాన్యర్స్‌ను ప్రాణాంతకం కాకుండా రోగులను సంరక్షించవచ్చునన్నారు. రొమ్ము క్యాన్సరును నియంత్రించడం చాలా సులభతర పరిస్దితులు అందుబాటులోకి వచ్చాయన్నారు.ఈ దిశలో ప్రపంచ స్దాయిలో వైద్యరంగ సంస్దలతో ప్రభుత్వం పలు ఒప్పందాలు చేసుకుందని తెలిపారు.ఈ మేరకు సీఎం చంద్రబాబు స్దానిక సంస్దలు, విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు,ఆస్పత్రులకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా సమాచార పత్రాలను పంపించారు.ఈ పత్రాల్లోని సమాచారాన్ని అనుసరించి రాష్ట్రంలో క్యాన్సర్‌తో ఏటా 30 వేల మంది చనిపోతున్నారు. 75 వేల కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించి వారికి సరైన వైద్యం అందించి తీవ్రతను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. బాధితులను గుర్తించడానికి గతంలో చేపట్టిన ఎన్‌సీడీ (అసాంక్రమిక వ్యాధుల) 3.0 సర్వే ఫలితాలు సంతృప్తికరంగా రాలేదు. దీంతో ఈ సంవత్సరం ఏప్రిల్ 21 నుంచి సెప్టెంబరు 10వరకు 18 వేల మంది వైద్యులు, సహాయకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. క్యాన్సర్ బాధితులను గుర్తించడానికే ఎన్‌సీడీ 4.0 సర్వేకు శ్రీకారం చుట్టారు. 2026 ఏప్రిల్ నాటికి ఈ సర్వే పూర్తి అయితే వాస్తవ పరిస్థితిపై స్పష్టత రానుంది. క్యాన్సర్ కేసులను గుర్తించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ క్రమంలోనే ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని సలహాదారుగా నియమించింది. ఈయన నేతృత్వంలో రాష్ట్రంలో క్యాన్సర్ కట్టడి చర్యలు మొదలయ్యాయి. ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలో నమోదైన క్యాన్సర్ కేసులతో పాటు ఇతర వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న కేసుల వివరాలను ఒకచోట క్రోడీకరించడం, ఎన్‌సీడీ 4.0 సర్వే ద్వారా గుర్తించిన కేసుల ఆధారంగా రాష్ట్రంలో వాస్తవ పరిస్థితిపై స్పష్టతకు రానున్నారు.ఈ డేటా, మ్యాపింగ్‌లతో ఏయే జిల్లాల్లో, మండలాల్లో, ప్రాంతాల్లో కేసుల తీవ్రత ఎక్కువగా ఉంది? ప్రమాద కారకాలేంటి? నివారణ చర్యలకు ప్రణాళికలు తదితర అంశాలతో క్యాన్సర్ అట్లాస్ రూపొందిస్తారు. ఈ సమగ్ర నివేదిక రాచపుండు కట్టడికి మార్గదర్శకమవుతుందని భావిస్తున్నారు. గత సంవత్సరం నవంబర్‌లో నిర్వహించిన ఎన్‌సీడీ 3.0సర్వేలో రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ బాధితులను గుర్తించారు. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిలో కొందరు వివరాలు చెప్పడానికి, పరీక్షలకు చేయించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. తద్వారా వాస్తవ పరిస్థితులు అనేవి వెలుగులోకి రావడం రాలేదు. తాజా సర్వేలో కేవలం క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని మాత్రమే గుర్తించనున్నారు. సర్వే లక్ష్యాలపై జనంలో అవగాహన కల్పించేందుకు సామాజికమాధ్యమాల్లో విస్తృతప్రచారంతో >>2







## పత్తిరైతుల సమస్యలపై కేంద్రం సానుకూల స్పందన: మంత్రి అచ్చెన్నాయుడు

**సచివాలయం,నవంబరు 18,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పత్తరైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరిచేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలపై మంచి పురోగతి జరుగుతోందని వ్యవసాయ, సహకార,పశుసంవర్ధక,మార్కెటింగ్,పాల,మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచెన్నాయుడు తెలిపారు.గతంలో లేఖద్వారా కేంద్రానికి సూచించిన ఆరు కీలక అంశాలపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని మూడు అంశాల అమలు ప్రక్రియను ప్రారంభించింది.దీనివల్ల పత్తి కొనుగోలులో ఏర్పడిన సమస్యలు పరిష్కారం వైపు సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు >>2

# పరకామణికేసులో నిష్పాక్షిక విచారణ

### టిటిడి బోర్డు నిర్ణయం
### బాధ్యులెవరైనా క్రిమినల్ కేసులు నమోదుచేయాలని తీర్మానం

**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన తిరుమల పరకామణిలోచోరీ కేసు ఉదంతంపై భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని, నిష్పక్షపాతంగా విచారణచేయాలని టిటిడి బోర్డు నిర్ణయించింది. ఇందుకు సిఐడి అధికారులకు అవసరమైన సహకారం టిటిడి అందిస్తుందన్నారు. ఈ కేసులో ఎంతటివారున్నా, ఎంతటివారైనా క్రిమినల్ కేసులు నమోదు చేసి సమగ్రదర్యాప్తు చేయాలని తీర్మానించారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ధర్మకర్తలమండలి అత్యవసర సమావేశమైంది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ,బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవునికి భక్తులు విశ్వాసంతో సమర్పించే కానుకలు పరకామణి భవనంలో లెక్కించేసమయంలో రవికుమార్ అనే ప్రైవేట్ ఉద్యోగి 2023లో 920 అమెరికన్ డాలర్లు చోరీ చేసినవిషయం పై సిఐడి విచారణ సాగిస్తోంది. ఈ కేసులో కీలకమైన,ఫిర్యాదిదారుడు పూర్వ ఏవిఎస్ఒ వై.సతీశ్‌కుమార్ హత్యకు గురవడంతో టిటిడి బోర్డులో తీవ్రంగా చర్చించారు. అనేక మలుపులు తిరిగిన ఈ చోరీ కేసు ఉదంతంలో లోక్‌అదాలత్‌ద్వారా రాజీ చేసిన వెనుక కుట్ర ఎవరిది,ఎవరు హస్తం ఉందనేది ఇప్పుడు తేలిపోనుంది. ఇందులో దర్యాప్తు పారదర్శకంగా, వేగంగా సాగుతున్న సమయంలో పూర్వ ఏవిఎస్ఒ హత్యకు గురైనట్లు ఆరోపణలపై >>2



రథాన్ని లాగుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఆర్‌జె.రత్నాకర్, మంత్రులు సత్యప్రసాద్, అనగాని

### తిరుమల 'వైకుంఠద్వారం'
# ఆన్‌లైన్

### తొలి మూడురోజులు ఇ-డిప్ సర్వదర్శన టోకెన్లు
### ఆ వారంరోజులు నేరుగా వస్తే సాధారణ సర్వదర్శనమే
### టిటిడి బోర్డు కీలక నిర్ణయం



మంగళవారం సమావేశమైన టిటిడి బోర్డు

**తిరుమల,నవంబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమంప్రకారం పూజలందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వారదర్శనాలను పూర్తిగా ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనే విడుదలచేసేలాతిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. గతంకంటే భిన్నంగా డిసెంబర్ 30వతేదీ వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి ,2026 నూతన ఆంగ్ల సంవత్సరం జనవరి 1న దర్శనాలకు సంబంధించి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఈ డిప్ ద్వారా సర్వదర్శనం టోకెన్లు విడుదల చేస్తారు. ఈ టోకెన్లు పొందిన వారిని మాత్రమే వైకుంఠద్వార దర్శనానికి అనుమతిస్తారు. జనవరి 2వతేదీ నుండి 8వతేదీ వరకు వారం రోజులు ఎటువంటి దర్శన టిక్కెట్లు, టోకెన్‌లు లేకుండా >>2

### వైభవంగా సత్యసాయి
# రథోత్సవం

### హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పలువురు మంత్రులు, ప్రముఖులు
### సత్యసాయి శతజయంతి వేడుకలకు భారీ ఏర్పాట్లు

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబరు 17, ప్రభాతవార్త ప్రతినిధి:**సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవాలలో భాగంగా పుట్టపర్తి పుర వీధులు సర్వం సాయి మయంగా మారాయి. ఆశేష జనవాహిని మధ్య 'సత్యసాయిరథోత్సవం' వైభవంగా జరిగింది. భక్తుల హృదయాల >>2

## నేడు ప్రధాని మోడీ పుట్టపర్తి రాక

వార్త

సరిదిద్దకుండా వదిలేసిన తప్పులను మించిన ఆపదలు మరేమీ ఉండవు.

-స్వామి వివేకానంద

# సౌదీలో చిదిమేసిన రోడ్డు ప్రమాదం!


అవాంఛనీయ సంఘటనలు, అనుకోని దుర్ఘటనలు ఎదురైతే ఇక మిగిలేది శోకమే. ప్రమాదాలు జరిగి కుటుంబ సభ్యులు యావత్తూ మరణించినా, ఆ కుటుంబానికి సాన్నిహిత్యమున్న వారు మరణించినా ఇంటిల్లిపాదీ శోకసముద్రంలో మునిగిపోతే ఆ సన్నివేశాలు గమనించిన వారెవరికైనా హృదయం ద్రవించక మానదు. సంఘటన స్థలం సౌదీ అరేబియా. మక్కా నుంచి మదీనా మార్గమధ్యంలో ముషహరత్ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి 1.30 ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సొకటి 45 మంది ప్రయాణికులను పొట్టన పెట్టుకుంది. ఆ ప్రమాదంలో వారంతా అగ్నికీలలకు సజీవ దహనమయ్యారు. వారిలో ఇద్దరు కర్ణాటక వాసులూ మృత్యువాతపడ్డారు. ప్రయాణికులందరూ భారతీయులే. అదీ ముఖ్యంగా దాదాపు అందరూ మక్కా యాత్రికులే. దైవ సన్నిధానికి వచ్చిన వారు తాము తొక్కిసలాటలో చనిపోతామనో, తాము ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదాలకు గురవుతుందనో అనుకుని బయలుదేరరు. అపశకునం మాటలు మాట్లాడుకోకుండా ఆ దైవం దివ్యానుగ్రహంతో తీర్థయాత్రలకు శ్రీకారం చుడతారు. కానీ విధి మరోలా జీవితాలతో ఆటలాడుకుంటోంది. భక్తి భావం నిండుగా గుడులు, గోపురాలు, మసీదులకు వెళ్తే అక్కడ అనుకోని తొక్కిసలాటలు ఎదురు చూస్తుంటాము. పరాయివ్యక్తిని నమ్మితే మోసం కాటేస్తుంది. ఎన్నో ఆధునిక సాంకేతిక వనరులు అందుబాటులో ఉన్నా అప్రమత్తంగా ఉన్నా, అనుకోని అవాంతరాలు, అంతరాయాలు, చివరికి ఎలా వెళ్లి ఎలా ఇళ్లు చేరుతామో అంచనాకందదు. అయినా అనుకున్నట్లుగా అంతా జరుగదు. సౌదీ దుర్ఘటనలో బుగ్గిపాలైన వారి మృతదేహాలు గుర్తుపట్టేందుకు కూడా మిగల్లేదు. వారిని గుర్తించాలంటే డిఎన్ఎ టెస్టుల వల్లే సాధ్యం. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఉమ్రా యాత్రకు హైదరాబాద్ నుంచి 54 మంది బయలుదేరారు. వారిలో 8 మంది అదృష్టవశాత్తూ మక్కాలో ఆగిపోయారు. అదే వారికి అదృష్టానికి దారి చూపింది. బస్సు ఎక్కలేకపోయారు. వారు మాత్రమే సురక్షితంగా ఉన్నారు. బస్సెక్కిన వారంతా మృతజీవులే. ఒక్కరంటే ఒక్కడే మృత్యుంజయుడిగా మిగిలారు. చెప్పాలంటే హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తమ మూడుతరాల వ్యక్తుల్ని కోల్పోయింది. ఆ ఇంటి పెద్ద నసీరుద్దీన్, ఆయన భార్యతో సహా 8 మంది పెద్దలు, పది మంది మనవలు, మనవరాళ్లు దుర్మరణం పాలయ్యారు. చితిలో భస్మాన్ని డిఎన్ఎకి పంపిన తర్వాతే వారెవరో గుర్తించగలిగేది. ఇలా ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందడం అత్యంత విషాదకర సంఘటన. ఎవరికైనా మనసు కలచివేస్తుంది. మక్కా యాత్రే తమ అంతిమ ఆఖరి మజిలీయని వారు అనుకొని ఉండరు. ఈ మధ్యకాలంలో తొక్కిసలాటలు, అగ్నిప్రమాదాలు, ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అప్పుడే కలికాలం వచ్చేసిందనుకునే రోజుల్ని చూస్తున్నాము. అందుకే ఎన్నడూలేని దుస్సంఘటనలను ప్రతిరోజూ చూస్తున్నామా? అనిపిస్తుంది. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, అతివేగం ప్రమాదకరమని అన్నివేళలా హెచ్చరిస్తూనే ఉన్నా జరుగరాని విషాదాలు జరిగిపోతూనే ఉన్నాయి. భారతదేశంలో జరిగే ప్రమాదాలకే మనం బెంబేలెత్తిపోతున్నాం. అతివేగం, అమిత నిర్లక్ష్యం పేరిట ఇచ్చే నినాదాలు వ్యర్థమైపోతున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి ప్రయాణాల్లో ఎక్కువ ప్రమాదాలు జరిగేవి నడిరోడ్డు మీదనే, చీకటిలోనే. ఆ సమయానికి బస్సుల్లో ప్రయాణికులు గాఢ నిద్రలోనే ఉంటారు. నిద్రలోనే గాల్లో కలిసిపోయే ప్రయాణీకులు ప్రాణాలు ఎన్నో. భారత కాలమానం ప్రకారం సౌదీలో ప్రమాదం జరిగిన సమయం సోమవారం తెల్లవారుఝాము. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొని బస్సుకు నిప్పంటుకోగానే బస్సులోని 45 మంది అగ్నికి ఆహుతయ్యారు. ఆ సమయానికి అందరూ నిద్రలోనే ఉన్నారు. 2019లో ఒకబస్సు మరో భారీ వాహనాన్ని ఢీకొని 35మంది, 2023 నుంచి మక్కా నుంచి వెళ్తున్న మరో బస్సు బ్రిడ్జిని ఢీకొట్టగా మంటలో చిక్కుకోగా 20 మంది మృత్యువాతపడ్డారు. నెలరోజుల క్రితం కర్నూలు శివారుల్లో ప్రైవేటు బస్సు మోటారు సైకిల్‌ను ఢీకొనగాగా రేగిన అగ్ని జ్వాలాలలకు ప్రయాణికులు పూర్తిగా దగ్గమయ్యారు. 15 రోజుల్నాడు చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని మరచిపోలేము. బస్సు డ్రైవర్ ఏమరుపాటుగా ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని విశ్లేషిస్తున్నా అతనిప్పుడు బతికిలేడు. కనుక నిజాలు తెలియవు. నిజానికి భారతీయ రోడ్లపై ప్రమాదాలకు, సౌదీలో రోడ్లకు మధ్య జరుగుతున్న ప్రమాదాలను విశ్లేషించాలంటే సాపత్యం ఉండదు. ఒకసారి ఆ ప్రాంతానికి వెళ్లిన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ చెబుతున్న దానిని బట్టి మక్కాలో బస్సులు, కార్లు గంటకు 180కి.మీ వేగంలో వెళ్తుంటాయి. అదే నిజమైతే అతివేగం నుంచి కట్టడి సాధ్యం కాదేమో. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో ఏ దేశంలోనైనా అతివేగాన్ని అరికట్టడం అత్యంత అవసరం. ప్రతి ముస్లిం తమ జీవితకాలంలో ఒకసారైనా మక్కా యాత్రకు వెళ్లిరావాలని తలపోస్తారు. ఈ యేడాది తెలంగాణ నుంచి 9వేల మందికిపైగా మక్కాకు బయలుదేరారు. నాలుగు ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలు వారి ప్రయాణపు ఏర్పాట్లు చూసాయి అనీసజావుగానే జరిగాయి. కానీ ఊహించని ప్రమాదానికి విగత జీవులౌతారని ఎవరూ అనుకొని ఉండరు. అందులో ప్రయాణించిన వారుహైదరాబాద్‌లోని 8 కుటుంబాలకు చెందినవారు. కుటుంబ పెద్దలు కోల్పోయిన వారూ ఉన్నారు. అలాంటి కుటుంబాల ఆలనా పాలనా చూసుకునేందుకు కూడా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం అవసరం.

పేదరికం కారణంగా ఇంతవరకూ ఏ దేశం సమిసిపోలేదు. అవినీతి కారణంగానే దేశాలు నేలమట్టమయ్యాయి.



నానీ పాల్కీవాలా

ఓరిమికి అపారమైన శక్తి ఉంది. దండించే అధికారం ఉన్నా దండించకపోవడం నిజమైన ఓర్మి.



ఎమ్.కె.గాంధీ

# ప్రజావాక్కు



## మనిషికి సాటిరాని కృత్రిమ మేధస్సు

డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కృత్రిమమేధస్సు సమాజాన్ని కొత్తదిశల్లో నడుపుతోంది. భాష, గణితం, డేటావిశ్లేషణ ఇలాంటి అనేక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతవేగంతో ముందుకు సాగుతున్నప్పటికీ, అది మనిషి సహజమేధస్సును భర్తీ చేయగలదనే అపోహమరింత ప్రమాదకరం. ఎందుకంటే యంత్రాలువేగాన్ని, ఖచ్చితత్వాన్ని అందించగలిగినా, భావోద్వేగం, నైతికత, సానుభూతి, సృజనాత్మకత ఇలాంటి మానవ విలువలను అవి పునరుత్పత్తి చేయలేవు. కృత్రిమ మేధస్సు అతిపెద్ద శక్తి దాని విశ్లేషణ సామర్థ్యం. వైద్యం నుంచి రవాణా వరకు, పంటల ఆరోగ్యం నుంచి వాతావరణ అంచనాల వరకు అన్నిరంగాల్లో ఇది సమర్థతను పెంచుతోంది. వ్యాధులను ప్రారంభదశలో గుర్తించడం, ట్రాఫిక్‌నియంత్రణ, లాజిస్టిక్స్‌లో వృథా తగ్గించడం వంటి అభివృద్ధులుప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## టీజీ సీడ్స్ బిల్లుపై రైతుల ఆందోళనలు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన టీజీ సీడ్స్ బిల్లు, 1966, 1983లో అమలులోకి వచ్చిన పాత విత్తన చట్టాలను భర్తీచేస్తూ, విత్తనాలనాణ్యత నియంత్రణను మరింత కఠినతరం చేయాలనే లక్ష్యంతో ముందుకు వస్తోంది. వ్యవసాయ రంగం వేగంగా మారుతున్న ఈ కాలంలో, జీవ సాంకేతికత ప్రాభవం పెరుగుతున్న నేపథ్యంలో, నూతన చట్టం అవసరం అనడం సందేహం లేదు. పాడు విత్తనాల కారణంగా సంవత్సరాలుగా నష్టపోతున్న రైతు లకు ఇది కొంతవరకు రక్షణనిచ్చే ప్రయత్నమే. అయితే, ఈ బిల్లుకు సంబంధించి రైతులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు గణనీయమైనవే.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

చలికాలం వచ్చింది. చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది. మంచులోఎదుటివాహనాలు కనిపించక పోవటం వల్ల, డ్రైవర్లు సరైన జాగ్రత్తలు పాటించక పోవటం వల్ల, రోడ్డు ప్రమాదాలు జరిగి, పలువురి ప్రాణాలు గాలిలోకలిసేప్రమాదంవుంది. మంచు కురుస్తున్నప్పుడు ప్రయాణాలకివిరామమిచ్చి, సరైనప్రణాళికలుసిద్ధం చేసుకోవాలి.

- మా. శ్రీ. రాజు, పాల్వంచ

## సుప్రీం ఆదేశాలను అమలు చేయాలి

గ్రామాలలో మున్సిపల్ కార్పొరేషన్ వీధిలలో కుక్కలే మనుషుల ప్రాణాలు తోడేస్తున్నాయి. రక్తంరుచి మరిగినట్టుగా మనుషులపైదాడిచేసి కరుస్తున్నాయి. ఈ మధ్యకాలంలోవీధి కుక్కలు సృష్టిస్తున్న బీభత్సం అంతా ఇంతా కాదు. చిన్నపిల్లలపై అవి క్రూరంగా దాడిచేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. ఆ రాష్ట్రం, ఈ రాష్ట్రమన్న తేడాలేదు. దేశమంతా ఇదే పరిస్థితి. ఈనేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం జనసమ్మర్ధ ప్రాంతాల్లో అస్సలు వీధికుక్కలు కనబడకూడదంటూ తీర్పునిచ్చి సంచలనం సృష్టించింది. జనం తిరిగే ప్రాంతాల్లో వీధికుక్కలు ఉండకూడదు.. తక్షణమే వాటిని రక్షణ కేంద్రాలకు తరలించి సంతాన నియంత్రణ చికిత్సలు చేయాలని కీలక ఆదేశాలు జారీచేసింది.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

## ధర్మపురిలో సమస్యల తిష్ఠ

జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో సమస్యలు తిష్ట వేశాయి ఎక్కడ చూసిన చెత్త చెదారంతో నిండి వుంది. నిత్యం వేలాది మంది భక్తులు ఈ ఆలయానికి వచ్చి గోదావరిలో పుణ్య స్నానం చేసి దర్శనం చేసుకుంటారు. కార్తీక మాసంలో ఎక్కువగా వస్తారు. ఆలయం లోపల కుక్కలు గుంపులుగా తిరుగుతూ ఉన్నాయి. ఎక్కడ దాడి చేస్తాయో అని భక్తులు భయం గుప్పిట్లో దర్శనం చేసుకుంటున్నారు. ధర్మపురి బస్టాండ్‌లో వున్న మరుగు దొడ్లు కంపు కొడుతూ ఉన్నాయి. నీటి సౌకర్యంలేదు. నగర పాలకసంస్థ అధికారులు ఆలయ అధికారులు స్పందించిధర్మపురి ఆలయ పవిత్రతను కాపాడాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## జూనియర్ కాలేజీల అడ్మిషన్ల దందా

తెలంగాణలో ప్రైవేట్ జూనియర్ కాలేజీలు వచ్చే రానున్న విద్యాసంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు తీసుకోవడం అనేది ఒక దందాగా మారింది. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా, ముఖ్యంగా పదోతరగతి పరీక్షలు ముగియకముందే అడ్మిషన్లు మొదలుపెట్టి, అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఈముందస్తు అడ్మిషన్ల ద్వారా విద్యార్థులను ఆకర్షించడానికి, ఫీజులు ఎక్కువ వసూలు చేయడానికి విద్యాశాఖ నిర్దేశించిన అడ్మిషన్ల షెడ్యూల్‌కు ముందే ప్రైవేట్ కాలేజీలు అడ్మిషన్లు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధం అయినప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నాయి. మరో మూడు నెలలకు కొత్త ఫీజు ఉంటుందని ఒత్తిడి చేస్తున్నాయి.

- పొద్దుటూరి జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అసైన్డ్ భూములు కార్పొరేట్లకు అప్పగింత!

**రాష్ట్రంలోకార్పొరేట్, కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ముమ్మరం చేయచూస్తున్నారు. లీజుకి తీసుకున్న భూముల్లో తమ ఇష్టం వచ్చిన పంటలను కార్పొరేట్లు పండిస్తారు. ఫలితంగా ఆహార పంటల కొరత ఏర్పడుతుంది. ఏదేశమైనా, రాష్ట్రమైనా భూసంస్కరణలు అమలు జరపకుండా పారిశ్రామిక అభివృద్ధిని సాధించలేవు. రాష్ట్రంలో భూసంస్కరణల అమలు బూటకంగా మారి పేదలకుభూమి దక్కలేదు. భూసంబం ధాల్లో మౌలికమైన మార్పులు రాలేదు. పాలక ప్రభుత్వాలు పేదలకు భూములు పంచకుండా, అసైన్డ్ భూములు, నిషేధిత భూములు, చిన్న, సన్నకారు రైతుల భూములు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నది. కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెట్టే రాష్ట్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ, లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు, నిషేధిత 22ఎ భూములు, మిగులు భూములు, అటవీ బంజరు భూములు పేదలకు పంపిణీ చేయాలని గ్రామీణ పేదలు, పేద రైతులు ఉద్యమించాలి.**

బొల్లిముంత సాంబశివరావు

అసైన్డ్ చట్టసవరణకు చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించింది. ఈ చట్టసవరణతో తమ భూములను రైతులు లీజుకి ఇచ్చుకోవచ్చని, లీజు ద్వారా 30నుంచి 40 వేలు పొందవచ్చని రైతాంగాన్ని మభ్యపెడుతుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ఇక నుంచి కూటమి ప్రభుత్వం అసైన్డ్ భూములు కేటాయిస్తుంది. ఆయా కంపెనీలు రాష్ట్రానికి రావడానికి ఆసక్తి చూపడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రివర్గం నిర్ణయం ప్రకటించింది. ప్రైవేట్ కంపెనీలకు లీజుకు ఇచ్చేందుకు 26,43,500 ఎకరాలను గుర్తించారు. న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్ఇడిసిఎపి) రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేసే రూరల్ బోర్డు ద్వారా లీజు ప్రక్రియ జరుగుతుంది. ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పినవారు, విస్తరణ అవసరాలకు భూములు తీసుకోవచ్చని చెప్పింది. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లోనూ కంపెనీలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. కంపెనీలు ప్రైవేట్ భూములను లీజుకి తీసుకుని ఉంటే, ఆ భూ యజమానులు ప్రయోజనం పొందేలా విధివిధానాలు రూపొందించారు. లీజు కింద అసైన్డ్ రైతులు పొందినట్లే ఏడాదికి లీజు డబ్బులు పొందవచ్చు. కౌలుకి ఇచ్చిన రైతుకుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని నిబంధనల్లో పేర్కొన్నారు. దీనివల్ల రైతుకు నికర ఆదాయం వస్తుందని చెప్పటమంటే, రైతులను మోసగించడమే. అధికారం చేతులు మారకముందు నుంచి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన వ్యవసాయకూలీలు (వీరిలో ఎక్కువ మంది దళితులు ఉన్నారు), పేద రైతులు బంజరు, పోరంబోకు భూములు, సముద్ర తీర భూములు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఈభూములకు పట్టాలు ఇవ్వాలని కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయకూలీ సంఘం అనేక ఆందోళనలు చేశాయి. ఆందోళనల ఫలితంగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం భూములకు డిపట్టాలు ఇవ్వటం జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన కొన్ని భూములు వెంటనే సేద్యానికి అనుకూలంగా లేకపోవడంతో, అలాంటి భూములు అన్యాక్రాంతం అయ్యాయి. భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం బలంగా ముందుకు రావడంతో ఆనాటి ప్రభుత్వం 9/1977 లో అసైన్డ్ చట్టం చేయడం జరిగింది. ఈ చట్టంలో అసైన్డ్ భూములు అమ్మటం, కొనటం నేరం. అలా చేసినవారు శిక్షలకు గురౌతారు. అన్యాక్రాంతమైన భూమి తిరిగి గుర్తించడానికి ఇవ్వటం అలా కాని పక్షంలో అర్హులైన మరో లబ్ధిదారునికి ఇవ్వాలి. ఈచట్టం చేసిన తర్వాత కూడా కొందరు బడాబాబులు అసైన్డ్ భూములు కబ్జా చేయటం జరిగింది. 2002లో అసైన్డ్ భూములు అమ్ముకోవటానికి అవకాశం కల్పిస్తూ జీవో తీసుకువచ్చే ప్రయత్నం చేయగా తీవ్ర వ్యతిరేకత వల్ల ఉపసంహరించుకుంది. అసైన్డ్ ఉన్నా భూములు కబ్జాఅవుతున్నా, దాన్ని నివారించకుండా, రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అసైన్డ్ చట్టాన్ని సవరిస్తూ 2006లో ఆర్డినెన్స్ జారీచేసి శాసనసభ ఆమోదం పొందింది. చట్టంలోని 4వ సెక్షన్, బిక్లాజు సవరణ ద్వారా అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని తిరిగి పేదలకే ఇవ్వాలనే నిబంధన నుంచి మినహాయింపు పొంది అమ్మేహక్కు, ఇష్ట



మైనవారికి ఇచ్చే అధికారం ప్రభుత్వం పొందింది. ఈ చట్ట సవరణ పేదలను భూములకు దూరం చేయడమే కాకుండా సెజ్లకు కట్టబెట్టే చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం అసైన్డ్ భూముల లెక్కలు తేల్చేందుకు జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తూ రెవిన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు రెవిన్యూ ప్రత్యేక కార్యదర్శి, ఏపీల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జీవో 104 జారీచేశారు. ఈ జిల్లా కమిటీకి ఇన్‌చార్జ్ మంత్రి చైర్మన్‌గా ఉంటాడు. జిల్లాకి చెందిన మంత్రులు సభ్యులుగా, జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా ఉంటారు. ఈక్రమంలో నిషేధిత 22ఎ జాబితా నుంచి తొలగించిన భూములు 13,59,000 ఎకరాలు ఉన్నాయని, ఇందులో 13,57,000 లక్షల ఎకరాల భూములను ప్రభుత్వం వెరిఫై చేసిందని చెబుతున్నారు. నిషేధిత 22ఎ భూములంటే ప్రభుత్వ యాజమాన్యం, చట్టపరమైన వివాదాలు, సీలింగ్ పరిమితుల కారణాలవల్ల రిజిస్ట్రేషన్ కాకుండా నిషేధించబడిన భూములు. ఈభూములు అమ్మడం, కొనడం, రుణం కోసం తనకా పెట్టడం సాధ్యంకాదు. ఇవి రిజిస్ట్రేషన్ చేయబడవు. అలాంటి భూములను నిషేధం నుంచి తొలగించి వాటిని లీజుకి ఇచ్చుకోవచ్చని పేర్కొంది. అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైతే, ఆ భూములు తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకే పంపిణీ చేయాలి. కాని కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధమైన చర్యలు తీసుకుంది. అన్యాక్రాంతం పేరుతో అసైన్డ్ భూములను, నిషేధం నుంచి తొలగించిన 22ఎ భూములు 13.59,000 ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. కార్పొరేట్లకు ఆ భూములను 99 సంవత్సరాల లీజుకి ఇవ్వటం అంటే, శాశ్వతంగా భూములు వారికి కట్టబెట్టటమే. పేదలను భూములకు దూరం చేసి వారిని కూలీలుగా మార్చడమే. గతంలో చంద్రబాబు ప్రోద్బలంతో కుప్పంలో కాంట్రాక్ట్ వ్యవసాయానికిభూములు ఇచ్చిన రైతులకు వచ్చిన చేదు అనుభవాలు ఇంకా వారిని వెంటాడుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాగుకి యోగ్యమైన భూమి కోటి, లక్ష ఎకరాలు. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 37 శాతం ఉంది. సాగు యోగ్యంగాని భూమి మూడు లక్షల ఎకరాలు ఉంది. సాగు భూమి సేద్యం చేసేవారికి చెందాలి. దేశంలో, రాష్ట్రంలో అందుకు విరుద్ధంగా సేద్యం చేయని పరాన్న బుక్కులైన భూస్వాముల వద్ద భూమి బంధించబడి ఉంది. 1973లో చేసిన భూసంస్కరణల చట్టం ద్వారా మిగులు భూమి 18 లక్షల ఎకరాలు. దాన్ని కుదింపులతో 7.9 లక్షలుగా తేల్చారు. అందులో 6.46 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని 5.92 లక్షల ఎకరాలను 4లక్షల, 79 వేలమందికి పంపిణీ చేసినట్లు పాలకులు లెక్కలు చెబుతున్నారు. దీన్ని గమనిస్తే భూసంస్కరణల చట్టం ఎంత బూటకంగా అమలు జరిగింది తెలుస్తున్నది. చంద్రబాబునాయుడు భూసంస్కరణలకు, చిన్న రైతుల వ్యవసాయానికి వ్యతిరేకం. వ్యవసాయం దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు. దాన్ని ఆచరణలో పెట్టడానికే లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలుఅమలు చేస్తున్నారు. ఆ విధంగా రాష్ట్రంలో కార్పొరేట్, కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ముమ్మరం చేయ చూస్తున్నారు. లీజుకి తీసుకున్న భూముల్లో తమ ఇష్టం వచ్చిన పంటలను కార్పొరేట్లు పండిస్తారు. ఫలితంగా ఆహార పంటల కొరత ఏర్పడుతుంది. ఏదేశమైనా, రాష్ట్రమైనా భూసంస్కరణలు అమలు జరపకుండా పారిశ్రామిక అభివృద్ధిని సాధించలేవు. రాష్ట్రంలో భూసంస్కరణల అమలు బూటకంగా మారి పేదలకుభూమి దక్కలేదు. భూసంబంధాల్లో మౌలికమైన మార్పులురాలేదు. పాలక ప్రభుత్వాలు పేదలకు భూములు పంచకుండా, అసైన్డ్ భూములు, నిషేధిత భూములు, చిన్న, సన్నకారు రైతుల భూములు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నది. కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెట్టే రాష్ట్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ, లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు, నిషేధిత 22ఎ భూములు, మిగులు భూములు, అటవీ బంజరు భూములు పేదలకు పంపిణీ చేయాలని గ్రామీణ పేదలు, పేద రైతులు ఉద్యమించాలి. ●

# ఊబకాయులలో నానాటికీ పెరుగుతున్న గుండె జబ్బులు!

బుగ్గన మధుసూదనరెడ్డి

ప్రపంచవ్యాప్తంగా గడిచిన నాలుగు దశాబ్దాల్లో ఊబకాయుల సంఖ్యరెట్టింపు అవుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. ఎందుకంటే ఇలా మానవాళి ఓ పద్ధతి పాడు లేకుండా ఇష్టానుసారం తమ ఒళ్లును పెంచుకుంటూ పోతేమాత్రం ప్రాణాంతకర వ్యాధులు అయిన గుండె జబ్బులు టైపు 2 దయాబెటీస్ బారిన పడే అవకాశాలు మూడు రెట్లు అధికం అని ఎంతో అనుభవాజ్ఞులు, తల పండిన డాక్టర్లు సైతం సెలవిస్తుండటాన్ని బట్టి స్థులకాయం అనేది మానవాళి జీవితాలను ఎంతటి ప్రమాదకర పరిస్థితులలోకి నెట్టి వేస్తున్నదో మనం ఇట్టే ఊహించవచ్చు. ముఖ్యంగా జంక్ ఫుడ్స్‌ను ఎక్కువగా తీసుకుంటుండటం, వేళ కానీ వేళల్లో భోజనానికి ఉపక్రమించడం, తాము చేసే పనిలో పూర్తిగా నిమగ్నం అయ్యి, పీకలదాకా కూరుకుపోయి భోజనాన్ని సైతం వాయిదా వేయడంతో పాటు, ఎడాపెడా చిరుతిండ్లు అంటే బిస్కెట్లు, స్నాక్స్, మిక్చర్, ఐస్ క్రీమ్స్, సమోసా వంటి వాటిని తీసుకుంటూ ఉండటం మూలాన మన శరీరం అదుపుతప్పి కొలెస్ట్రాల్, కొవ్వు శాతం మన శరీరంలో పెరిగిపోయి అధిక బరువు మనకు సంప్రాప్తించే ఆనారోగ్య పరిస్థితులు ప్రస్తుత సమాజంలో ఎక్కువగా పొడచూపుతుండటం ఎంతైనా కడు బాధాకరమైన, శోచనీయమైన విషయం. ఒక విధంగా చెప్పాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఊబకాయం, స్థులకాయం అనేది మానవాళికి ఓ పెను శాపంగా పరిణమించింది అనే మాట సత్యదూరం కాదు. అందులో భాగంగా పరిస్థితులు అనేవి ఎంతటి దారుణ, దయనీయ పరిస్థితుల్లోకి నెట్టివేయబడిందో అనే విషయానికి వస్తే ప్రతి ముగ్గురు ఊబకాయుల్లో ఇద్దరి మరణాలకు గుండె జబ్బులే ప్రధాన కారణమని ఇటీవల ఓఅధ్యయనం తెలియజేసింది అంటే ఊబకాయం అనేది మానవాళి జీవితాలను ఏ స్థాయిలో ఆడుకుంటుందో, ఏ తరహాలో వారిని ప్రాణాపాయ స్థితిలోకి నెట్టివేస్తున్నదో తెలుసుకుంటుంటేనే మన గుండెలు, హృదయాలు ఒక్కసారిగా జలదరించడంతో పాటు, బరువెక్కుతాయి. అంతేకాదు మన శరీరానికి సైతం ఒక్కసారిగా తీవ్ర ఆందోళనతో ముచ్చెమటలు పట్టడం తథ్యం. ఇక ముఖ్యంగా స్థులకాయుల్లో పొడచూపే జబ్బుల విషయానికి వస్తే గుండె వైఫల్యం, కొవ్వు పేరుకుపోవడం, రక్తం గడ్డ కట్టడం, గుండె కొట్టుకోవడంలో అసమతుల్యత వంటి ప్రమాదాలు ఎల్లవేళలా మన వెన్నంటి వుంటాయని ఓ పేరు మోసిన సర్వే సంస్థ వారు తమ అభిప్రాయాన్ని కుండలు బద్దలు కొట్టినట్లు తెలియజేయడంతో ఖచ్చితంగా మనమంతా స్థులకాయాన్ని తక్కువ అంచనా వేయడానికి వీలులేదని, ఆ విషయంలో ఏమరుపాటు ఏ మాత్రం తగదనే చేదు వాస్తవాన్ని వీలయినంత త్వరగా ప్రతి ఊబకాయుడు గ్రహించి సత్వరమే తన హెవీ బాడీని, భారీ శరీర ఆకృతిని తగ్గించుకునే దిశగా చాలా తీవ్ర కసరత్తు చేయక తప్పదు కాక తప్పదు. ఏదిఏమైనా సాధారణ బరువు వున్న వారితో పోలిస్తే అధిక బరువు వున్న 29-49ఏళ్ల వయసు గల పురుషుల్లో 78 శాతం, మహిళల్లో 65 శాతం అధిక రక్తపోటును బాడీమాస్ ఇండెక్స్ (బిఎంఐ) ఎక్కువగా ఉండటమే కారణం. అదేమాదిరి స్థులకాయుల గుండెకు రక్తం సరాఫరాలో ఏర్పడే ఇబ్బందిని 'ఇస్కామిక్ హార్ట్ డిసీజ్' అంటారు. దీనికి ప్రధాన కారణం పొగ త్రాగడం, బీపీ, షుగర్, రక్తంలో కొలెస్ట్రాల్ వంటివి ప్రధాన భూమికను పోషిస్తాయి అన్న మాట. అంతిమంగా మానవాళి చేయాల్సిన తక్షణ కర్తవ్యం ఏమంటే తమ తమ శరీర బరువును అదుపులో పెట్టుకోవడం, ఎందుకంటే చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే కన్నా ముందే మేల్కొని తమ శరీరాన్ని ఎలాంటి పరిస్థితుల్లో ఊబకాయం బారిన పడకుండా చూసుకుంటే మంచిది. ●

# పరిశుభ్రత చర్యలే అభివృద్ధికి తొలిమెట్టు

డి జయరాం

స్వచ్ఛ భారత్ వంటి జాతీయ కార్యక్రమాల ద్వారా దేశం బహిరంగ మల విసర్జన రహితస్థితిని సాధించడంలో గణనీయమైన ప్రగతి సాధించింది. అయితే మరుగుదొడ్ల నిర్మాణం వలన కలిగే అపారమైన ప్రయోజనాలను పూర్తిగా అందుకోవాలంటే, నిర్మాణానంతరం ఎదురయ్యే నిర్వహణ, వినియోగ అలవాట్ల సవాళ్లను కూడా అదే స్థాయిలో అర్థం చేసుకోవాలి. పరిశుభ్రత అనేది కేవలం ఒక సౌకర్యం కాదు. ఇది దేశ పౌరుల ఆరోగ్యం, గౌరవం ఆర్థిక అభివృద్ధికి మూల స్తంభం. మరుగుదొడ్ల కల్పన అనేది కేవలం ఒక పౌర సదుపాయంగా కాకుండా బహుముఖ ప్రయోజనాలు అందించే సామాజిక పెట్టుబడిగా చూడాలి. మరుగుదొడ్ల కల్పన వలన కలిగిన అతి ముఖ్యమైన ప్రయోజనం మహిళల భద్రత, గౌరవం మెరుగుపడటం. బహిరంగ మల విసర్జనకు వెళ్లవలసి వచ్చినప్పుడు ముఖ్యంగా చీకటి పడిన తర్వాత, మహిళలు లైంగిక వేధింపులు, ప్రమాదాలు, మానసిక ఆందోళన వంటి సమస్యలను ఎదుర్కొనేవారు. వ్యక్తిగత మరుగుదొడ్ల లభ్యత వలన, మహిళలు ఈ రకమైన సామాజిక భయం నుండి విముక్తి పొందారు. ఇది మహిళల ఆత్మగౌరవాన్ని పెంచింది. సమాజంలో వారి భద్రతా స్థాయిని బలోపేతం చేసింది. యుక్త వయస్సు బాలికలు సరైన మరుగుదొడ్ల సదుపాయం కారణంగా పాఠశాలలకు హాజరు కావడం పెరిగింది. పరిశుభ్రమైన మరుగుదొడ్ల వినియోగం వలన అతి ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం మెరుగుపడుతుంది. బహిరంగ మల విసర్జన పద్ధతులు నీరు, ఆహారం, నేలను కలుషితం చేస్తాయి. దీని వలన పిల్లలు, వృద్ధులలో డయేరియా, టైఫాయిడ్, కలరా వంటి తీవ్రమైన అంటువ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. మరుగుదొడ్ల వినియోగం, ఈ వ్యాధులకుకారణమయ్యే వ్యాధి కారకాలు పర్యావరణంలోకి చేరకుండా అడ్డుకుంటుంది. ఈ వ్యాధుల నియంత్రణ వలన అటు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై భారం తగ్గడంతో పాటు, ఇటు పేద కుటుంబాలు చికిత్స కోసం ఖర్చుపెట్టవలసిన ఆదాయ నష్టంతగ్గుతుంది. పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టిస్తుంది. ప్రజలు తరచుగా అనారోగ్యంబారిన పడకుండా ఉన్నప్పుడు, వారి ఉత్పాదకత పెరుగుతుంది. అనారోగ్యంతో సెలవులు తీసుకోవడం తగ్గుతుంది. తద్వారా ఉద్యోగులు, కూలీలు నిరంతరంగా పనిచేయగలుగుతారు. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం, పారిశుద్ధం, పరిశుభ్రతలో పెట్టుబడి పెట్టడం వలన ఆరోగ్య ఖర్చులు తగ్గి, జాతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఈ విధంగా, మరుగుదొడ్ల కల్పన దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)కి పరోక్షంగా దోహదం చేస్తుంది. డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం 2014తో పోలిస్తే 2019లో దేశంలో మూడు లక్షల డయేరియా మరణాలు నివారించబడ్డాయి. ఆరోగ్య ఖర్చులు తగ్గినందున సగటున ఒక కుటుంబం సాలీనా 50,000 రూపాయలు ఆదా చేసింది. భూగర్భ జలాల కాలుష్యం 12.70 రెట్లు తగ్గాయి. ఆగస్టు 2017 లో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ఒక స్వతంత్ర సర్వే, మొత్తం జాతీయ గ్రామీణ గృహ పారిశుద్ధ్య కవరేజ్ 62.5 కి,



మరుగుదొడ్ల వినియోగం 91.3కు పెరిగిందని నివేదించింది. గ్రామీణ ప్రాంతాల్లో 99శాతం గృహాలు, 100శాతం మరుగుదొడ్ల వినియోగంతో హరియాణా అగ్రస్థానంలో నిలిచింది. మరుగుదొడ్డి లేని వారిసంఖ్య 55 కోట్ల నుంచి 50 కోట్లకు తగ్గిందని యునిసెఫ్ తెలిపింది. మరుగుదొడ్డిని 96 శాతం మంది ఉపయోగిస్తున్నారని ప్రపంచ బ్యాంకు నివేదించింది. మరుగుదొడ్ల నిర్మాణంలో విజయం సాధించినప్పటికీ ఆ ప్రయోజనాలను పూర్తిగా అందుకోవాలంటే అనేక వ్యవస్థాపరమైన, సామాజిక సవాళ్లను అధిగమించాలి. మరుగుదొడ్ల నిర్మాణానంతరం ఎదురయ్యే అతిపెద్ద సమస్య సరైన నిర్వహణ, నీటి లభ్యత లేకపోవడం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో లేదా నీటికొరత ఉన్న ప్రాంతాలలో, మరుగుదొడ్లు నిర్మించినా, వాటిని శుభ్రపరచడానికి తగినంత నీరు ఉండక పోవడం వలన అవి ఉపయోగించడానికి వీలు లేకుండా పోతున్నాయి. మరుగుదొడ్లు మురికిగా ఉంటే, ప్రజలుతిరిగి బహిరంగ మల విసర్జనకు మొగ్గు చూపుతారు. మురుగునీటి నిర్వహణ వ్యవస్థ సరిగా లేకపోవడం వలన, ఆ వ్యర్థాలు తిరిగి పర్యావరణంలోకి చేరి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. సాంకేతిక పరిష్కారం కంటే ప్రవర్తనా మార్పు తీసుకురావడం చాలా కష్టం. తరతరాలుగా బహిరంగ మల విసర్జనకు అలవాటు పడిన వర్గాలలో మరుగుదొడ్లను ఉపయోగించడం అనేది ఆమోదయోగ్యం కాని సామాజిక, సాంస్కృతిక అలవాటుగా మారింది. చాలా మంది బహిరంగ మల విసర్జనను 'స్వచ్ఛత'గా భావిస్తారు, ఎందుకంటే మరుగుదొడ్లు 'మురికిని' ఒకే చోట నిల్వ చేస్తాయి. ఈ మానసిక ప్రతిఘటనను అధిగమించడానికి నిరంతర సామాజిక చైతన్యం అవసరం. పట్టణ ప్రాంతాలలో, ముఖ్యంగా రద్దీగా ఉండే మురికివాడల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించడానికి స్థలం లభించకపోవడం ప్రధాన సమస్య. ఇక్కడ సామాజిక మరుగుదొడ్లు అవసరం. కానీ ఈ సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం నాణ్యత, నిర్వహణ లోపాలు కారణంగా అవి తరచుగా అపరిశుభ్రంగా, పనికిరాకుండా పోతున్నాయి. పట్టణ ప్రణాళికలో పారిశుద్ధ్య వ్యవస్థకు తగిన ప్రాధాన్యత లభించకపోవడం వలన, సమస్య మరింత జటిలమవుతోంది. మరుగుదొడ్ల ఉపయోగాలు పూర్తిగా అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం, సమాజం ప్రజలు కలిసి పనిచేయాలి. ప్రభుత్వం నీటి సంరక్షణ మురుగునీటి శుద్ధిపై దృష్టి సారించాలి. ప్రతి ఇంటి మరుగుదొడ్డిని ఒక చిన్నవ్యర్థ శుద్ధి కేంద్రంతో అనుసంధానం చేసే స్థిరమైన టెక్నాలజీని ప్రోత్సహించాలి. సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను పారదర్శకతతో కూడిన స్థానిక మహిళాస్వయం సహాయక బృందాలు లేదా సామాజికసంస్థలకు అప్పగించి, వారికి ఆర్థిక మద్దతు అందించాలి. విద్య, ఆరోగ్య కార్యకర్తల ద్వారా చైతన్యం కలిగించాలి. పాఠశాలల్లో విద్యార్థులకు, ఆశా కార్యకర్తల ద్వారా గ్రామాలలో మహిళలకు పరిశుభ్రత తాలూకా శాస్త్రీయ, ఆర్థిక ప్రయోజనాలపై చైతన్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలి. బహిరంగ మల విసర్జన వలన కలిగే ప్రమాదాలు, మరుగుదొడ్లు వాడటం వలన కలిగే సామాజిక, ఆరోగ్య ప్రయోజనాలను స్పష్టంగా వివరించాలి. ప్రవర్తనా మార్పు అనేది ఒక రాత్రిలో జరిగేది కాదు, దీనికి దీర్ఘకాలిక కృషి అవసరం. ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా భారతదేశం మరుగుదొడ్ల నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ, వినియోగ అలవాట్లు, నిర్వహణ అనే రెండు ముఖ్యమైన సవాళ్లను అధిగమించవలసి ఉంది. పరిశుభ్రతను ఒక సామాజిక బాధ్యతగా భావించి, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు కలిసి పనిచేసినప్పుడే ఈ ప్రయోజనాలు పూర్తి స్థాయిలో సమాజానికి అందుతాయి. ఈ నిరంతర సంకల్పం ద్వారానే భారతదేశం ఆరోగ్యవంతమైన, సుస్థిరమైన, గౌరవప్రదమైన భవిష్యత్తు వైపు సాగగలదు. పరిశుభ్రతలో విజయం సాధించడంఅనేది దేశ సమగ్రాభివృద్ధికి అనివార్యమైన తొలి మెట్టు. ●

## సజావుగా ఏఎన్‌యు పీజీ, బియిడి పరీక్షలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు18,ప్రభాతవార్త: ఏఎన్‌యులో పరిధిలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబిఏ, ఎంసిఏ, ఎల్‌ఎల్‌బి, బియిడి, ఎంపిఇడి, యంఇడి కోర్సు 3వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయని పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య యం.సుబ్బారావు తెలిపారు. పీజీ కోర్సుల పరీక్షలు 22 పరీక్షా కేంద్రాలలో, ఎల్‌ఎల్‌బి పరీక్షలు 5 కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను ఏఎన్‌యు రెక్టార్ ఆచార్య రామినేని శివరాం ప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌కుమార్, తాను కూడా తనిఖీచేసినట్లు వివరించారు. రెక్టార్ ఆర్ట్స్ బ్లాక్‌లో పలు విభాగాలను సందర్శించి విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలించారు. కోఆర్డినేటర్ లా డిపార్ట్‌మెంట్‌లో పరీక్షలు జరుగుతున్న తీరును, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎడ్యుకేషన్, హిస్టరీలతో పాటు పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచార్య సుబ్బారావు మాట్లాడుతూ పరీక్షలు జరుగుతున్న విభాగాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులకు సూచించారు. బిఇడికి 5800మంది, ఎంయిడికి 150మంది, లా కోర్సులకు 700మంది, స్పెషల్ బియిడి కి 30మంది, పీజీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కోర్సులకు 3675మంది పరీక్షలకు రాస్తున్నట్లు తెలిపారు.

**అసౌకర్యంపై వివరణ:** మంగళవారం ప్రారంభమైన పరీక్షల్లో కొన్ని కోర్సులకు చేతివ్రాతతో వచ్చిన ప్రశ్నాపత్రాలు ఇచ్చారని ఆచార్య సుబ్బారావు తెలిపారు. అలా వచ్చిన ప్రశ్నాపత్రాలద్వారా విద్యార్థులకు ఎటువంటి నష్టం జరుగదన్నారు. బియిడి, ఎంయిడి, ఎల్‌ఎల్‌బి, పీజీ కోర్సుల పరీక్షలకు ప్రశ్నాపత్రాలు వేర్వేరు యూనివర్సిటీల ప్రొఫెసర్లు రూపొందించినట్లు వివరించారు. ఒకేసారి ఎక్కువ కోర్సుల పరీక్షలు నిర్వహిస్తుండటం వల్ల ఇటువంటి అలా జరిగిఉండవచ్చని, ఇకపై అటువంటి పొరపాట్లు జరగకుండ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఎల్‌ఎల్‌బి రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల**

వర్సిటీ పరిధిలో ఏప్రిల్‌లో జరిగిన ఎల్‌ఎల్‌బి కోర్సు 6, 10వ సెమిస్టర్‌ల పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు.



## కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డి ప్రదానం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు18,ప్రభాతవార్త: వర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసినందుకు యండ్రపాటి రవీంద్రబాబుకు పీహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. డాక్టర్ ఓ.నాగరాజు పర్యవేక్షణలో అడాప్టివ్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ వర్క్‌ఫ్లో ఆప్టిమైజేషన్ ఇన్ బిగ్ డాటా సిస్టమ్స్ యూజింగ్ ఇంటిగ్రేటెడ్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్ అనే అంశంపై రవీంద్రబాబు పరిశోధన చేశారు. ఈమేరకు విభాగం అధ్యాపకులు, పరిశోధకులు అభినందనలు తెలియజేశారు.

## బిసి ఉద్యోగులు ఐఖ్యంగా ఉండాలి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబరు18,ప్రభాతవార్త: వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న బిసి ఉద్యోగులు ఐఖ్యంగా ముందుకుసాగాలని రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్



ఆచార్య కె.వీరయ్య, నూటా ప్రధాన కార్యదర్శి ఆచార్య యం.త్రిమూర్తిరావులు సూచించారు. బిసి అధ్యాపక, ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్తీక వనసమారాధన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆచార్య త్రిమూర్తిరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ బిసి ఉద్యోగుల అభ్యున్నతికి ప్రతీ ఒక్కరం తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో బిసిల్లో సోదరభావం పెరుగుతుందన్నారు. బిసి సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు, కార్యవర్గ సభ్యులు రమణయ్య, క్రాంతి కుమార్, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, నాగమల్లేశ్వరరావులు మాట్లాడుతూ బిసి ఉద్యోగుల ఐఖ్యత ఎంతో సంతోషంగా ఉందన్నారు. వారికి ఎటువంటి సమస్యలు వచ్చినా బిసి సంక్షేమసంఘం తరుపున అండగా నిలుస్తామన్నారు. దేశంలో ఉన్న బిసిలంతా కలిసి రాజ్యాధికారం కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ధనలక్ష్మీ, ఆచార్య మాధవి, ఆచార్య రవికుమార్, ఆచార్య నాగరాజు, ఆచార్య తులసీదాసు, ఆచార్య పూర్ణచంద్రరావు, ఆచార్య దివ్య తేజోమూర్తి, వర్సిటీ బిసి ఉద్యోగ సంఘం నాయకులు సాంబశివరావు, సాయిరాం, శ్రీనివాసరావు, వికాస అధ్యక్షుడు నీలపు ప్రసాద్, విద్యాసాగర్, శాంతిశ్రీ, పద్మావతి, సూర్యకామేశ్వరి, డిఇఇ వెంకటేశ్వర్లు, రెడ్డి ప్రకాష్, కాశయ్య, భానుప్రసాద్, డా.కోటీయాదవ్, జగదీశ్వరరావు, ఉపమామహేశ్వరరావు, పద్మావతి, షకీలా భేగం, నీలకంఠేశ్వరరావు, ఢిల్లీశ్వరరావు, ప్రసాద్, పరిశోధకులు పాల్గొన్నారు.

**నేడు నూటా ఆధ్వర్యంలో....** నాగార్జున యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (నూటా) ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు నూటా అధ్యక్షుడు ఆచార్య పి.బ్రహ్మాజీరావు, ప్రధాన కార్యదర్శి ఆచార్య యం.త్రిమూర్తిరావులు తెలిపారు. వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఏడాది స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డులు పొందిన అధ్యాపకులకు సన్మానం చేయనున్నట్లు వివరించారు.

## పద్య నాటకోత్సవాలు -- పురస్కారాలు

గుంటూరు కల్చరల్,నవంబర్ 18,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీ సర్వేశ్వర నాట్యమండలి,విజయవాడ వారి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం శ్రీకృష్ణ రాయబారం పద్యనాటకం,గత బంధు గోలి లక్ష్మయ్య (సిఐడి డిఎస్పీ) కి ఆధ్యాత్మిక పురస్కార ప్రదానం శుక్రవారం సాయంత్రం సత్యహరిశ్చంద్ర పద్యనాటకం జి.మల్లికార్జునరావుకు రంగస్థల పురస్కార ప్రదానం జరుగుతుందని సంస్థ అధ్యక్షులు టి.రాజబాబు తెలిపారు.పలువురు ప్రముఖ కళాకారులు,పురప్రముఖులు కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

తుళ్ళూరు,నవంబర్ 18,ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని తుళ్ళూరు శాఖ గ్రంథాలయాధికారి పి.భాగ్యలత అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పర్యావరణంపై వ్యాసరచన,డ్రాయింగ్ పోటీలు



నిర్వహించారు.అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డి.శుభాకర్ మాట్లాడుతూ గ్రంథాలయాభివృద్ధికి చర్యలు తీసుకోవడంతోపాటు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఇందుకు అభివృద్ధి కమిటీ సహకారం అందజేస్తుందన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ శ్రీకాంత్, పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సత్యసాయిబాబా రథోత్సవం

గుంటూరు విద్య ప్రభాతవార్త: ఓమ్ శ్రీ సాయి రామ్ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి శత వర్ష జన్మ దినోత్సవ వేడుకల లో భాగం గా మంగళ వారం శ్రీ సత్య సాయి శాంతి సుధ మందిరం నుండి రథోత్సవం గుంటూరు పుర వీధుల లో చిన్నారుల కోలాటం , భజన , సత్య సాయి బాబా వారి నామం తో కోలాహలం గా, కన్నుల పండుగా ఎంతో రమణీయం గా జరిగినది. ఈ రథోత్సవ కార్యక్రమం ను మండల పూడి సాంబశివ రావు ప్రారంభించారు.. ఈ కార్యక్రమం లో శ్రీ సత్య సాయి



విద్యా నికేతన్ ,శ్రీ సత్య సాయి ఐడియల్ ,శ్రీ సత్య సాయి విద్యా విహార్, శ్రీ సత్య సాయి బొమ్మిడాల నగర్ ,శ్రీ సత్య సాయి విద్యా విహార్ జడ్పీ కాంపౌండ్ స్కూల్స్ నుంచి 500 మంది చిన్నారులు , అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమం లో సత్య సాయి ఎడ్యుకేషన్ అండ్ సర్వీస్ సొసైటీ ప్రెసిడెంట్ డా. పి. ఎల్ నరసింహా రావు , సత్య సాయి సేవా సమితి కన్వీనర్ శ్రీ రామ కృష్ణ , సభ్యులు శ్రీ సత్య నారాయణ , మహంకాళి శ్రీనివాస్ . స్కూల్ ప్రిన్సిపల్స్ లీలావతి , కిశోర్ , నాగేంద్ర బాబు మరియు సీతా మహా లక్ష్మీ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

## ఆర్.వి.ఆర్.జె.సి విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు

గుంటూరు విద్య, ప్రభాతవార్త: ప్రముఖ అంతర్జాతీయ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో 41 మంది బాలికలు ఎంపికై, సిస్టం ఇంజనీర్ హోదాలో 4 లక్షల రూపాయల ప్యాకేజీతో నియమింపబడటం ఆనందదాయకమని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ మరియు కళాశాల సిబ్బంది అభినందించారు. ప్రతి సంవత్సరం దేశంలోని అగ్రశ్రేణి కంపెనీలు కళాశాలను సందర్శించి, విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముందుకు రావడం మా కళాశాల యొక్క విద్యా ప్రమాణాలకు, విద్యార్థుల నైపుణ్యాలకు నిదర్శనమని కళాశాల సెక్రెటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్ , కళాశాల అడ్మిన్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, ట్రైనింగ్ ప్లేస్మెంట్ అధికారులు శ్రీ సి.హెచ్. శ్రీనివాసరావు, డా.కె. సురేష్ బాబు, వివిధ శాఖల విభాగాధిపతులు, ప్లేస్మెంట్ ఇన్చార్జ్‌లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# గుంటూరు వార్త



## సీఎంఆర్‌ఎఫ్ పేదల సంజీవని: గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ రూ.19 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంటూరు వెస్ట్ నవంబర్ 17 ప్రభాతవార్త : సీఎం రిలీఫ్ ఫండ్ పేదల సంజీవని అని, కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యానికి భద్రత అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే నసీర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.19 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు



అందించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో రూ.6.50 కోట్ల నిధులు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి పంపిణీ చేశామన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ తమ కుటుంబాల్లో వ్యక్తులు అనుకోకుండా అనారోగ్యానికి గురవడంతో అప్పుల్లో కూరుకుపోయామని తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ ను సంప్రదించడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేయించి తమను ఆదుకున్నారని చెప్పారు. దీనికి సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నసీర్ కు కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్ ను ఆంధ్రలోనే ఆదర్శవంతంగా మారుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షైక్ షాజీలా, కార్పొరేటర్లు చీష్టి, ముప్పావరపు భారతి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మావతి, సయ్యద్ అన్వార్, కొనాకళ్ళ సత్యం, పోతురాజు చంద్రశేఖర్, మొహమ్మద్ హాఫిజ్, చల్లా ఆంజనేయ ప్రసాద్, మహంకాలి నరసింహారావు, గొల్ల ప్రభాకర్, అబ్దుల్ సలీం, రబ్బానీ,మొవ్వ శైలజ, ఉస్మాన్, సూర్రె శ్రీనివాస్, బ్రహ్మసాని శ్రీను, సాయి బాబు, దినేష్, ముకుందరావు, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురువయ్య, వంగర ఏడుకొండలు, మాలకొండయ్య, చెట్టు కనకరావు, అల్లం బాజీ, హుస్సిన్, సుబ్బారావు, కె ఎం ఈ హుస్సిన్, విజయ్ కుమార్, బాజీ, రఫీ, శ్రీను, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు

## 13 పాఠశాలలకు సి.ఎస్.ఆర్ క్రింద రూ.33 లక్షల సామగ్రి

గుంటూరు వెస్ట్, నవంబరు 18, ప్రభాతవార్త : మంగళగిరి మండలంలోని 13 పాఠశాలలకు రూ.33 లక్షల విలువైన సామగ్రిని టయోటా కిర్లోస్కర్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ సామాజిక బాధ్యత కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద అందించింది. ఈ సామగ్రిలో ఫర్నిచర్, క్రీడా సామగ్రి, వంట సామగ్రి ఉన్నాయి. మొత్తం 13 పాఠశాలల్లో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఐదు మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, రెండు మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. కృష్ణయ్య పాలెం ఎం.పి.యు.పి పాఠశాల., నౌలురు, చినకాకాని, ఆత్మకూరు, పెదవద్దపూడి, నూతక్కి జెడ్పి.హెచ్.ఎస్ లు., కంద్రుకమల, పాత బ్యాంకు కాలనీ, మంగళగిరి వీవర్స్ కాలనీ, బిఆర్ నగర్, పాత మంగళగిరి, జి రోడ్డులో గల మునిసిపల్ పాఠశాలలకు అందజేశారు. అందజేసిన సామగ్రిలో 124 చొప్పున బెంచీలు, డెస్క్ లు.,



ఉపాధ్యాయులకు 65 కుర్చీలు, రివాల్వింగ్ చైర్ లు 68, ప్రధాన ఉపాధ్యాయులకు 8 టేబుల్స్, అల్మరా లాకర్లు 10, అల్మరాలు 20, గ్లాస్ తలుపులు గల అల్మరాలు 8, గ్రంథాలయంలో చదువుటకు ఉపయోగించే టేబుల్స్ 2, ప్లాస్టిక్ చైర్ లు 265, పోడియంలు 13, వాలి బాల్ లు 31, వాలి బాల్ నెట్ లు 25, త్రో బాల్ లు 33, టెన్ని కోయిట్ రింగ్ లు 21, చెస్ బోర్డులు 23, చెస్ ప్యాన్స్ 23, షటిల్ కాక్ లు 30, షటిల్ రాకెట్ లు 30, షటిల్ నెట్ లు 21, క్యారం బోర్డ్ 21, క్యారం బోర్డు కాయిన్ లు 20, క్యారం బోర్డు పౌడర్ లు 12, ఫుట్ బాల్ లు 27, టెన్నిస్ బ్యాట్ లు 29, టెన్నిస్ బాల్స్ 28, క్రికెట్ స్టంప్స్ 37, స్కిప్పింగ్ రోప్స్ 21, హ్యాండ్ పంపులు 21, స్టవ్ లు 9, కుక్కర్ లు 9, ఆల్ టాప్ లు 18 ఉన్నాయి.ఈ సామగ్రిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సమక్షంలో టయోటా కిర్లోస్కర్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుకకు అందజేశారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన టయోటా కిర్లోస్కర్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. మరిన్ని మంచి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. సంక్షేమ వసతి గృహాల్లో కనీస అవసరాలు కల్పనలో భాగస్వామ్యం కావాలని కోరారు. తద్వారా మంచి సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు.టయోటా కిర్లోస్కర్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ హెడ్ బి. నిఖిల్ మాట్లాడుతూ తమ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమంలో కంపెనీ సి.ఎస్.ఆర్ మేనేజర్ సొప్ప ఈశ్వరరావు, పృథ్వీ టయోటా ఎం.డి పృథ్వి మలెంపాటి, ఇతర ప్రతినిధులు అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్ డే, అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకంగా నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో, వివిధ సమస్యలతో వచ్చిన మహిళల నుండి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుండి ప్రత్యక్షంగా అర్జీలు స్వీకరించారు.రాజకీయాల్లోకి వచ్చిన మొదటి రోజు నుంచి ప్రజలతో మమేకమై పనిచేస్తున్న గళ్ళా మాధవి, మహిళల కోసం ప్రత్యేకంగా ఒక రోజును కేటాయించడం పట్ల నియోజకవర్గవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు మాట్లాడుతూ మంగళవారం అంటే పశ్చిమ నియోజకవర్గానికి ప్రత్యేకమైన రోజు అని, ప్రతి మహిళా తమ సమస్యలను భయపడి కాకుండా ధైర్యంగా చెప్పుకునే వేదిక ఇదే అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.పెన్షన్, పోలీస్ స్టేషన్ సంబంధిత సమస్యలు, హాస్పిటల్ ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, స్థానిక అభివృద్ధి వంటి అనేక విభాగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను విని, వాటికి వీలైనంత త్వరగా పరిష్కారం చూపిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.మహిళలు స్వేచ్ఛగా సమస్యలు చెప్పుకునే వాతావరణం ఇవ్వడం మా ధ్యేయమని, ఈరోజు పరిస్థితి ఏమిటంటే పురుషులు కూడా తమ సమస్య చెప్పాలంటే ఒక మహిళను వెంట తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీని వలన మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. నాయకులు మాత్రమే కాదు, ఇప్పుడు కార్యకర్తలు కూడా నేరుగా వచ్చి తమ సమస్యలు చెప్పుకుంటున్నారు. ఇది ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.మహిళల కళ్లల్లో సంతోషం కనిపించడమే మా లక్ష్యమని, అలాగే నియోజకవర్గంలోని మహిళా నాయకులు వారంతా ప్రజల్లో తిరిగి సమస్యలను సేకరించి, వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం పట్ల మాధవి గారు అభినందనలు తెలిపారు.జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ రాజకీయ అనుభవం లేకున్నా, బీసీ మహిళగా గళ్ళా మాధవి ప్రజల ఆశీస్సులతో 55 వేల మెజారిటీతో గెలిచి, రాష్ట్రంలో బలమైన మహిళా నాయకురాలిగా ఎదిగారు.గతంలో నాయకులను కలవడం కష్టం. ఇప్పుడు గుంటూరు పశ్చిమలో అయితే 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉన్న ఎమ్మెల్యే సమస్య ఉన్న చోటే ప్రత్యక్షంగా వెళ్లి మహిళలకు అండగా నిలుస్తున్నారు.ప్రత్యేకంగా మహిళల కోసం గ్రీవెన్స్ నిర్వహించడం రాష్ట్రంలోనే ఆదర్శప్రాయమైన కార్యక్రమం.అలాగే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలతో మమేకమై పనిచేస్తోందని, ప్రజల దర్బార్ పద్ధతిలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు నిబద్ధతతో ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు.

## దృష్టి లోపం ఉన్నవారి కోసం ఏఐ స్మార్ట్ గ్లాసెస్ ను ఆవిష్కరించిన బెంగళూరు విద్యార్థి

గుంటూరు విద్య, ప్రభాతవార్త: : బెంగళూరుకు చెందిన 19 ఏళ్ల తుషార్ షా, దృష్టి లోపం ఉన్నవారి కోసం ఏఐ స్మార్ట్ గ్లాసెస్ ను ఆవిష్కరించాడు. స్కేలర్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో రెండవ సంవత్సరం చదువుతున్న ఈ ఇంజనీరింగ్ విద్యార్థి, ఒక గాడ్జెట్‌ను మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత, ఆవిష్కరణ కలయికను ప్రతిబింబించే పరిష్కారాన్ని అందించాడు. అతని ఆవిష్కరణ, పెర్సీవియా దృష్టి లోపం ఉన్నవారికి సహజమైన గ్లాసెస్ శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025 జాతీయ విజేతలలో అతనికి స్థానం సంపాదించింది. శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో సంస్థ యొక్క ప్రధాన విద్యా కార్యక్రమం. ఇది యువ ఆవిష్కర్తలను వాస్తవ ప్రపంచ సమస్యలను గుర్తించి, సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ప్రోత్సహిస్తుంది.

## పేకాటరాయుళ్ల అరెస్టు

అమరావతి, నవంబర్ 18 ప్రభాతవార్త: మండలం లోని మండేపూడి గ్రామంలో పేకాట రాయులపై ఎస్సై వారి సిబ్బందితో పేకాట రాయుళ్లపై రైడ్ నిర్వహించారు. 4 గురు వ్యక్తులను, 15750/ రూపాయల డబ్బు సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ అమీర్ తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ మండల పరిధిలో



ఎవరైనా అసాంఘీకి కారక్రమాలకు, బెట్టింగ్లకు, పేకాటలు నిర్వహించినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి సూచనలతో గ్రామాల్లో రైడ్ లు నిర్వహిస్తున్నామన్నారు.

## బాలల హక్కులపై అవగాహన సదస్సు

అమరావతి, నవంబర్ 18 ప్రభాతవార్త: గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జూపూడి గ్రామపంచాయతీలో బాలల హక్కులపై మహిళలకి తల్లిదండ్రులకు పంచాయతీ పెద్దలకుఅవగాహన




కల్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత విమల వహించారు ముఖ్యఅతిథిగా సమస్త సిబ్బంది దిలీప్ కుమార్ విచ్చేసి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1989లో బాలలకు నాలుగు ముఖ్యమైన హక్కులు కల్పించిందన్నారు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు భాగస్వామ్య హక్కు, ఈ నాలుగు హక్కులు ముఖ్యమైన అన్నారు . 18 సంవత్సరాల లోపు వారందరూ బాలలే అన్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని క్రమం తప్పకుండా బడికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది త్రివేణి మాట్లాడుతూ మన గ్రామంలో డ్రాప్ అవుట్స్ లేకుండా చూసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎక్కడైనా పిల్లలు బాల కార్మికులుగా పనిచేసిన, బాల్యవివాహాలు జరిగిన 10 98 చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మహిళా సంఘాలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం తోనే మోజన్లు, ఇమామ్‌ల ఆత్మగౌరవం

గుంటూరు వెస్ట్ నవంబర్ 17 ప్రభాతవార్త : మోజన్లు, ఇమామ్ ల ఆత్మ గౌరవాన్ని కాపాడింది కూటమి ప్రభుత్వమేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో నియోజకవర్గంలోని మోజన్లు, ఇమామ్ లతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. తొలుత ఈ ఏడాదికి మోజన్లు, ఇమామ్ ల గౌరవ వేతనం రూ.90 కోట్లు అందించినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లడుతూ గత జగన్ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు



తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. మోజన్లు, ఇమామ్ లకు అందించాల్సిన గౌరవ వేతనానికి కూడా కొర్రీ పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్ ప్రభుత్వంలో ఇవ్వాల్సిన గౌరవ వేతనాన్ని కూడా అందించామని తెలిపారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, అభ్యున్నతికి, ఆర్థిక ప్రగతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముస్లిం మహిళల ఆర్థిక స్వావలంబనకు విరివిగా సబ్సిడీపై రుణాలందిస్తున్నామని తెలిపారు. ఉపాధి శిక్షణతోపాటు స్కిల్ కమ్యూనికేషన్స్ ద్వారా జీవనోపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

## యువత దేశ సంపద దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంది

గుంటూరు వెస్ట్, నవంబరు 18, ప్రభాతవార్త: యువత మత్తు, మాదక ద్రవ్యాలు భారీన పడరాదని జిల్లా ఉపాధి కల్పన అధికారి మరియు దివ్యాంగుల శాఖ ఇన్ ఛార్జ్ సహాయ సంచాలకులు డి.దుర్గా భాయి పిలుపునిచ్చారు. యువత దేశ సంపద అని, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని... దేశాన్ని ప్రగతి పథంలోకి నడిపించాల్సిన భాధ్యత యువతపై ఉందని అన్నారు. "నషా ముక్త భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మంగళవారం జె.కె.సి కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ నినదించారు. ఈ సందర్భంగా దుర్గాబాయి మాట్లాడుతూ




యువతను కాపాడు కోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. మత్తు, మాదక ద్రవ్యాలుపై వారి దృష్టి పడకుండా చర్యలు చేపట్టాలని, మాదకద్రవ్యాల సంబంధిత కార్యకలాపాలను నివారించడానికి అందరు సమష్టి కృషి చేయాలని కోరారు. వివిధ కళాశాలలు, ఇతర విద్యా సంస్థలలో మాదకద్రవ్యాల ఉనికి లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, కుటుంబ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవుతుందని చెప్పారు. కుటుంబంలో ఒక వ్యక్తి గాడి తప్పితే ఆ కుటుంబం విచ్ఛిన్నకరంగా మారుతుందని, యువత వీటిని గుర్తించాలని కోరారు. డ్రగ్స్ నియంత్రణకు పని చేసే స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు అందరూ సమైక్యంగా పనిచేసి సమాజంలో మాదక ద్రవ్యాలను రూపుమాపుటకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు ఫోన్ చేయవచ్చని చెప్పారు.ఈ సందర్భంగా "నషా ముక్త భారత్ అభియాన్" ప్రతిజ్ఞను చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్థల వృద్ధికి ఆదాయ వనరులు కీలకం

గుంటూరు విద్య, ప్రభాతవార్త: సంస్థల వృద్ధికి ఆదాయ వనరులు ఎంతో కీలకమని ఎల్జి సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. రెండవ త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2025 ఎఫ్ వై 26 రెండవ త్రైమాసికం కోసం ప్రధానమైన గృహోపకరణాల్లో వినియోగదారు ఎలక్ట్రానిక్స్ లో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ ఫలితాలు ప్రకటించింది. క్యూ2ఎఫ్ వై265 8.9శాతం క్యూ2ఎఫ్ వై25 లో రూ. 61.14 బిలియన్స్ కార్యకలాపాలు ద్వారా కంపెనీ ఆదాయాన్ని అందించింది, ఇది క్యూ2ఎఫ్ వై26లో రూ.61.74 బిలియన్స్ కార్యకలాపాలు ద్వారావచ్చిందనీ వెల్లడించారు.

## జాతికి తలవంపులు తెస్తున్న పరువు హత్యలు

గుంటూరు కల్చరల్,నవంబర్ 18,ప్రభాతవార్త : కుల దురహంకారాన్ని తలకెక్కించుకున్న కొందరు కిరాతకులు హేయనేరాలకు ఒడిగడుతున్నారని కులాంతర వివాహాలు,ప్రేమలను సహించలేని వారు ఇష్టపడిన వ్యక్తులు వారి బంధుమిత్రుల ప్రాణాలను నిలువునా బలిగొంటున్నారని అవగాహన సంస్థ ఖండిస్తుంది.ఇటీవల వరుసగా మహబూబ్‌నగర్ జిల్లా,అనంతపురం,సూర్యాపేట జిల్లాల్లో జరిగిన అమానవీయ ఘటనలు పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలాన్ని కుల వివక్షను కళ్ళకు కడుతున్నాయని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.మిర్యాలగూడలో ప్రణయ్,హైదరాబాద్‌లో హేమంత్‌ల సంఘటనలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మనస్సులను కలిచివేశాయని అయిన అలాంటివి జరుగుతూనే ఉన్నాయని అవగాహన సంస్థ ఆవేదన వెలిబుచ్చుతుంది.కులాంతర వివాహ విషయంలో పోలీసులు మానవీయతతో వేగంగా స్పందించాలని,ఈ పరువు పేరుతో జరుగుతున్న హత్యలతో తమ కుటుంబం పతనమవుతుందని ఆయా తండ్రులు గుర్తించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది

## ఎస్ఎస్ఎన్ కళాశాలలో పుస్తక ప్రదర్శన

నరసరావుపేట, నవంబర్ 18 ప్రభాతవార్త : శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్. సుధీర్ మంగళవారం తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.



పుస్తక ప్రదర్శనను కళాశాల అధ్యక్షులు కపలవాయి విజయ కుమార్, సెక్రటరీ కరెస్పాండెంట్ మరియు మాజీ మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా ప్రారంభించారు. జాతిపిత మహాత్మా గాంధీ జీవిత చరిత్ర పై ఫోటో ప్రదర్శన, ప్రపంచంలో ప్రముఖ శాస్త్రవేత్తల ఫోటోలు, 70 వేలకు పైగా ప్రామాణిక గ్రంథాలు, 50 కి పైగా జర్నల్స్ తో పాటు అన్ని ప్రామాణిక ప్రచురణ సంస్థల డిక్షనరీలు, ఎన్సైక్లోపిడియాలు వంటి రిఫరెన్స్ పుస్తకాలు ప్రదర్శనలో ఉంచారు . ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి తమ కళాశాల గ్రంథాలయం ఉత్తమ గ్రంథాలయంగా అవార్డ్ పొందటం జరిగిందని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. కళాశాల గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఈ ఫోటో ఎగ్జిబిషన్ నెల రోజులపాటు అందరికి అందుబాటులో ఉంటుందన్నా రు. పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు ఎగ్జిబిషన్ ను సందర్శించవచ్చునని తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటి సభ్యులు ఊటుకూరి వెంకట అప్పారావు, కమిటి సభ్యులు కూనిశెట్టి లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస సాయి, లైబ్రేరియన్ పోతిరెడ్డి రామాంజనేయ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ పి.ఎన్.వి.డి. మహేష్, ఎం. అనిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్య సేవల నిధుల వినియోగంపై కలెక్టర్ సమీక్ష

నరసరావుపేట, నవంబర్ 18 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షతన ఎన్టీఆర్ వైద్య సేవ నిధుల వినియోగంపై సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ తో పాటు నరసరావుపేట, సత్తెనపల్లి మరియు



చిలకలూరిపేట లోని ఏరియా ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్ లు, జిల్లా డి.సి.హెచ్.ఎస్ ప్రసూన హాజరయ్యారు. కలెక్టర్ పలు అంశాల పై చర్చ నిర్వహించి వివరాలు తీసుకున్నారు . ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టులో సౌకర్యాలు, నిధుల ఉత్పత్తిని సమీక్షి ంచారు. ఎటువంటి జాప్యాలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టుకు సంబంధించిన అన్ని బకాయిలు, క్లెయిమ్ లను పదిహేను రోజుల లోగా పూర్తి చేసి, దానికి సంబంధించిన నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు విభాగంలో డీ.ఈ.వో ల కొరత ఉన్న ఖాళీలను నియామకాల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట లోని ఏరియా ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్ లను ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ పై నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు విభాగంలో డి. ఈ.ఓ లకు ఎఫ్.ఆర్.ఎస్ అమలు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు

## గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

నరసరావుపేట,నవంబర్ 18 ప్రభాతవార్త: ఉప్పలపాడు శాఖా గ్రంథాలయం లో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమం లో గ్రామ హైస్కూల్ ఉపాధ్యాయులు మధుకుమార్ , కృష్ణ ల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి .వారు మాట్లాడుతూ చినిగిన చొక్కా తొడుకున్న పరవాలేదు కానీ మంచి పుస్తకం మాత్రం చదవాలని తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు వాటిని ఉపయోగించుకొని వేల మంది ఉన్నత స్థాయికి వెళ్లరని తెలిపారు. గ్రంథాలయ అధికారి కె.వెంకట్రావు, గ్రామ పెద్దలు,విద్యార్థులు, పాల్గొన్నారు.

## నరసరావుపేట రంగస్థలి సర్వసభ్య సమావేశం

రొంపిచర్ల, నవంబర్ 18 ప్రభాతవార్త:నరసరావుపేట రంగస్థలి 46వ వార్షికోత్సవ నిర్వహణకు సంబంధించి మంగళవారం సభ్యులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో 25వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 27,28, మార్చి 1న మూడు రోజులు జరిపేందుకు సభ్యులు చర్చించారు. గత 45 సంవత్సరాలుగా రంగస్థలిని ప్రోత్సహిస్తున్న దాతలు, ప్రేక్షకులు ఈ వార్షికోత్సవాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. ప్రముఖులతోపాటు అందరి సహకారాన్ని కోరుతున్నామని తెలియజేశారు. సమావేశంలో అధ్యక్ష,కార్యదర్శులు షేక్ సుభాని నల్లపాటి బోస్ కోశాధికారి సూరిబాబు, గౌరవాధ్యక్షులు కిలారి వెంకట్రావు పాల్గొన్నారు. వారితోపాటు ఉపాధ్యక్షులు మస్తాన్ రావు, ప్రసన్నకుమార్,ఏ.ఏ మధు కుమార్, శ్రీనివాస్,పాషా, ఫైనాన్స్ కమిటీ చైర్మన్ కపిలవాయి విజయ్ కుమార్ సభ్యులు మాట్లాడుతూ తమ అభిప్రాయాలు తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌కు ఎంఆర్‌పిఎస్ వినతి

నకరికల్లు, నవంబర్ 18 ప్రభాతవార్త : ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిపై దాడి చేయటాన్ని ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు చింతరాల మీరయ్య ఖండించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి పత్రం అందజేశారు. దాడి చేసిన వారిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి రిమైండ్ పంపాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఎస్పీకి వినతి పత్రాలు అందజేశామని నాయకులు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు దాడికి సంబంధించి కచ్చితంగా చర్యలు తీసుకునేందుకు ప్రకాశం జిల్లా అధికారులకు సమాచారం అందిస్తామన్నారు. జిల్లా ఎమ్మార్పీఎస్ఎస్ అధ్యక్షులు మీరయ్య తో పాటు సంఘం నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సంఘం చెదిరిపోకుండా శాశ్వతంగా నిలబడాలంటూ పాఠశాల ఆవరణలో సువార్త వాక్య పరిచయం, ప్రత్యేక ప్రార్థనలు

యడ్లపాడు, నవంబర్ 18, ప్రభాతవార్త : యడ్లపాడు లూథరన్ హైస్కూల్‌పై జరుగుతున్న వివాదం నేపథ్యంలో మంగళవారం స్కూల్ ఆవరణలో ఏఈఎల్సీ ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించి స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు. మనబడి మనకు కావాలి కార్యక్రమంలో భాగంగా ఏఈఎల్‌సీ వెస్ట్ గుంటూరు సినేడ్ పరిధిలోని లూథరన్ సంఘాల పాస్టర్లు, సంఘపెద్దలు, సంఘస్తులు యడ్లపాడు లూథరన్ హైస్కూల్‌ను సందర్శించారు. సంఘం




చెదిరిపోకుండా శాశ్వతంగా నిలబడాలంటూ పాఠశాల ఆవరణలో సువార్త వాక్య పరిచయం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి ఏఈఎల్‌సీ కార్యనిర్వహణ అధికారి జేసు రత్నకుమార్ సుదీర్ఘంగా ఉపన్యసించారు. తదుపరి లూథరన్ హైస్కూల్ అభివృద్ధి కార్యనిర్వహణ ప్రతినిధి నీలం శామ్యేల్ మోజెస్ మాట్లాడారు. ముందుగా బైబిల్ వాక్యోపదేశం చేసి ప్రార్థనలు నిర్వహించారు. తదుపరి వివరిస్తూ పూర్వపు సంఘం ప్రతినిధుల మధ్య వివాదాల కారణంగానే సంఘానికి ఇలాంటి విపత్కర పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. సంఘానికి చెందిన 190పాఠశాలలు ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని, ప్రస్తుతం మిగిలిన 24లూథరన్ విద్యాసంస్థల్ని మూతపడనివ్వమని తేల్చిచెప్పారు. దశాబ్దాలుగా ఏఈఎల్‌సీ దేవాలయాలు, విద్య, వైద్యాలయాల నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తూ, మరోవైపు న్యాయవిభాగం గురించి గుర్తెరిగిన వారిని పరిధిదాటి ప్రవర్తిస్తున్నారంటూ యడ్లపాడు స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ ఆరోపణ చేయడం తగదన్నారు. ఇతరులు ఇచ్చిన ఆస్తులకు తాళం వేయడం మీ హక్కు కాదు, అక్రమ ప్రవేశాలను సహించమని హెచ్చరించారు. పాఠశాల విద్యా సంవత్సరం మధ్యలో యాజమాన్యం బాధ్యతలు తాము స్వీకరించడంతో అడ్మిషన్లు అడ్డంకులకు గురయ్యాయని, అయినప్పటికి ప్రకటనల ద్వారా విద్యార్థులను చేర్చే ప్రయత్నంలో కమిటీ అడ్డంకులు సృష్టించిందన్నారు. అభివృద్ధి పేరుతో మా పాఠశాల పక్కనే జడ్పీ స్కూల్ ఎలా నిర్మించడానికి అనుమతి ఇచ్చారన్నారు. ఈ విషయం తెలిసి ఏఈఎల్‌సీ వెంటనే స్పందించి న్యాయస్థానాన్ని ఆశ్రయించిందన్నారు. జెడ్పీ హైస్కూల్ అడ్డుకునే ప్రయత్నం చేసిందన్నారు. అదేవిధంగా లూథరన్ హైస్కూల్ అభివృద్ధి నిమిత్తం ఏఈఎల్సీకు చెందిన 12 ఎకరాల ఎండోమెంట్ భూమిని స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులే లీజుకు తీసుకోవడం దారుణమని వారు విమర్శించారు. ఇది లూథరన్ ఆస్తులని, ఒకవేళ అభివృద్ధి కమిటీ లేదా ఇతరులకు హక్కు ఉందని భావిస్తే కోర్టుకు వెళ్లి తేల్చుకోండి అని, దానం ఇచ్చిన ఆస్తిని తిరిగి ఎవరూ అడగలేరు అని స్పష్టం చేశారు. లూథరన్ హైస్కూల్ నిర్వహణ బాధ్యత మాత్రమే ఇచ్చినట్టుగా చెప్పడం అసత్యమని, 70ఏళ్లగా పాఠశాలను నిర్వహిస్తోందన్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఇన్నేళ్ల ఇక్కడ విద్యాసంస్థను నడిపిన వారికి హక్కులు, బాధ్యతలు ఉండవా అంటూ ప్రశ్నించారు. సంఘస్తులు అందరూ సమావేశంలో ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సమావేశానికి వెస్ట్ గుంటూరు సినేడ్ పరిదిలోని 70మంది దైవ సేవకులు, సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

**..కొనమెరుపు :** పాఠశాల మూసివేతకు ప్రభుత్వం అదేశాలు ఇచ్చింది, ఉపాధ్యాయులు బదిలీకావాలని అదేశాలు ఇచ్చింది, దానిపై ఎటువంటి స్పందన లేదు. కానీ పాఠశాల జరుగుతుంది అంటూనే పాఠశాల ఆవరణలో కార్యక్రమాలు నిర్వహించడం, ప్లకార్డులు పట్టుకోవటం విద్యాలయాలలో ఇది ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. అంతే కాకుండా గ్రామంలో పోలీసులు 144సెక్షన్ అమలులో ఉందని చెప్పటం మరో ప్రక్క వీరు భారీగా తరలి వచ్చికార్యక్రమాలు జరపటంపై పలువురు చర్చించుకుంటున్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఏఎం.రెడ్డి కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం



రొంపిచర్ల, నవంబర్ 18 ప్రభాతవార్త :: మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామ పరిధిలోని ఏఎం. రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో సోమవారం నూతనంగా బి ఫార్మసీ, ఫార్మా డీ కోర్సులకు అర్హత పొందిన విద్యార్థిని, విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో పట్టుదలతో వారి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కళాశాలలోని మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చే విధంగా, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలన్నా రు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి భార్గవ్ భూషణ్ రావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## . గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

నరసరావుపేట,నవంబరు18 ప్రభాతవార్త : స్థానిక పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం 8,9,10, తరగతి విద్యార్థులను క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖ అధికారి ఎడ్లపాటి రాధ మాట్లాడుతూ సాధారణంగా ప్రతి మనిషి జీవితంలో సందేహాలు వస్తూవుంటాయని వాటిని తీర్చుకోవడం కోసం గ్రంథాలయాలకు వెళ్ళితే వారి సందేహాలకు సమాధానాలు దొరుకుతాయన్నారు. ప్రతి మనిషి తన సొంత గ్రంథాలయాన్ని కలిగి ఉండాలన్నారు.ఐన్ స్టీన్ వంటి మహా శాస్త్రవేత్త తనకు ఈ ప్రపంచంలో గ్రంథాలయం ఒక్కటి చాలని, అందులోనే తనకు స్వర్గం కనిపిస్తుందని అన్నారని తెలిపారు. ఈ పోటీలకు పట్టణ లోని వివిధ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఆసక్తితో పాల్గొన్నారు.

## రూ.85 లక్షలతో నూతన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

### పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, నవంబర్ 18 ప్రభాతవార్త : మండలంలోని ఉప్పలపాడు గ్రామ పరిధిలోని జగనన్న కాలనీకు వెళ్లే ప్రధాన రహదారికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.85 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.అరవింద బాబు



మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం వేగంగా జరుగుతుందన్నారు. అందులో భాగంగానే జగనన్న కాలనీ వాసుల కోరికను నెరవేరుస్తూ ఈ రోడ్డు నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. 850 మీటర్ల పొడవు, 60 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న ఈ తారు రోడ్డుతో పాటు, 2026 మార్చి నాటికి కాలనీలో సైడ్ కాలువలు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్ల నిర్మాణం కూడా పూర్తవుతాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ శాఖ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నరసరావుపేట మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు

నకరికల్లు, నవంబర్ 18 ప్రభాతవార్త :: స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. తమ కళాశాలలో ఈనెల 14 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు.



విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు మరియు సోషల్ మీడియా వలన లాభ నష్టాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీలలో అలేఖ్య (బిఎస్సి), పి. నాగజ్యోతి (బికాం), ఎం. శృతి (బిఎస్సి), యు. దేవివాణి (బిఎస్సీ) గెలుపొందారని, వీరికి కళాశాల డైరెక్టర్ కే. నాసరయ్య, ప్రిన్సిపల్ ఎన్. వెంకటేశ్వర్లు బహుమతులను ప్రధానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఆర్.కె. సతీష్ బాబు, డాక్టర్ డి. యోగేశ్వర రావు, లైబ్రేరియన్ కే.ఎం.ఎల్. ప్రసాద్ పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆందోళ

నకరికల్లు, నవంబర్ 18 ప్రభాతవార్త : నరసరావుపేట తాహసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు ఆధ్వర్యంలో సిపిఐ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలపై మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగానిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత



మైనార్టీల పైన మహిళ పైన దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. గిరిజనులకి అందాల్సినటువంటి విద్య, వైద్యం అందటం లేదన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ఈ దేశంలో ఉన్న మైనార్టీలకి రక్షణ లేకుండా పోయిందని, వారిపై దాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే అన్నారు. గిరిజనులకు విద్య వైద్యం తో పాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. హక్కులకై సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దేశ వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. తహసిల్దార్ వేణుగోపాల్ కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, రోడ్డ అంజిరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం. నాగేశ్వరావు, వెంకయ్య, కొండలు, ఏసు, జక్రం ఏసోబు, తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌కు ఆర్ఓ ప్లాంట్ బహూకరణ అభినందించిన ఎమ్మెల్యే

నరసరావుపేట, నవంబర్ 18 ప్రభాతవార్త : పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌కు లక్ష రూపాయల విలువ చేసే ఆర్వో మంచినీటి ప్లాంట్‌ను మురళి పెయింట్స్ యజమానులు అందించారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు చేతుల మీదుగా కార్యక్రమం జరిగింది. ఆర్వో ప్లాంట్ ద్వారా అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రతి పేద, మధ్య తరగతి వ్యక్తికీ స్వచ్ఛమైన మంచినీరు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే డా.అరవింద బాబు పేర్కొన్నారు. దాతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదేశాల మేరకు, పి4 కార్యక్రమం ద్వారా తాను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




**మక్కా ప్రమాద మృతులకు ఎమ్మెల్యే నివాళి:.....** మక్కా యాత్ర ప్రమాదంలో సజీవ దహనం అయిన 45 మంది హైదరాబాదీల మృతికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం సంతాపం తెలిపారు. పవిత్రమైన మక్కాయాత్ర ప్రమాదంలో 45 మంది హైదరాబాదుకు చెందిన వారు సజీవ దహనం అవడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఒక డ్రైవర్ చేసిన తప్పిదం వల్ల ఒకే కుటుంబానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి నసీరుద్దీన్ కుటుంబానికి చెందిన 18 మంది చనిపోవడం అంటే మాటలకు అందని విషాదమన్నారు. అక్కడ ప్రభుత్వాలు ఇటువంటి సంఘటనలు జరగకుండా కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు విజ్ఞప్తి చేశారు.ఘనంగా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ 40వ వార్షికోత్సవం...స్థానిక ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ 40వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులు, మానసిక వికలాంగులకు ప్రత్యేక విద్యా బోధన అందిస్తున్న ఈ పాఠశాల 40 సంవత్సరాలుగా సేవలందిస్తోందని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా ఈ పాఠశాల నిరంతరం దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తుండటం అభినందనీయమ న్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ఈపూరు, నవంబర్18, ప్రభాతవార్త: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ముప్పాళ్ళ శాఖ నందు విద్యార్థులకు రోడ్ సేఫ్టీ అంశంపై చిత్రలేఖనం పోటీలు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పి స్కూల్ హెచ్ఎం సాంబనాయక్ పాల్గొన్నారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను, పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్.నాగలక్ష్మి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

### నూజెండ్ల మండల తెదేపా అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి (బాబు)

వినుకొండ,నవంబర్18,ప్రభాతవార్త: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని నూజెండ్ల మండల తెదేపా అధ్యక్షులు గంగినేని రాధాకృష్ణమూర్తి (బాబు) అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని జెడ్పి స్కూల్ నందు నిర్వహించిన క్రీడా పోటీల్లో



విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం కార్యక్రమం గంగినేని రాధాకృష్ణమూర్తి (బాబు) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రతి ఏటా బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వీరప్పయ్య, ఖమ్మంపాడు,ములకలూరు మాజీ సర్పంచ్‌లు చంద్రశేఖరరావు,వెంకట్రావు,నూజెండ్ల మాజీ ఎంపిపి శ్రీనివాసరావు,నాగిరెడ్డి పల్లె రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సకలజనుల కార్తీక వనసమారాధన

వినుకొండ,నవంబర్18,ప్రభాతవార్త: పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకొని స్థానిక సురేష్‌మహల్ రోడ్డులోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం నందు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీనియర్ న్యాయవాది సిహెచ్ఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో సకలజనుల కార్తీక వనసమారాధన





కార్యక్రమం ఘనంగా చేశారు. కార్యక్రమంలో పదివేల మంది వరకు పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు. ముఖ్య అతిథులుగా సీనియర్ న్యాయవాది సైదారావు,రామకోటేశ్వరరావు,పలువురు రాష్ట్రస్థాయి కళాకారులు పాల్గొని స్వయంగా భోజనాలు వడ్డించారు. పట్టణంలోని భక్తులు,ప్రజలుతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి స్థానిక కొండమెట్ల వద్ద గల అతి పురాతనమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జాజుల మాల్యాద్రి ఆధ్వర్యంలో సకలజనుల కార్తీక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ప్రత్యేక పూజలు,అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ న్యాయవాదులు సైదారావు,రామకోటేశ్వరరావు పాల్గొని అన్నసంతర్పణ చేశారు.

## సామాన్య భక్తులకు వైకుంఠద్వార దర్శనం హర్షణీయం: చీఫ్ విప్ జీ.వీ

వినుకొండ,నవంబర్18,ప్రభాతవార్త: తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులుపాటు కలి ్పస్తూ టీటీడీ ప్రకటించడం హర్షనీయమని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో టీటీడీ తీసుకున్న నిర్ణయంతో సామాన్య భక్తులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అనుక్షణం ప్రజల పక్షాన పని చేస్తుందన్నారు.



## మద్యం దుకాణాల వద్ద డెకాయ్ ఆపరేషన్



ఈపూరు,నవంబర్18,ప్రభాతవార్త: ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈపూరు గ్రామంలోని మద్యం దుకాణాల వద్ద ఎక్సైజ్ అధికారులు డెకాయ్ ఆపరేషన్ మంగళవారం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ డి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మద్యం కేసులో నిందుతునిగా ఉన్న అంగలూరు గ్రామానికి చెందిన ఒక వ ్యక్తిని మండల తహశీల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు.

## ఉప్పరపాలెం,చాట్రగడ్డపాడు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

వినుకొండ,నవంబర్18,ప్రభాతవార్త: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పరపాలెం,చాట్రగడ్డపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏవో జి.వరలక్ష్మి క్షేత్రస్థాయిలో కంది పంటను పరిశీలించి చేపట్టాల్సిన సస్యరక్షణ




చర్యలను రైతులకు వివరించారు. మరూకా మచ్చల పురుగు నివారణకు 5శాతం వేప గింజల కషాయం లేదా 400ఎంఎల్ వేప నూనె,క్లోరోపైరిపాస్ 400ఎంఎల్ పిచికారి చేయాలని తెలిపారు. పీఎంకిసాన్,అన్నదాత సుఖీభవ పెండింగ్ ఉన్న రైతులు ఎన్‌పిసిఐ,ఆధార్ యాక్టివ్ చేయించుకోవాల్సిందిగా కోరారు.

## విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు.



సత్తెనపల్లి టౌన్ నవంబర్ 18ప్రభాతవార్త : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం సత్తెనపల్లి పట్టణంలోని జిల్లా గ్రంథాలయాల పరిషత్ శాఖ ఆధ్వర్యంలోని వైయస్సార్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వకృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కృత్రిమ మేధస్సు పై లాభాలు నష్టాలపై ,వ్యాసరచన, మానవ సంబంధాలు, వృధాశ్రమాలపై వకృత్వ పోటీలు జరిగాయి. ఆయా పోటీల్లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాల, సరస్వతి శిశు మందిర్ పాఠశాల నుంచి విద్యార్థిని, విద్యార్థులు విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమేష్ ,రజిని ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తూనికలు-కొలతల శాఖ అధికారుల ఆకస్మిక దాడులు

క్రోసూరు, నవంబర్ 18 ప్రభాతవార్త: క్రోసూరు మండల కేంద్రంలో మంగళవారం తూనికలు-కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇన్స్పెక్టర్ జాన్ సైదా మండలానికి రాగానే బంగారపు దుకాణాలు, కిరాణా, పచారీ షాపులు వరుసగా మూసివేయడంతో స్థానికులు ఆశ్చర్యపోయారు.తనిఖీలు జరుగుతున్న సమయం లోనే దుకాణాలు మూసివేయడం పట్ల ప్రజలు తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. కొంతమంది స్థానికుల సమాచారం ప్రకారం, కొలతల్లో తేడాలు ఉండటంతో వాటిని దాచిపెట్టేందుకు దుకాణదారులు షాపులు మూసివేశారని ఆరోపించారు. అధికారులు తనిఖీలను కొనసాగిస్తూ.. కొలతల ప్రమాణాలను ఉల్లంఘించిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## సీఎం సహాయనిధి చెక్కులను అందించిన ఎమ్మెల్యే'కన్నా'

సత్తెనపల్లి, నవంబర్ 18 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే క న్నా లక్ష్మీ ్నారాయణ మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులకు అండగా సీఎం సహాయ నిధి నిలుస్తుంది అన్నారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిది ఎంతో ఊరట కలిగిస్తుందన్నారు. నియోజకవర్గంలోని 23 మంది లబ్ధిదారులకు 14 లక్షల అరవై నాలుగు వేల 50 రూపాయలు అందజేశామన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు సీఎం చంద్రబాబు నాయుడు తో పాటు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, పట్టణ,మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు



## విద్యాసంస్థల సమీపంలో గంజాయి, ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం

బాపట్ల,నవంబర్18,ప్రభాతవార్త: విద్యాసంస్థల సమీపంలో గంజాయి, ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలోని పోలీసు అధికారులు తమ పరిధిలో ఉన్న విద్యాసంస్థల సమీపంలో 100 మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాలు, బడ్డీకొట్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలో ఉన్న దుకాణాలలో గంజాయి, సిగరెట్లు, పాన్, గుట్కా వంటి ఇతర పొగాకు ఉ త ్ ప ్ త ు ల ు విక్రయించరాదనే నిబంధన ఉందన్నారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల సమీపంలోని దుకాణాలను సంబంధిత పోలీసు అధికారులు ముమ్మరంగా తనిఖీ చేశారన్నారు. నిబంధనలను ఉల్లంఘించి పొగాకు ఉత్పత్తులు, పాన్, గుట్కా వంటి వాటిని విక్రయిస్తున్న 80 మందిపై సిఒపిటిఎ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గడిచిన 5 నెలల నుండి 1558 మందిపై కేసులు నమోదుచేశామన్నారు. విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, ఆ లక్ష్య సాధన కోసం కృషి చేసే క్రమంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే గంజాయి వంటి మత్తుపదార్థాలు, పొగాకు ఉత్పత్తుల నిల్వలు కలిగి ఉన్నా, అక్రమంగా వాటిని విక్రయిస్తున్న వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, నిల్వ, రవాణా చేస్తే వారిపై సిఒపిటిఎ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు లేని ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు, నిషేధిత పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన సమాచారం ఉన్నట్లయితే వెంటనే సంబంధిత పోలీసులకు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1972, 112లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సిఒపిటిఎ చట్టం ప్రకారం కేసులు నమోదుచేసినప్పటికీ విద్యాసంస్థల సమీపంలో గంజాయి, ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే దుకాణాలను మున్సిపల్,పంచాయతీ శాఖల అధికారుల ద్వారా తొలగిస్తామని హెచ్చరించారు.



## విద్యార్థినులకు గుడ్‌టచ్,బ్యాడ్‌టచ్ గురించి అవగాహన

బాపట్ల,నవంబర్18,ప్రభాతవార్త: సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, ఆ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రతి విద్యార్థిని అవగాహన కల్గిఉండాలని ఎస్ఐ ఎం.అనిత తెలిపారు.జిల్లాలోని శక్తి బృందాలు వారి పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాలమేరకు విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిత మాట్లాడుతూ ప్రధానంగా పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి డెమో చేసి ఏది గుడ్ టచ్, ఏది బ్యాడ్ టచ్ అనే విషయాలను, కళాశాలలోని విద్యార్థినిలకు శక్తి యాప్, మహిళలకు సంబంధించిన చట్టాలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు తదితర పలు విషయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. బాపట్ల జిల్లా హెడ్‌క్వార్టర్స్ శక్తి బృందం బాపట్ల మండలం జిల్లెలమూడి గ్రామంలో గల మాతృశ్రీ ఓరియెంటల్ కాలేజీలోని విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ అవగాహన కార్యక్రమంలో శక్తి యాప్ ఏ విధంగా మొబైల్ ఫోన్లలో నిక్షిప్తం చేసుకోవాలి, దానిని అత్యవసర పరిస్థితుల్లో ఏ విధంగా వినియోగించుకోవాలి, యాప్‌లో నిక్షిప్తమై ఉన్న విస్తృతమైన సమాచారం తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు. దానితో పాటు ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, ఆ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఏ విధంగా వ్యవహరించాలి, మహిళలకు సంబంధించిన చట్టాలు, పోక్సో చట్టం, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి, వాటి బారిన పడకుండా ఏ విధంగా అప్రమత్తంగా వ్యవహరించాలనే విషయంపై, 112, 181, 1091, 1930, 1098, 1972 అను టోల్‌ఫ్రీ నెంబర్లు వినియోగించవలసిన సందర్భాలు గురించి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. మహిళలకు భద్రత కల్పించేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు, ఆశ్రయం కల్పించేందుకు ఏర్పాటు చేయబడిన సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో అందించే సేవల గురించి విద్యార్థినిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల హెడ్‌క్వార్టర్స్ శక్తి బృందం ఎస్ఐ ఎం.అనిత, బృందం సభ్యులు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.




## సమర్థవంతమైన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

పిట్టలవానిపాలెం,నవంబర్18,ప్రభాతవార్త: మండలపరిదిలోని ఖాజీపాలెం గ్రామంలో రైతు సేవ కేంద్ర పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సమర్థవంతమైన ఎరువుల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ సత్యానంద్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం యొక్క ఉద్దేశము మరియు ఎరువులు సమర్థవంతమైన వినియోగంపై రైతులకు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాట్ సెంటర్ కోఆర్డినేటర్ బాపట్ల డాక్టర్ కే అమృత రాజు మాట్లాడుతూ రైతులు ముందుగా తమ భూములను మట్టి నమూనాలు పరీక్షించి అందులో ఉన్న పోషకాల స్థాయి తెలుసుకుని వాటి ఆధారంగా ఎరువులను వినియోగించాలి. పంట అవసరాలను అనుకూలంగా ఎరువుల మోతాదును దశల వారీగా విభజించి ఉపయోగించడం వల్ల దిగుబడి మెరుగు పడటమే కాకుండా వ్యవసాయ ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు. వరి పంటలో నత్రజని భాస్వరం పొటాష్ ఎరువులు ఏ దశలో ఎంత మోతాదు వెయ్యాలని స్పష్టంగా తెలియజేశారు. సూక్ష్మ పోషకాల ప్రాధాన్యతను తెలియజేసినారు. ఈ కార్యక్రమానికి నీటి సంఘం ప్రెసిడెంట్ రుద్రరాజు సత్యనారాయణ రాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు కే ప్రశాంతి, సిహెచ్ సుదర్శన రావు రైతులు మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



## పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు

పిట్టలవానిపాలెం,నవంబర్18,ప్రభాతవార్త: ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు పరిసరాలలోని దుకాణాలలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని చందోలు ఎస్సై ఎం వెంకట శివకుమార్ తెలిపారు. జిల్లా ఎస్ పి బి ఉమామహేశ్వర్ ఆదేశాలమేరకు మంగళవారం నాడు ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమం లో భాగంగా ఎస్సై తమ సిబ్బందితో కలసి తమ పరిధిలోని విద్యాసంస్థల సమీపంలో గల దుకాణాలను విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులు, పాన్, గుట్కా వంటి వాటిని విక్రయిస్తున్న వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



## తుఫానుకు పడిన గండి పూడ్చటం మరిచారు

కర్లపాలెం,నవంబర్18,ప్రభాతవార్త: కర్లపాలెం మండలంలో ఇటీవల వచ్చిన తుఫానుకు ప్రధాన రహదారులకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. రోడ్డుమీద వద్ద పెద్దను తొలగించారు కానీ రహదారులకు పడిన గండ్లు పూడ్చటం మరిచారు. దీంతో రహదారి విరిగిపడి పోతుంది. తుఫానుకు రహదారులు కోతకు గురై మండలంలో అనేకచోట్ల రోడ్లకు భారీ గండ్లు పడ్డాయి. వాటిని జేసిబి సహాయంతో పూడ్చి మట్టి వేస్తే సరిపోతుంది. కానీ అధికారులు వాటిని మరిచిపోవటంతో ఇప్పుడు రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా కర్లపాలెం పేరలి రహదారిలో రెండు చోట్ల, పెదగొల్లపాలెం పంచాయతీలో మూడు చోట్ల, పెద్ద గొల్లపాలెం పరిధిలోని వద్ద ఒకటి, పేరలి తుమ్మలపల్లి రహదారుల రెండు చోట్ల ఇలా మండలం మొత్తం దాదాపూ ప్రధాన రహదారులకు చాలా గండ్లు పడ్డాయి. వీటిని అధికారులు వెంటనే పూడ్చకపోతే భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.



# బాపట్ల జిల్లా వార్త



## ప్రజాసేవకు అధికారం తో సంబంధం లేకుండా, బాధితులకు అండగా కోన రఘుపతి

కర్లపాలెం,నవంబర్18,ప్రభాతవార్త: బాపట్ల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కోన రఘుపతి ఆదేశాలు మేరకు పిట్టలవాని పాలెం మండలం చందోలు, జుల్ఫా వీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో భాదితులకు వైస్సార్సీపీ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఖినిత్యవసర వస్తువులు మరియు 10 వేలు ఆర్థిక సహాయం చేయడం జరిగిందిఖి. వారికి అన్ని వేళల్లో అండగా వుంటాం అని భరోసా కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబం పట్ల ప్రభుత్వం పూర్తి సహాయ సాకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ షేక్ బాజీ, ఏపీ రాష్ట్ర మైనార్టీ డెవలప్మెంట్ కార్యదర్శి అహ్మద్ హుస్సేన్, పిట్టల వానిపాలెం మండలం వైస్సార్సీపీ యువజన అధ్యక్షుడు షేక్ మోలాలి, గ్రామ పార్టీ అధ్యక్షుడు అమీర్, మండల సోషల్ మీడియా కన్వీనర్ గౌస్ ఖాన్, వైయస్సార్ సిపి నాయకులు మునీర్,ఇషాక్, సుమంత్,అహమ్మద్,తదితరులు పాల్గున్నారు.



## ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి

బాపట్ల,నవంబర్18,ప్రభాతవార్త: ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్డీవో గ్లోరియ అధికారులను ఆదేశించారు.డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశాన్ని మంగళవారం బాపట్ల ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో గ్లోరియ అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్బంగా ఆర్‌డివో గ్లోరియా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలు, సామాజిక వివక్ష రూపుమాపడానికి అందరు కృషి చేయాలని అన్నారు ప్రభుత్వ పథకాలు వారికి సక్రమంగా అందేలా తహశీల్దార్‌లు, ఎంపిడివోలు పనిచేయాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు సంబంధించి కేసులలో తహశీల్దార్‌లు సత్వరమే స్పందించి కుల దువీకరణ పత్రాలు ఇస్తున్నారని ప్రస్తుతం పెండింగ్ ఏమీ లేవని డిఎస్పీ రామాంజనేయులు తెలిపారు డివిజన్ లోని అందరు తహశీల్దార్‌లు,ఎంపిడివోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 సర్వేను వేగవంతం చేయాలి

బాపట్ల,నవంబర్18,ప్రభాతవార్త: ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 సర్వే ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులకు సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆవాస్ ప్లస్ 2024 సర్వేలో ప్రజలు వారి పేర్లను నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం అందించే గృహాలను పొందాలన్నారు. ఆవాస్ ప్లస్ సర్వేను ఎంపీడీవోలు, గ్రామ సచివాలయం సిబ్బంది గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇంటింటికి వెళ్లి ఈ సర్వేను నిబద్ధతతో పూర్తి చేయాలన్నారు.లబ్ధిదారుల ఫోటోలను యాప్ లో నిక్షిప్తం చేయాలన్నారు. ఈ విషయమై ప్రతిరోజు ఒక మండలాన్ని తనిఖీ చేయాలని ఆయన పిడి హౌసింగ్ కు తెలిపారు.తీర ప్రాంతాలలోని ప్రతి గృహానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఐ విఆర్ఎస్ లో ఇంటి నుండి చెత్త సేకరణ జరుగుతుందా అనే విషయమై ఒక ప్రణాళిక నిర్వహించుకుని, జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈఓ లు, డి యల్ డి వో లు ప్రతిరోజు ఒక గ్రామాన్ని సందర్శించాలని, జిల్లాలోని పంచాయతీలలో ఏరోజుకారోజు అధికారులు గ్రామపంచాయతీలను పర్యవేక్షిస్తూ స్వచ్ఛత గురించి సూపర్ విజిట్ చేయాలన్నారు. స్వచ్ఛత లో ప్రతి గ్రామంలో 100 అభివృద్ధి కనపడాలని ఆయన అన్నారు. స్వచ్ఛతా కార్యక్రమంలో వెనుకబడి ఉన్న పంచాయతీల ఎంపీడీవోలకు షో కాజ్ నోటీసులు అందజేయాలని, జిల్లాకు మంజూరు సామాజిక మరుగుదొడ్లు వేగంగా నిర్మించాల న్నారు. గృహ నిర్మాణ శాఖ పీడి వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, సిపిఓ షోరూం రాజు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈ లు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లు మరియు తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ అనుమతులు, వాల్టా చట్టం ఆధారంగా ఇసుక రేవులు అనుమతించాలి

బాపట్ల,నవంబర్18,ప్రభాతవార్త: పర్యావరణ అనుమతులు, వాల్టా చట్టం ఆధారంగా ఇసుక రేవులు అనుమతించాల్సి ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణ నది పరివాహక ప్రాంతాలలో ఇసుక లభ్యత ఉందన్నారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం ఇసుక రేవులో 14.960 హెక్టార్ల ఇసుక లభ్యత ఉందన్నారు. స్థానికుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ తదుపరి ఆ ప్రాంతం నుంచి ఇసుక తవ్వడానికి అనుమతి ఉంటుందన్నారు. ప్రజా అభిప్రాయ సేకరణ నిబంధన అనుసరించి వేగంగా చేపట్టాలన్నారు. ఓలేరు రేవులో ఇసుక తవ్వకాలు జరపడానికి ముందస్తు పరిశీలన చేయాలన్నారు. నూతనంగా కొల్లూరు మండలంలోని చిలుమూరు, గాజుల్లంక వద్ద మూడు రేవులను గుర్తించామన్నారు. సాంకేతిక నిపుణులు, కమిటీలోని ఆయా శాఖల అధికారులు కలిసి క్షేత్రస్థాయి పరిశీలన తదుపరి అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. తాజాగా గుర్తించిన చిలుమూరు ఇసుక రేవులో 4.9 హెక్టార్లలో ఇసుక లభ్యత ఉందని,అలాగే గాజుల్లంక ఎ ప్రాంతంలో 4.9 హెక్టార్లు, గాజుల్లంక బి ప్రాంతంలో 4.9 హెక్టార్లు సిద్ధంగా ఉందన్నారు. ఆ ప్రాంతాల్లో తవ్వడానికి అధికారికంగా అనుమతులు రావాల్సి ఉందన్నారు. వాల్టా చట్టం ఆధారంగా పర్యావరణ అనుమతులను పరిశీలించాలన్నారు. భూగర్భ జలాల సమతుల్యత పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఇసుక రేవులు ఉన్న ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వాటిని ఇంటర్నెట్ ద్వారా కలెక్టరేట్ కు అనుసందానించాలన్నారు. భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక లభ్యత జిల్లాలోని ఇసుక రేవుల వద్ద ఉందన్నారు. వాటిని చట్టబద్ధంగా వినిపించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి బి రామచంద్ర, భూగర్భ జల శాఖ ఏడి సురేష్, డి టి ఓ పరంధామరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, కమిటీలోని ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత 18 వ మహాసభలను విజయవంతం చేయాలి

కొల్లిపర,నవంబరు 18 ప్రభాతవార్త: విశాఖపట్నంలో జరగనున్న అఖిల భారత 18 వ మహాసభలను డిసెంబరు 31 వ తేదీ నుండి 2026 జనవరి 4 వ తేదీ వరకు జరగనున్నాయని మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు,.మంగళవారం మండల కేంద్రం కొల్లిపర కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం ఆవరణలో మహాసభల కరపత్రాలను సీఐటీయూ నాయకులు..ఉద్యోగులతో కలసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యావత్తూ కార్మిక వర్గాన్ని ఐక్యపరచటం సీఐటీయూ ఆశయమని కార్మిక..కర్షక..ఐక్యత కోసం కృషి చేస్తుందన్నారు.కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో గుదిబండి శివనాగిరెడ్డి,సీఐటీయూ నాయకులు ఎ.పూర్ణారెడ్డి,బొంతు లక్ష్మారెడ్డి,ఆరిమండ శ్రీనివాసరెడ్డి,సహకార సంఘ: ఉద్యోగులు అవుతు స్వాతి,గనిపిశెట్టి విజయభాస్కర్,గంపల వెంకట్రావు,యర్రు వెంకటేశ్వరరావు,వల్లభాపురం గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం

పొన్నూరు, నవంబరు 18,ప్రభాతవార్త: స్వర్ణపురి పట్టణంలో కొలువై ఉన్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయంలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక మాసం చివరి రోజు కావడం, అందులోనూ మంగళవారం కావడంతో శ్రీ వీరాంజనేయ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. అతి పెద్ద ఏక శిలా విగ్రహం ఇక్కడనే ఉండడం, అత్యంత మహిమాన్వితమైన, ప్రజల కొంగు బంగారమై వెలుగొందుతుండడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అదీకాక బాపట్ల జిల్లా సూర్యలంకలో పెద్ద ఎత్తున సముద్ర స్నానాలు ఆచరించేందుకు కూడా వెళ్ళే మార్గం స్వర్ణపురి కావడంతో భక్తి, ముక్తి కలిసి వచ్చే విధంగా భక్తులు ముందస్తుగా ప్రణాళికా బద్దంగా తరలి వచ్చారు. భక్తుల తాకిడికి తగ్గట్లుగా కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాధ్ పర్యవేక్షణలో సిబ్బంది పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పేరొందడంతో కొంత మంది భక్తులు స్వామివారికి వేకువ జామునే అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. దీంతో దేవాలయం పరిసరాలన్నీ భక్తులతో, వారు వచ్చిన వాహనాలతో నిండిపోయింది.



## మాజీ కౌన్సిలర్ ముక్కాలకు పితృవియోగం

పొన్నూరు, నవంబరు 18,ప్రభాతవార్త: పురపాలక సంఘ పరిధిలోని 19వ వార్డు మాజీ కౌన్సిలర్ ముక్కాల విజయబాబు తండ్రి ముక్కాల విస్సాకు(80)వృద్ధాప్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైకాపా నాయకులు కార్యకర్తలు, అభిమానులు ముక్కాల విస్సాకు మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను విజయబాబును అడిగి తెలుసుకొన్నారు. సంతాపం వ్యక్తం చేసినవారిలో వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బొనిగల వేణుప్రసాద్, మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన శివనాగరాజు, వైకాపా మాజీ జిల్లా అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య, మాజీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు షేక్ షఫాయితుల్లా, మాజీ అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషు, నల్లమోతు రవీంద్రబాబు, సుబ్రహ్మణ్యం, వైకాపా మండలపార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, మర్రెడ్డి సురేంద్రరెడ్డి, మైనార్టీ నాయకుడు షేక్ మౌలాలి తదితరులున్నారు.



## శాంతోమ్ కరుణాలయానికి నిత్యావసరాలు పంపిణీ

పొన్నూరు, నవంబరు 18,ప్రభాతవార్త: పట్టణంలోని వడ్డిముక్కల రోడ్డులో ఉన్నటువంటి శాంతోమ్ కరుణాలయానికి రిలైబుల్ ట్రస్ట్ నిర్వాహకులు నిత్యావసరాలను, అందులో ఉన్నటువంటి వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా పేదలకు తమకు తోచిన విధంగా సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. శాంతోమ్ కరుణాలయం అనేక మంది ఆసరాగా నిలుస్తోందన్న విషయం తెలుసుకొని ఇక్కడ కూడా తమ సేవలు వినియోగించాలని వచ్చినట్లు చెప్పారు. ఆశ్రమంలో ఉన్న 200మంది మానసిక వికలాంగులకు మూడు నెలలకు సరిపడా రూ.4లక్షలు విలువ చేసే నిత్యావసరాలను అందజేశారు. అందులో ఉన్నటువంటి వారికి రగ్గులు, దుప్పట్లు, ప్యాన్లు, గీసర్లను కూడా అందజేశారు. కరుణాలయంలో వున్నటువంటి వారు కూడా తమ ఇంట్లో ఉన్నట్లుగానే భావించాలనే ఉద్దేశంతోనే తమ వంతు బాధ్యతగా ఈ సౌకర్యాలను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొని మాట్లాడుతూ శాంతో కరుణాలయం ఎంతో మంది మానసిక వికలాంగులకు వేదికగా నిలిచిందన్నారు. జిల్లాలోని వికలాంగులే కాకుండా ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి ఆశ్రయం పొందుతున్నారన్నారు. పోలీసు శాఖ కూడా వారి వద్దకు వచ్చిన మానసిక వికలాంగులను, వృద్ధులను కూడా ఇక్కడి తరలిస్తుండడం తరచు జరుగుతుందన్నారు. ఇంతి సేవలు అందిస్తున్న శాంతోమ్ కారుణాలయం నిర్వాహకుడు గోతాల స్వామి కారణజన్ముడన్నారు. అనంతరం దాత తుపాకుల రవిని ఆశ్రమం నిర్వాహకులు సత్కరించారు.




## శంకర మఠంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు

పొన్నూరు, నవంబరు 18,ప్రభాతవార్త: పట్టణంలో బ్రాహ్మణ బజారులో కొలువై ఉన్న శంకరమఠంలో కార్తీక మాసం, మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. వేకువజామునే అర్చకస్వాములు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనల కార్యక్రమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఏపి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్(పివిఎస్ఎస్‌వి ప్రసాద్), బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు గణపవరపు రామశాస్త్రి పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.



## హార్వెస్ట్ సహాయంతో వరికోతలు కోయించుకోండి

పొన్నూరు, నవంబరు 18,ప్రభాతవార్త: రైతులు హార్వెస్ట్ సహాయంతో వరికోతలు కోయించుకొని, ధాన్యాన్ని ఎండబెట్టి 17శాతం తేమ వచ్చేదాక చూడాలని మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు సూచించారు. రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరలకు విక్రయించుకోవాలని సూచించారు. రైతులు తొందరపడి బయటి వ్యక్తులకు విక్రయించుకోవద్దని కోరారు. ఆత్మ పథకం కింద రబీ పంటలలో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.మొక్కజొన్న పైరులో తొలి దశ నుండి కత్తెర పురుగును నివారించుకోవాలన్నారు. అపరాలలో పూతలో పురుగు నివారణ చర్యలు గురించి వివరించారు.ఈ నెల 19వ తేదీ అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకము రెండవ విడత సొమ్ము ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు పూజశ్రీ, కె.పవన్, ఎంపీఈఓ సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు

పొన్నూరు, నవంబరు 18,ప్రభాతవార్త: కార్తీక మాసం ముగుస్తున్న నేపథ్యంలో భక్తులు దేవాలయాలకు వెళ్ళి వారి వారి స్థాయిలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్నారు. తెనాలి విశ్వకర్మ దేవస్థానంలో కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎన్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాత్రేనమ: బృందం సభ్యులు వివిధ రకాల పుష్పాలతో, ప్రమిదలతో ఏర్పాటు చేసిన శివలింగాకారం భక్తులను ముగ్ధులను చేసింది. ఆధ్యాత్మిక చింతన ఉట్టిపడేవిధంగా ఈ ప్రమిదలను ఏర్పాటుచేసి భక్తిప్రపత్తులను చాటుకున్నారు.



## ధాన్యం సేకరణకు మిల్లర్లు సిద్దంగా ఉండాలి

పొన్నూరు, నవంబరు 18,ప్రభాతవార్త: రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరణకు మిల్లర్లు సిద్దంగా ఉండాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం రైస్ మిల్లర్లతో ధాన్యం సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిల్లర్లు గోనెసంచులు, బ్యాంకు గ్యారెంటీ, మాయిచ్చర్ మీటర్లు అన్నీ సిద్దంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యంకొనుగోలు చేయాల్సిందేనన్నారు. అలసత్వం వహిస్తే జిల్లా ఉన్నతాధికారుల తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్దామని తహశీల్దార్ జియావుల్ హక్ సూచించారు. సమావేశంలో తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, సీఎస్‌డీటి పేరాల దుర్గారావు మిల్లర్లు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

యడ్లపాడు, నవంబర్ 18, ప్రభాతవార్త : యడ్లపాడు శాఖ గ్రంథాలయం నందు నిర్వహించుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు.



సమావేశంలో మండల పరిషత్ ప్రాథమిక ఎస్టీ స్కూల్ హెచ్ఎం బి పుష్పావతి, బాసట సామాజిక సాంస్కృతిక అధినేత నూతలపాటి కాళిదాసు, ముత్తూ ఫైనాన్స్ బ్యాంకు మేనేజర్ బి శివశంకర్ విచ్చేసి విద్యార్థులు గ్రంథాలయాల పై అవగాహన కలుగజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సిహెచ్ అంజమ్మ, ఎడ్లూరు సంజీవరావు, జరుగుల నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు

మాచర్ల, నవంబరు 18 ప్రభాతవార్త: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాచర్ల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి మాచర్ల మెర్సీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలంగా ధరావత్తుదారుల వద్ద నుంచి తిరిగిరాని పుస్తకాలను ఈ నెల 20వ తేదీలోపు తీసుకువస్తే



అపరాధ రుసం లేకుండా తీసుకుంటామన్నారు. పాఠకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో ఆదర్శ్ పబ్లిక్ స్కూల్, సెయింటాన్స్ బాలికోన్నత పాఠశాల, సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, జడ్పీ బాలికోన్నత పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 20వ తేదీన జరగనున్న ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు మెర్సీ తెలిపారు.

## కస్తూరిబా పాఠశాలకు ఇనుప బీరువా అందజేత

మాచర్ల, నవంబరు 18 ప్రభాతవార్త: రోటరీక్లబ్ ఆఫ్ మాచర్ల మాజీ అధ్యక్షులు కీ.శే. వీరమాచినేని సుభాష్ చంద్రబోస్ జ్ఞాపకార్థం స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయానికి రూ.15 వేలు విలువ చేసే



ఇనుప బీరువాను అందజేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షులు తుమ్మల సత్యప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ 3150 డిసీజెస్ అండ్ ప్రివెన్షన్ ఛైర్మన్ డా॥ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ బాలికలు విద్యతోపాటుగా అనేక సాంకేతిక అంశాలపై కూడా నైపుణ్యాన్ని పెంపొందించుకుని, విద్యాలయానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. విద్యాలయానికి కావాల్సిన వసతుల కల్పనలో రోటరీక్లబ్ ఎప్పుడూ ముందుంటుందని క్లబ్ సెక్రటరీ ఆలేటి కోటేశ్వరరావు, ప్రెసిడెంట్ ఎలక్ట్ పఠాన్ నాగూర్‌వలి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ సీనియర్ సభ్యులు ఇక్కుర్తి శంకర్, కేపీ సిద్ధంరాజు, చెరుకూరి నరసింహారావు, డాక్టర్ మూఢావత్ దశరథ్ చౌహాన్, పందిరి నరసింహారావు, రామసింహారెడ్డి, విద్యాలయ ఉపాధ్యాయిని కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పట్లవీడులో ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

వెల్దుర్తి, నవంబరు 18 ప్రభాతవార్త: వెల్దుర్తి మండలం పట్లవీడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బత్తుల అంకమరావు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రమైన



కార్తీకమాసంలోని చివరి సోమవారం మాల ధరించిన స్వాములు, భక్తుల కోసం పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించడం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా పట్లవీడు గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. విద్యుద్దీపాల అలంకరణతో వెలుగులీనింది. భక్తిగీతాల ఆలాపన, వేదపండితుల మంత్రోచ్చారణలతో భక్తులు తన్మయం చెందారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు, అయ్యప్పస్వాములు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పల్నాడు ప్రాంత వ్యవసాయాభివృద్ధికి, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వరికపూడిసెల
## టీడీపీ యువనేత జూలకంటి సాయివివేకానందరెడ్డి

వెల్దుర్తి, నవంబరు 18 ప్రభాతవార్త: వరికపూడిసెల ప్రాజెక్టు పల్నాడు ప్రాంత వ్యవసాయాభివృద్ధికి, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిదని మాచర్ల ఎమ్మెల్యే తనయుడు, యువనేత జూలకంటి సాయి వివేకానందరెడ్డి అన్నారు.



పల్నాడు జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని అత్యంత కీలకమైన వరికపూడిసెల ప్రాజెక్టు ప్రాంతాన్ని టీడీపీ యువనాయకులు జూలకంటి సాయివివేకానందరెడ్డి విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ప్రాజెక్టు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వరికపూడిసెల పూర్తయితే వెల్దుర్తి మండలంలోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుబాటులోకి వస్తుందని, ఈ ప్రాంత ప్రజలకు ఇది జీవనాడి లాంటిదని సాయి వివేకానందరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సాయి వివేకా వెంట టీడీపీ నాయకులు వజ్రంనాయక్ పాల్గొని ప్రాజెక్టు గురించి వివరించారు.

## గంగలకుంటలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

వెల్దుర్తి, నవంబరు 18 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపు మేరకు రచ్చబండ కార్యక్రమం వెల్దుర్తి మండలం గంగలకుంటలో జరిగింది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్బసాని కోటిరెడ్డి, కంపసాటి కాటంరాజు, కంపసాటి బసవయ్య, కంచర్ల పెద్దిరాజు, గొల్ల ఎర్రబ్బాయి, బొడ్డుపాటి వెంకటరెడ్డి, వడ్డా రమణారెడ్డి, తంగిరాల అనంతరామిరెడ్డి, కంపసాటి బ్రహ్మయ్య, ముప్పూరి ఆంజనేయులు, అందుగుల యేసు, బొర్రట్టి మల్లయ్య, అందుగుల బుగ్గయ్య, గ్రామ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితురాలికి నిత్యవసర సరుకులు పంపిణీ

చిలకలూరిపేట, నవంబర్ 18, ప్రభాతవార్త: క్యాన్సర్ బాధితురాలికి నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన పాస్టర్ ప్రసన్న బాబు అభినందనీయులని అడ్వకేట్, మాదాసు భాను ప్రసాద్ అన్నారు.



.(నాదెండ్ల మండలం, గణపవరం) యేసుతో సహవాసం గ్రూపు సభ్యులు విజయ్ కుమారి, రమేష్ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నాదెండ్ల మండలం, గణపవరం గ్రామానికి చెందిన ఖాసింబి, సుభాని భార్యాభర్తలు. క్యాన్సర్ బాధితురాలైన ఖసింబి దీర్ఘకాలంగా ట్యూబులతో మలమూత్ర విసర్జన తో బాధపడుతున్నందున, పాస్టర్ ప్రసన్న బాబు ఆధ్వర్యంలో ఈరోజు 25 కేజీల బియ్యం, 28 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని అడ్వకేట్ మరియు సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ అన్నారు. యేసుతో సహవాసం గ్రూపు సభ్యుల చేత సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న జాన్ వెస్లీ అభినందనీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో మెడికల్ క్యాంపు

తాడేపల్లి,నవంబర్ 18,ప్రభాతవార్త : మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు.ముఖ్యంగా ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు.




కార్యక్రమానికి విజే డిగ్రీ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ప్రెగఢ రాజశేఖర్,ప్రిన్సిపాల్ నాదెళ్ళ శ్రీనివాసరావు,వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు,ఆప _ మాలజిస్ట్ గోలి పుష్కోకర్‌తో కూడిన వైద్యబృందం ,ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.గ్రామస్థులు మొత్తం 100కి పైగా ఉచిత కంటి పరీక్షలు చేయించుకోగా,వారికి అవసరమైన చికిత్స సూచించారు.కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యం అని ప్రోగ్రాం అధికారులు శిఖా శంకర్,గోచిపాత సురేష్‌బాబు తెలిపారు.ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహణలో భాగంగా విజయవంతంగా ఐ క్యాంప్‌ను నిర్వహించినందుకు ఆత్మకూరు గ్రామ పంచాయితీ సెక్రటరీ గాయత్రి అభినందనలు తెలిపారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ను పోస్కో సంస్థకు అమ్మేయాలనుకున్నప్పుడు
## జగన్ కు కార్మికుల కష్టసుఖాలు గుర్తురాలేదా? : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 18, ప్రభాతవార్త: కాలానుగుణంగా మారుతున్న అభివృద్ధి సాధ్యాసాధ్యాల గురించి తెలియని మందబుద్ధులే విశాఖ ఉక్కుపై ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారు. కష్టపడితేనే సంస్థలకైనా, వ్యక్తులకైనా మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పడం తప్పెలా అవుతుందో వారు సమాధానం చెప్పాలి. ఒక పబ్లిక్ సెక్టార్ సంస్థకు గతంలో దేశంలో ఏ



ప్రభుత్వం, ఏ నాయకుడు చేయని సాయం చంద్రబాబు చేశారనే నిజాన్ని గ్రహించాలి. అప్పుడు స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టి.. ఇప్పుడు నీతివాక్యాలా? అధికారంలో ఉన్నప్పుడు ఏకంగా స్టీల్ ప్లాంట్ ఆస్తులు, భూములు అమ్మకానికి పెట్టిన జగన్ కో నేడు నీతి వాక్యాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. మొత్తం ఉక్కు ఫ్యాక్టరీనే గంపగుత్తుగా రూ. 500 కోట్లకే పోస్కో సంస్థకు దారాధత్తం చేయాలని చూసిన వారు నేడు పోసుకోలు కబుర్లతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారనే నిజం ప్రజలకు తెలియంది కాదు. గత పాలకులు ఉక్కు ఫ్యాక్టరీని లేపేసి ఆ ప్రాంతంలో రాజధాని కడతామన్నప్పుడు విశాఖ ఉక్కుపరిరక్షకులు, కార్మిక పక్షపాతులు నోరేత్తలేదేమి? విశాఖ ఉక్కు పేరెత్తే అర్హత జగన్ కు వైసీపీకి లేదు. వాజ్ పేయ్ హాయాం నుంచి మోదీ పాలన వరకు విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు చంద్రబాబు ఎంతో కృషి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీనేతలు విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు కృషిచేశారు. ప్లాంట్ ను కాజేయాలని చూసిన జగన్ దుర్మార్గాన్ని పటాపంచలు చేస్తూ కేంద్రాన్ని ఒప్పించి, రాష్ట్రప్రభుత్వ రాయితీలతో కలిపి చంద్రబాబు రూ.14 వేల కోట్ల వరకు సాయం అందేలా చూశారు. అంతకుముందు వాజ్ పేయ్ ప్రధానిగా ఉన్నప్పుడే స్టీల్ ప్లాంట్ నష్టాల భర్తీకి రూ.1350 కోట్లు అందించింది చంద్రబాబు కాదా? మరోసారి రూ.1400 కోట్ల ప్యాకేజీ మంజూరు చేయించి ప్లాంట్ మనుగడను కాపాడింది ముమ్మాటికీ ముఖ్యమంత్రి చంద్రబాబే. ప్రభుత్వ సాయం, సహకార సద్వినియోగంతో సంస్థను వృద్ధి చేస్తేనే కార్మికులు, వారి కుటుంబాలకి ఉజ్వల భవిష్యత్ ఉంటుందనే అందరూ అంగీకరించాల్సిన వాస్తవం. ప్రభుత్వాలు, నాయకులు ప్లాంట్ మనుగడకోసం ఉదారంగా అందించే సాయాన్ని, కొందరు తమస్వార్థ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడం ఎంతవరకు సబబో విజ్ఞులైన ప్రతి ఒక్కరూ ఆలోచించాలి." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒకప్రకటనలో హితవుపలికారు.

## నాదెండ్ల,యడ్లపాడు మండలాల్లోని పాఠశాల్లో మౌలిక
## వసతుల కల్పనకు రూ.1.62 కోట్లు మంజూరు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 18, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంతో పాటు, నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ల్యాబ్ లు, ప్రహరీల నిర్మాణం, కంప్యూటర్ రూముల ఏర్పాటుకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసింది. మంత్రి లోకేశ్ గతంలో చేసిన విజ్ఞప్తిపై స్పందించి, కేంద్రప్రభుత్వ సహకారంతో చిలకలూరిపేట రూరల్, పట్టణ పరిథిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.2.10 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. దానికి కొనసాగింపుగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాఠశాలల అభివృద్ధికి కూడా అదనంగా నిధులు కేటాయించారు. చిలకలూరిపేట మండలంతో పాటు ఇతర మండలాల్లోని పాఠశాలలకు కూడా నిధులు కేటాయించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ ను ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడం జరిగింది. తన అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకున్న మంత్రి లోకేశ్ నాదెండ్ల, యడ్లపాడు మండలాల పరిధిలోని, మౌలిక వసతులు అవసరమైన కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు నేడు అదనంగా బిగ్స్ (బేసిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటీస్ ఇన్ గవర్నమెంట్ స్కూల్స్) కార్యక్రమంలో భాగంగా మరో రూ.1.62 కోట్లు మంజూరు చేయిస్తున్నట్టు తెలియచేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అడిగిన వెంటనే పాఠశాలల అభివృద్ధికి కేంద్ర సహకారానికి, రాష్ట్ర కేటాయింపులు జతచేసి నిధులు మంజూరు చేసినందుకు నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయుల తరుపున మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను." అని మాజీమంత్రి ప్రత్తిపాటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## మండలంలో 'పొలం పిలుస్తోంది'


చిలకలూరిపేట, నవంబర్ 18, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంలోని వేలూరు మరియు కుక్క పల్లి వారి పాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త పి.వి సత్య గోపాల్ గారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ శనగ రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని ముందుగా2.5గ్రా కార్బన్డిజం అనే శిలేంద్ర నాశినితో తర్వాత ట్రైకోడెర్మా విరిడితో వితన శుద్ధి చేసుకున్నట్లయితే వేరుకుళ్ళు మరియు ఎండు తెగులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చునన్నారు. మొక్క మొక్క మధ్య నాలుగు అంగుళాల దూరంతో విత్తుకున్నట్లయితే ఎగరానికి 30 నుంచి 35 కిలాల విత్తనం సరిపోతుందని, చివరి దుక్కిలో 18 కిలోల యూరియా 125 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్ ను వేసుకున్నట్లయితే మొక్కకు కావలసిన గంధకం కూడా అందుతుందని తెలియజేశారు. మొక్కజొన్న పంట లోని యాజమాన్య పద్ధతులను వివరిస్తూ లోతు దుక్కులు దుక్కుకున్నట్టయితే మంచి ఉపయోగకరంగా ఉంటుందని ఎకరానికి ఎనిమిది కిలోల విత్తనాన్ని 24 అంగుళాలు ఎనిమిది అంగుళాల దూరం తో విత్తు కోవాలన్నారు ఎకరానికి 100 కిలోల నైట్రోజన్ 35 కిలోల పొటాషియం అవసరం అవుతుందన్నారు.సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి శ్రీనివాస రావు గారు మాట్లాడుతూ రేపు అనగా 19/11/25వ తారీఖున్నా పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ రెండో విడత ప్రభుత్వం వారు విడుదల చేస్తున్నారని అర్హత ఉండి ఇంకా లబ్ధి పొందని రైతులు ఎవరైనా ఉన్నట్లయితే సంబంధిత పత్రాలతో రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించవలసిందిగా సూచించారు. అలాగే మండల వ్యవసాయ అధికారిన్ని. సరిత గారు జీవన ఎరువులు అయినా రైజోబియం, ఫ్లు,అజోస్పిరిల్లం, ట్రైకోడెర్మా విరిడి, యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరిస్తూ రైతుల చేత జీవన ఎరువులతో విత్తన శుద్ధి చేసుకునే పద్ధతిని దగ్గర ఉండి వారి చేత క్షేత్రస్థాయిలో చేయించారు.

## దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులను ఖండిద్దాం
## జనగణనలో కులగణన చేపట్టాలి

చిలకలూరిపేట, నవంబర్ 18, ప్రభాతవార్త: ప్రధాని మోదీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రక్షణ ప్రశ్నార్థకమైందని, అణగారిన వర్గాల హక్కులు హరించబడుతున్నాయని ప్రజాసంఘాలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు చెప్పారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులను ఖండిస్తూ, జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ మంగళవారం సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే వారిపై మతోన్మాదులు దాడులకు, హత్యలకు తెగబడుతున్నారని, గిరిజనుల పొట్టకొట్టేలా, అడవిబిడ్డల హక్కులను హరించేలా అడవులను, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు పాలకులు కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేవారు. ఈ విధానాలు సమాజానికి, దేశానికి అత్యంత ప్రమాదకరంగా పరిణమించాయన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి చేపట్టిన తదుపరి గత 11 ఏళ్ల కాలంలో దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలపై దాడులు మితిమీరిపోతున్నాయని ఆరోపించారు. దేశంలో మతోన్మాద పాలన సాగుతోందని, అణిచివేత, అంటరానితనం, కుల, మత వివక్షత, హింస పేట్రేగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అర్ఎస్ఎస్, సంఘపరివార్ కనుసన్నలలో భారత రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులు సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వానికి పాతర వేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 143 వెనుకబడిన కులాలు ఉన్నప్పటికీ బీసీలకు స్థానిక సంస్థలలో కేటాయించిన స్థానాలు తగ్గించడముతో వేలాది బీసీలు పదవులు కోల్పోయారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టి దాని ఆధారంగా స్థానాలు కేటాయించిందని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అదే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. రత రాజ్యాంగం, ప్రజాస్వామిక హక్కులను హరించే దుష్ట శక్తులను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, లౌకిక వ్యవస్థను కాపాడేందుకు మనమంతా నడుంకట్టాలిని కోరారు. కార్యక్రమానికి సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎం రాధాకృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల,సిపిఎం నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, తి.స్త్రీ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని,ఆర్పీఐ నాయకులు ముత్తయ్య,ముస్లిం యూనియన్ నాయకులు షేక్ బాజీ,గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీను నాయక్,తి.స్త్రీ ఏరియా కార్యదర్శి మల్లికార్జున్,పట్టణ కన్వీనర్ రాంబాబు నాయక్, వేలూరు గ్రామ సిపిఐ కార్యదర్శి ఏలికా శ్రీనివాసరావు,నాయకులునానా,నన్నే ,సౌటుపల్లి నాగేశ్వరరావు్న, కొండలరావు,తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

చిలకలూరిపేట, నవంబర్ 18, ప్రభాతవార్త: స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఐదోవ రోజైన మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు బోనం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ




పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనం గురించి విద్యార్థులకు వివరించారు. ప్రపంచ నాగరికత అచ్చుయంత్రం కనుగొన్నాక శరవేగంగా అభివృద్ధి చెందిందన్నారు. బాల్యం నుండే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జూనియర్ విద్యార్థులకు, సీమియర్లకు విడివిడిగా జనరల్ క్విజ్ పోటీ నిర్వహించారు. తొలుత గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి స్మరించారు. విద్యార్థులచే పుస్తక పఠన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పండరీపురం రోటరీ క్లబ్ పెద్దలు బి.చెంచుపున్నయ్య, అలా దాసునాయన, బిట్రా నాగేశ్వరావు, అలాంఘూర్ మోహన్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బొప్పూడి వెంకటేశ్వర్లు తో పాటు వివిధ పాఠశాలలనుండి వచ్చిన ఉపాధ్యాయిని ఉపాద్యాయులు, గ్రంథాలయాభివృద్ధి కమిటి కార్యదర్శి డా. దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి డి.వీర్రాజు, సిబ్బంది సరోజినీ, సలోమి, అచ్చమ్మ, సాంబిరెడ్డి, తదితరులున్నారు.

## పగ... ప్రతీకారాలే పల్నాటి పోరు! రక్తసిక్తమైన యుద్ధభూమి
## మహాభారతాన్ని పోలిన పల్నాటి యుద్ధం
## నేటి నుండే పల్నాటి వీరారాధనోత్సవాలు

కారంపూడి, నవంబరు 18 ప్రభాతవార్త: పదవీ వ్యామోహం దాయాదుల వైరం, శైవ వైష్ణవ సంఘర్షణల నేపథ్యంలో క్రీస్తుశకం 11వ శతాబ్ధంలో జరిగిన పల్నాటి చరిత్రకు ఓ విశిష్టత ఉంది. గతంలో ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఎందరో రాజులు గతించారు. ఎన్నో రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కానీ కారంపూడిలో జరిగిన పల్నాటి యుద్ధం మాత్రం నేటికీ ప్రజల



హృదయాంతరాల్లో ప్రతి ధ్వనిస్తూనే ఉంది. ఆనాటి యుద్ధంలో అసువులు బాసిన వీరనాయకులు గుండె చప్పులు ఇప్పటికీ వినబడుతూనే ఉన్నాయి. కారంపూడిలో జరిగే వీరారాధనోత్సవాల్లో కత్తులు నర్తిస్తాయి. పల్నాటి కథలు వీరాచారవంతులు ఆలపిస్తారు. ఇక్కడ ఏ రాయిని చూసినా పల్నాటి పౌరుషం కళ్లకు సాక్షాత్కరిస్తుంది.

దాదాపు 900 సంవత్సరాలకు పూర్వం నాయకురాలు నాగమ్మకు బ్రహ్మనాయుని వర్గాలకు మధ్య జరిగిన భీకర పోరాటపు గుర్తులు నేటికీ చెరిగిపోలేదు. నాటి రాజులు వాడిన కత్తులు వారి గుర్తుగా నేటికీ వీరనాయకుల శిలలు కారంపూడిలోని వీర్లదేవాలయంలో పల్నాటి చరిత్రకు సాక్ష్యాధారాలుగా, పర్యటకులను అలరిస్తున్నాయి. పల్నాటి రాజ్యాన్ని అనుగురాజు పరిపాలిస్తున్న రోజుల్లో ఒకసారి









కారడవిలో నాగమ్మ ఆతిథ్యాన్ని స్వీకరించి సంతృప్తి చెందిన అలుగురాజు నాగమ్మకు కొద్దికాలపు రాజ్యాధికారాన్ని వరంగా ఇవ్వడంతో పల్నాటి చరిత్రకు అంకురార్పణ జరిగింది. అనుగురాజు గతించి బ్రహ్మానాయుడు మంత్రిగా నలగామరాజు వద్ద పరిపాలనా బాధ్యతలు స్వీకరించిన సమయంలో తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకొమ్మని నాగమ్మ కోరడంతో విధిలేని పరిస్థితుల్లో నలగాముడు నాగమ్మకు రాజ్యాధికారం అప్పగించాడు. దీంతో దాయాదుల వైరానికి తెర తీస్తుంది. నాగమ్మ తనకు ప్రాప్తించిన విశేషాధికారంతో బ్రహ్మానాయుడిని దోషిగా చిత్రీకరించి, మలిదేవరాజును కారాగారాలలో వేయడంతో బ్రహ్మానాయుడు వారిని విడిపించి మాచర్ల రాజ్యాన్ని ఏర్పాటు చేసి మలిదేవాదుల పేరుతో బ్రహ్మానాయుడు సుభిక్షంగా పరిపాలన చేస్తాడు. దీంతో కన్నుకుట్టిన నాగమ్మ మాచర్ల రాజ్యాన్ని కైవసం చేసుకోవాలని కుయుక్తులు పన్నుతుంది. నాగమ్మ చెప్పుడు మాటలు విని ఆమె చేతిలో నలగామరాజు కీలుబొమ్మలా అవుతాడు. కుతంత్రంతో బ్రహ్మానాయుడిని మలిదేవరాజును అడవులకు పంపిస్తుంది. నాగమ్మ నిర్ణీత కాలం పిమ్మట తమ రాజ్యాన్ని అప్పగించమని బ్రహ్మన్న చేసిన విజ్ఞప్తిని మన్నించక దూతగా వచ్చిన అలరాజుని చంపడంతో ఆగ్రహోద్రుడైన బ్రహ్మానాయుడు యుద్ధం అనివార్యమని తరలి, మలిదేవరాజు తరఫున యుద్ధం చేస్తాడు. యుద్ధంలో చావు తప్పి కన్ను లొట్టబోయి చేతికి దొరికిన నాయకురాలు నాగమ్మకు స్త్రీ అనే కారణంగా ప్రాణభిక్ష పెట్టడంతో నాగమ్మ పారిపోతుంది. యోధానుయోధులైన రాజులందరూ మరణిస్తారు. కన్నమదాసు బాలచంద్రుడు, మలిదేవరాజు యుద్ధంలో వీరమరణం చెందుతారు. దీంతో విరక్తి చెందిన బ్రహ్మానాయుడు రాజ్యాన్ని నలగామరాజుకు అప్పగించి గుత్తికొండ బిలంలోకి తపస్సుకై వెళ్లడంతో పల్నాటి యుద్ధం ముగుస్తుంది. 66 మంది మృతవీరుల ఆత్మశాంతి కోసం యుద్ధ విశేషాలను పల్నాటి వీరారాధనోత్సవాల పేరుతో అయిదు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వీరాచార వంతులు, కన్నమనీయులు, పిన్నమనీయులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. రాచగావు, రాయబారం, మందపోరు, కోడిపోరు, కల్లిపాడు పేర్లతో జరిగే ఉత్సవాలకు విశేషాదరణ లభిస్తుంది.

**19వ తేదీన రాచగావు**

రాచగావుకు మేకపోతు నైవేద్యం సమర్పించడంతో ఉత్సవాల్లో మొదటి రోజైన రాచగావు ప్రారంభమవుతుంది. మేకపోతు మెడకు గావు పట్టడంతో రాచగావు ప్రారంభమవుతుందని కథాగానాన్ని వీర్ల దేవాలయ ప్రాంగణంలో ఆలపిస్తారు.

**20న రాయబారం:** అరణ్యావాసం అనంతరం తమ మాచర్ల రాజ్యాన్ని తమకు అప్పగించమని బ్రహ్మన్న మలిదేవరాజులు, నాగమ్మ నలగామరాజుల వద్దకు అలరాజును రాయబారిగా పంపడమే రాయబార ఘట్టం.


**21న మందపోరు:** బ్రహ్మన్న మలిదేవాదులు అరణ్యావాసం చేస్తున్న సమయంలో వారి గో సంపదను నాగమ్మ వర్గీయులు తరలించుకుపోవడమే మందపోరు. ఈ పోరులో కన్నమదాసు విశేష ధైర్యసాహసాలు ప్రదర్శించి గోసంపదను రక్షిస్తాడు. నాగమ్మ వర్గీయులను హతమారుస్తారు.

**22న కోడిపోరు:** పాడిపంటలతో తులతూగుతున్న బ్రహ్మానాయుడిని మాచర్ల రాజ్యాన్ని కైవసం చేసుకునేందుకు నాగమ్మ జరిపిన కుట్రయే కోడిపోరు. ఈ పందెంలో మాయ చేసి గెలిచిన నాగమ్మ బ్రహ్మన్న వర్గాన్ని మందాది అడవులకు పంపిస్తుంది. పాలువాయి గేటు దగ్గర కోడేరు గుట్టల్లో ఈ పందెం జరుగుతుంది.

**23న కల్లిపాడు:** కల్లిపాడు ఉదయాన్నే పూజారులు లంకన్నను ప్రాణం లేని వ్యక్తిగా ఒక విద్యావంతున్ని తయారు చేసి ఓ చోట పండుకోబెట్టగా పీఠాధిపతి వచ్చి లంకన్నకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తాడు. కొణతములను అలంకరణ చేసి గంగధారి మడుగులో స్నానం చేయించి శంకుతీర్థ మండపంలో పీఠాధిపతి వద్దకు వచ్చి తీర్థం తీసుకొని కల్లితోరణం ద్వారా యుద్ధభూమికి వెళ్లి పోతురాజు గుట్టపై ఉన్న కల్లితంగెడ మండలపై ఒరగడంతో పల్నాటి వీరారాధనోత్సవాలు ముగుస్తాయి.


## కారంపూడిలో రెండో దఫా అన్నదాత సుఖీభవ

కారంపూడి, నవంబరు 18 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ఎసెంటర్ వద్ద కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అందించే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన నగదు చెక్కుల పంపిణీ బుధవారం చేయనున్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా



ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని చెక్కులను అందజేయనున్నారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా 38 వేల 923 మంది రైతులకు రూ.26.08 కోట్ల నగదును రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది.

## వీరారాధనోత్సవాల పనులను పరిశీలించిన ఆర్డీవో



కారంపూడి, నవంబరు 18 ప్రభాతవార్త: వీరారాధనోత్సవాలకు ముస్తాబవుతున్న కారంపూడిని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, ఎమ్మార్వో వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డిలు మంగళవారం పరిశీలించారు. నాగులేరులో నిల్వ ఉన్న నీటిలో స్నానాలు ఆచరిస్తే వీరాచారవంతులు, భక్తులు అనారోగ్యాల పాలవుతారని వెంటనే మురుగునీరు బయటకు పోయి కొత్తనీరు నిల్వ ఉండే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్ఎస్పీ అధికారులకు, మండల అధికారులకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. స్పందించిన ఎన్ఎస్పీ అధికారులు కుడి కాలువ వద్ద పైపుల ద్వారా నీరు నాగులేటికి వచ్చే విధంగా పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, పంచాయతీ అధికారులు, రెవెన్యూ, మండలాభివృద్ధి అధికారులు, ఆరోగ్య, విద్యుత్తు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దేశభక్తి గీతాల పోటీలు

తాడేపల్లి,నవంబర్ 18,ప్రభాతవార్త : స్థానిక శాఖాగ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు సందర్భంగా జూనియర్స్ విభాగంలో దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు.కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల రవీంద్ర భారతి మరియు శ్రీభగవాన్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఆర్.శ్రీలత,డి.సునీత లు విచ్చేశారని గ్రంధాలయ అధికారి షేక్ నాగూర్ భాష తెలిపారు.



19-11Pg5 gnt 9_19-11Pg5 gnt.qxd 19/Nov/25 1:05 AM Page 1





# బంగ్లాలో రేగిన హింస

## పలు ప్రాంతాల్లో పేలుళ్లు, వాహనాల ధ్వంసం

## ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

## బంద్‌కు అవామీలీగ్ పిలుపు

**ఢాకా, నవంబరు 18:** బంగ్లాదేశ్ మరోమారు హింసాకాండతో రగిలిపోతోంది. మాజీ ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ మరణశిక్ష విధించడంతో బంగ్లాదేశ్‌లో మళ్లీ హింసాకాండ చెలరేగింది. ఐసిటి తీర్పును నిరసిస్తూ బంగ్లాదేశ్ బంద్‌కు హసీనా పార్టీ అవామీ లీగ్ పిలుపునిచ్చింది. సోమవారం మొదలైన హింసాత్మక ఘర్షణలు మంగళవారం కూడా కొనసాగాయి. విద్యార్థి ఉద్యమాలతో సంబంధమున్న వ్యక్తులు కొందరు బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటికి నిప్పుపెట్టడానికి ప్రయత్నించగా, హసీనా మద్దతుదారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఘర్షణ చెలరేగింది. దాదాపు ఐదారు జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలకు నిప్పుపెట్టారు. కార్యాలయాల్లోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. రెండు విద్యాసంస్థల్లోకి ఆందోళనకారులు చొరబడి బీభత్సం సృష్టించారు. అనేక చోట్ల బాంబులు పేలాయి. కోట్లిపారాలో జరిగిన బాంబు పేలుడులో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. ఇద్దరు మృతి చెందారు. పలువురు ఆందోళనకారులు కూడా గాయపడినట్లు అధికారులు తెలిపారు. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. లాఠీచార్జ్ చేశారు. అనేక సౌండ్ గ్రనేడ్లను ఉపయోగించారని డిప్యూటీ పోలీస్ కమిషనర్ మసూద్ ఆలం తెలిపారు. అవామీ లీగ్ బంద్ పిలుపు నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రజారవాణ నిలిచిపోయింది. వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు. సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐసిటి తీర్పు పక్షపాతంతో కూడినది, రాజకీయంగా ప్రేరేపించబడిన ప్రతీకారం అని అవామీ లీగ్ పార్టీ అగ్రనేత జహంగీర్ కబీర్ నానక్ అభివర్ణించారు. బంగ్లాదేశ్ ప్రజలు ఈ నిర్ణయాన్ని ఎప్పటికీ అంగీకరించరని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. ఐసిటి తీర్పు నేపథ్యంలో యూనస్ అవామీ లీగ్‌ను నిషేధించడం గమనార్హం.

# షేక్ హసీనాను భారత్ అప్పగిస్తుందా?

## - బంగ్లా వినతిపై ఇంకా స్పందించని వైనం
## - ప్రస్తుతం భారత్ ఆశ్రయంలో ఉన్న హసీనా



**ఢాకా, నవంబరు 18:** బంగ్లాదేశ్‌లో మరణశిక్ష పడిన షేక్ హసీనాను ఆ దేశానికి అప్పగిస్తారా లేదా అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. షేక్ హసీనాను దోషిగా తేల్చిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆమెకు మరణశిక్ష విధించింది. దీంతో ఆమెను తక్షణమే తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ భారత్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలోనే ఆమె మరణశిక్షపై స్పందించిన భారత్ ఆమెను అప్పగించాలన్న విజ్ఞప్తిపై మాత్రం ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు ఆ దేశ కోర్టు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతుండగా షేక్ హసీనాకు ఆ దేశ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించినందున ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌ను కోరింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు షేక్ హసీనా అప్పగింత అంశం భారత్‌బంగ్లాదేశ్ దౌత్య సంబంధాల్లో కీలక మలుపుగా మారింది. ప్రస్తుతం భారత్‌లో ఉంటున్న హసీనాను వెంటనే తమకు అప్పగించాలని ఢాకాలోని తాత్కాలిక ప్రభుత్వం న్యూఢిల్లీని కోరింది. 2024 జూలైలో బంగ్లాదేశ్‌లో చెలరేగిన విద్యార్థుల తిరుగుబాటును అణచివేసేందుకు అప్పటి ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినందుకు గాను హెలికాప్టర్లు, డ్రోన్‌లు, మారణాయుధాలను ఉపయోగించి విద్యార్థి నిరసనకారులను చంపడానికి ప్రయత్నించారనే ఆరోపణలపై షేక్ హసీనాకు ట్రైబ్యునల్ మరణశిక్ష విధించింది. భారత్‌బంగ్లాదేశ్ మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం శిక్ష పడిన షేక్ హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లను అప్పగించడం న్యూఢిల్లీకి తప్పనిసరి బాధ్యత అని పేర్కొంది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన వీరిద్దరికీ ఆశ్రయం కల్పించడం స్నేహపూర్వకం కాని చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. షేక్ హసీనాకు విధించిన మరణశిక్ష తీర్పుపై స్పందించిన భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తాము తీర్పును గమనించామని తెలిపింది. అయినప్పటికీ షేక్ హసీనాను అప్పగించాలనే ఢాకా డిమాండ్‌పై మాత్రం స్పందించలేదు. పొరుగు దేశంగా బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాల కోసం శాంతి, ప్రజాస్వామ్యం, స్థిరత్వం ఉండేలా చూస్తామని తెలిపింది. ఈ లక్ష్యాలను సాధించడానికి తాము నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేసింది. ఒప్పందం ప్రకారం అభ్యర్థనలను సాధారణంగా గౌరవించినప్పటికీ షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు భారత్ అప్పగించే అవకాశం చాలా తక్కువగా ఉందని తెలుస్తోంది. భారత చట్టాలు, ద్వైపాక్షిక ఒప్పందం రెండూ మన దేశానికి చాలా వెసులుబాటును కల్పిస్తున్నాయి. ఒప్పందంలోని ఆర్టికల్ 8 ప్రకారం నిందితుడిపై ఉన్న అభియోగాలు అన్యాయమైనవి లేదా అణచివేతకు గురిచేసేవి అని నిరూపించగలిగితే అప్పగింత అభ్యర్థనను తిరస్కరించే అవకాశం ఉంటుంది. షేక్ హసీనాపై ఉన్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవి కావచ్చనే కారణంతో భారత్ ఈ విజ్ఞప్తిని తిరస్కరించే అవకాశం ఉంది. ఆర్టికల్ 6 ప్రకారం హత్య, ఉగ్రవాదం వంటి తీవ్రమైన నేరాలు మినహా రాజకీయ స్వభావం ఉన్న నేరాలకు నిందితులను అప్పగించడాన్ని తిరస్కరించవచ్చు. షేక్ హసీనాపై ఉన్న కొన్ని ఆరోపణలు దీని పరిధిలోకి రాకపోవచ్చని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

పరస్పర అప్పగింత ఒప్పందం 1962లోని సెక్షన్ 29 భారత ప్రభుత్వానికి రాజకీయ ప్రేరేపిత అభ్యర్థనలను న్యాయ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న అభ్యర్థనలను తిరస్కరించే అధికారాన్ని ఇస్తుంది.

# ఇవిఎంలలో పోలింగ్‌కు ముందే 25 వేల ఓట్లు

**పాట్నా,నవంబరు 18:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే ఈవీఎంలలో 25 వేల ఓట్ల చొప్పున ఓట్లు పడ్డాయన్న ఆర్జేడీ సీనియర్ నేత జగదానంద సింగ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఆయన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది. బీహార్ తీర్పు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించ లేదని, ఈవీఎంలలో అవకతవకలు జరిగినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకపోలేదని ఆర్జేడీ సోమవారం పేర్కొంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ప్రతి ఈవీఎంలలో 25 వేల ఓట్లు పడ్డాయని, అయినప్పటికీ తాము 25 సీట్లు సాధించామని జగదానంద సింగ్ అన్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం, ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో అనుసరించిన నిబంధనల ప్రకారం ఇవి తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పోలింగ్‌కు ముందు 25 వేల ఓట్లు ఉండటం అనేది అసాధ్యమని తెలిపింది. ఈవీఎంలకు బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర కనెక్షన్లు ఏవీ ఉండవని గుర్తు చేసింది. బయటి నుంచి ఈవీఎంను యాక్సెస్ చేయడం లేదా డిజిటల్ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని తెలిపింది. పోలింగ్‌కు ముందు ఈవీఎంలలో ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు కనిపిస్తాయని తెలిపింది. పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపింది. ఆ తర్వాత మాక్ పోల్ ఓట్లను కూడా తొలగిస్తారని వెల్లడించింది. ఈవీఎంల పంపిణీ కూడా ర్యాండమ్‌గా ఉంటుందని, కాబట్టి ఏ ఓటింగ్ యంత్రం ఏ పోలింగ్ కేంద్రానికి వెళుతుందో ఎవరూ చెప్పలేరని స్పష్టం చేసింది. పోలింగ్ ప్రక్రియ ప్రతి దశలో పార్టీల ఏజెంట్లు ఉంటారని తెలిపింది. రెండు విడతల్లోనూ ఆర్జేడీ ఒక్కసారి కూడా అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల సంఘం తెలిపింది.

**స్పందించిన ఇసి**

## డ్రగ్స్ మాఫియా కట్టడికి

# సైనిక చర్యలు చేపట్టాల్సిందే



**వెనిజులా, మెక్సికో, కరీబియన్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక**

**వాషింగ్టన్, నవంబరు 18:** వెనిజులాతోపాటు మెక్సికో ఇతర సమీపదేశాలు కేంద్రంగా పెచ్చుమీరిన డ్రగ్ దందాలను కట్టడిచేసేందుకు అవసరమైతే సైనిక చర్యలుసైతం ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ హెచ్చరించారు. ఈ డ్రగ్స్ మాఫియాలవల్లనే నేరాలు, ఘోరాలు పెరిగిపోతున్నాయని ఆయన అన్నారు. అలాగే వెనిజులా కేంద్రంగా కూడా డ్రగ్స్ మాఫియాలు రెచ్చిపోతున్నాయని, అవసరమైతే సైనిక చర్యను ఎంతమాత్రం సందేహించబోమని ఆయన అన్నారు. ఓవల్ ఆఫీసులో మాట్లాడిన ట్రంప్ వెనిజులా, మెక్సికో దేశాలతోపాటు ఇతర కరీబియన్ దేశాల్లో అమెరికా సైనికదళాలు మోహరింపు, వైమానిక విన్యాసాలకు కారణం కేవలం డ్రగ్ అక్రమ రవాణాయేనని ఆయన అన్నారు. డ్రగ్స్‌ను కట్టడిచేసేందుకు మెక్సికోపైనా సైనిక చర్యకు వెనుకాడేది లేదనానరు. అయితే వెనిజులా అధ్యక్షుడు నికొలాస్‌మదురోతో చర్చలు జరిపేందుకు తాను ఏక్షణం అయినా సిద్ధమేనని స్పష్టంచేసారు. అయితే అమెరికాతో సహా మరెవ్వరితోనూ కూడా తాను ముఖాముఖి చర్చలు జరిపేదిలేదని టివిషోలో స్పష్టం చేసారు. అమెరికాలో ఉన్న ఏ ఒక్కరితోనూ తాను చర్చలుజరిపేందుకు ఇష్టంలేదని అన్నారు. అమెరికా తమ ప్రాంతంలో మిలిటరీని మోహరిస్తోందని, ఇపుడు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు, అనేక యుద్ధనౌకలు, యుద్ధ విమానాలుఅనేకం వచ్చాయని ఆయన ఆరోపించారు. అయితే ట్రంప్ మాత్రం వెనిజులా అధ్యక్షుడు ఉగ్రవాద డ్రగ్ సిండికేట్‌ను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అయితే నికొలస్ కుటుంబం తీవ్రంగా వనయతిరేకించింది. సెప్టెంబరునుంచి అమెరికా దళాలు అంతర్జాతీయ జలాల్లో వైమానిక దాడులునిర్వహించింది. ఈదాడుల్లో 83 మంది చనిపోయారు. వీరంతా డ్రగ్ అక్రమరవాణా చేస్తున్నట్లు అమెరికా ఆరోపిస్తోంది. అలాగే ట్రినిడాడ్‌లో కూడా అమెరికా నావికాదళాలు మిలిటరీ కవాతులు నిర్వహించాయి. ట్రినిడాడ్‌టొబాగోలో నెలలో రెండుసార్లు కవాతులు చేయడంపై ఆదేశం మండిపడుతోంది.

# ట్రంప్ గాజా శాంతి ప్రణాళికకు భద్రతా మండలి ఆమోదం



**న్యూయార్క్, నవంబరు 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదం తెలిపింది. రెండేళ్లుగా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి ముగింపు పలికేందుకు 20 సూత్రాల ప్రణాళికను డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ బలగాల నియోగం, యుద్ధ విరామం, పునర్నిర్మాణం, పాలనకు మార్గదర్శకాలు ఇందులో ఉన్నాయి. ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్-పాలస్తీనా తీవ్రవాద గ్రూపు హమాస్ గత నెల 10న సంతకాలు చేశాయి. ఐక్యరాజ్య సమితిలో సోమవారం జరిగిన ఓటింగ్‌లో అమెరికా, యుకె, ఫ్రాన్స్, సోమాలియా సహా మొత్తం 13 దేశాలు గాజా శాంతి ప్రణాళికకు మద్దతు పలికాయి. వీటో అధికారం ఉన్న రష్యా, చైనా ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గత నెలలో యుద్ధ విరామం, బందీల విడుదల ఒప్పందంతో ప్రణాళిక మొదటి దశను అమలు చేసిన సంగతి తెలిసిందే. బోర్డ్ ఆఫ్ పీస్ అనే తాత్కాలిక సంస్థను ఏర్పాటు చేసి.. గాజా పునర్నిర్మాణాన్ని పర్యవేక్షించాలన్నది గాజా ప్లాన్ ఉద్దేశం. కాగా, ఈ తీర్మానాన్ని హమాస్ ఖండించింది. ఇది గాజా ప్రజల స్వతంత్రతను హరించడమేనని మండిపడింది. పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్యం, స్వయంపాలన హక్కులను ఈ తీర్మానం గౌరవించడం లేదని, ఇక్కడి ప్రజల రాజకీయ ఆకాంక్షలను పక్కనపెట్టి తాత్కాలిక పాలనా సంస్థ పేరుతో ఇతర దేశాల నిర్ణయాలను రుద్దే ప్రయత్నంగా కనిపిస్తున్నదని విమర్శించింది. గాజా భవిష్యత్తును గాజా ప్రజలే నిర్ణయించాలని, విదేశీ బలగాలు, పాలనా సంస్థలు తమ అభిప్రాయాలను రుద్దకూడదని పేర్కొంది. రెండేళ్ల క్రితం ఇజ్రాయెల్‌పై హమాస్ అనూహ్య దాడితో యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడికి దిగింది. దాదాపు 1,200 మందిని హతమార్చి, 250 మందికిపైగా బందీలుగా చేసుకుంది. హమాస్ దాడికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో 67,000 మందికిపైగా పాలస్తీనా పౌరులు మరణించారు. ఇజ్రాయెల్ దాడుల్లో వేలాది ఇళ్లు నేలమట్టం కాగా లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులై టెంట్లలో తలదాచుకుని జీవిస్తున్నారు.

# నా తల్లిదండ్రుల పరిస్థితిపై దర్యాప్తు చేయండి

## కేంద్రాన్ని కోరిన లాలూ ప్రసాద్ పెద్ద కుమారుడు తేజప్రతాప్ యాదవ్



**పాట్నా, నవంబర్ 18:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ కుటుంబంలో చీలికలు ఏర్పడిన విషయం తెలిసిందే ఈ నేపథ్యంలో లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తన కుటుంబ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. తేజస్వి యాదవ్ సహాయకులు తమ కుటుంబాన్ని, పార్టీని ముక్కలు చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి ద్రోహుల వల్ల తమ తల్లిదండ్రులు కూడా మానసిక వేధింపులకు గురవుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయంపై దర్యాప్తుకు ఆదేశించాలని ప్రధాని నరేంద్ర మోడీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖస్తుతి చేసేవారి కుట్రపూరిత రాజకీయాల వల్ల ఆర్జేడీని బలమైన పార్టీగా మార్చడానికి ఎన్నోఏళ్లు కష్టపడిన వారిని విస్మరిస్తున్నారు. దురాశ, అహంకారంతో విర్రవీగుతున్న తేజస్వీ సహాయకులు నా తల్లిదండ్రులు లాలూప్రసాద్, రబ్రీదేవిలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. నా తండ్రి ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారు ఒత్తిడిని తట్టుకోలేరు. ఈ విషయంపై దర్యాప్తుకు ఆదేశించాలని ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్ర మంత్రి అమిత్ షా, బీహార్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను అని తేజ్‌ప్రతాప్ పేర్కొన్నారు. తాను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నానని, కుటుంబంతోనూ సంబంధాలను తెంచుకుంటున్నానని లాలూప్రసాద్‌కుమార్తె రోహిణి ఆచార్య ప్రకటించిన విషయం తెలిసిందే. ఆర్జేడీ ఎంపి సంజయ్‌యాదవ్, తేజస్వి మిత్రుడు రమీజ్‌ఖాన్ కారణంగానే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. అనంతరం లాలూ మరో ముగ్గురు కుమార్తెలు కూడా పాట్నాలోని ఆయన ఇంటి నుంచి ఢిల్లీకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో తన కుటుంబంలో జరుగుతున్న గొడవలకు తేజస్వీ సహాయకులే కారణమని తేజ్ ప్రతాప్ యాదవ్ ఆరోపిస్తున్నారు. కాగా ఈ విషయంపై లాలూప్రసాద్ స్పందిస్తూ తమ కుటుంబంలోని అంతర్గత విషయాలను తామే పరిష్కరించుకుంటామని వ్యాఖ్యానించారు.

## సంక్షిప్తంగా..

### ఎన్ఐఎ కస్టడీలో 'ఎర్రకోట' నిందితుడు

**న్యూఢిల్లీ, నవంబరు 18:** ఢిల్లీ లాల్‌ఖిలా బాంబు పేలుడులో పాల్గొన్న ఆత్మాహుతి బాంబు ఉమర్‌నబీ సన్నిహితుడు జసీర్ బిలాల్ వానికి ఢిల్లీకోర్టు పదిరోజులు ఎన్ఐఎ కస్టడీకి అనుమతించింది. 15 మంది మృతిచెందిన ఢిల్లీ పేలుడు కేసులో ఉమర్‌నబీకి అత్యంత సన్నిహితంగా బిలాల్‌వాని ఉన్నట్లు ఎన్ఐఎ గుర్తించి అదుపులోకి తీసుకుంది. ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి అంజుబజాజ్ చందనా ఎన్ఐఎ అభ్యర్థనను స్వీకరించింది. నిందితుడిని కస్టడీ విచారణచేసుకోవచ్చని ఆమోదించారు. ఈ విచారణ మొత్తం ఇన్‌కెమేరా వ్యవస్థలో జరిగింది. మీడియాను కూడా అనుమతించలేదు.



పోలీస్,ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను కోర్టు ఆవరణలో మోహరించారు. ఎలాంటి దాడులు జరిగినా ఎదుర్కొనేందుకు వీలుగా అదనపు దళాలు అక్కడ సిద్ధంగా ఉన్నాయి. జసీర్ ఉమర్‌నబీకి సాంకేతిక సహకారం అందించినట్లు విచారణలో తేలింది.

### బస్సుపై విరిగిపడిన కొండచరియలు, వియత్నాంలో ఆరుగురి మృతి

**హనోయ్, నవంబరు 18:** వియత్నాం ఆర్థిక రాజధాని హోచిమిన్‌లో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు పర్వత మార్గంలో ప్రయాణిస్తున్న బస్సుపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు మృతి చెందినట్లు స్థానిక మీడియా పేర్కొంది. మరో 19 మంది గాయపడ్డారు. హోచిమిన్ సిటీ నుంచి 32 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు తీరప్రాంత నగరమైన న్హాట్రంగాకు వెళ్తుండగా ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ హైల్యాండ్స్‌లోని ఖాహ్ లె పాస్ గుండా పర్వత మార్గంలో ప్రయాణిస్తుండగా కొండచరియలు విరిగిపడి



బస్సు ముందు భాగాన్ని ఢీకొట్టాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

# ఐదు కోర్టు కాంప్లెక్స్‌లు, విద్యాసంస్థలకు బాంబు బెదరింపులు!

**న్యూఢిల్లీ, నవంబరు 18:** ఢిల్లీలో ఐదు కోర్టు కాంప్లెక్స్‌లకు బాంబు బెదింపు ఇమెయిల్స్ వచ్చాయి. దీనితో అన్ని జిల్లాకోర్టుల్లోను బందోబస్తును పెంచారు. అదనపు దళాలను నియమించారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌ప్రస్తుతం అన్ని కోర్టులను తనిఖీలుచేస్తోంది. ముందుగా సాకేత్‌కోర్టు ఆవరణలో తనిఖీలుచేపట్టింది. మధ్యాహ్నం వరకూ ఈ కోర్టులో విచారణలు నిలిపివేసారు. అంతేకాకుండా ఈ కోర్టు ఆవరణలన్నింటినీ హైరిస్క్ ప్రాంతాలుగా ప్రకటించారు. అదనపు బలగాలను తక్షణహే అక్కడకు పంపించారు. జైషే మహ్మద్ పేరిట ఐదు జిల్లా కోర్టులు, పాటియాలా కోర్టు, సాకేత్ కోర్టు, రోహిణి కోర్టు, ద్వారక కోర్టు వీటన్నింటిని బాంబులతో పేల్చివేస్తామని ఈమెయిల్ పంపించారని పోలీసులు చెప్పారు. ఉదయం 11 గంటలకు బాంబులతో పేల్చేస్తామని తమకు వార్నింగ్ వచ్చిందని ఒక న్యాయవాది చెప్పారు. అలాగే లాయర్స్ ఛాంబర్ బ్లాక్‌నుపేల్చివేస్తామని చెప్పడంతో వెంటనే ఖాళీచేయించామన్నారు. జైషే మహ్మద్‌పేరిట ఈ మెయిల్ వచ్చినట్లు నిర్ధారించారు. న్యాయాధికారులు, బార్ అసోసియేషన్‌లకు కూడా ఈ సమాచారం వచ్చింది. తక్షణమే ఆ ప్రాంతాలను ఖాళీ చేయించామని బార్ అసోసియేషన్ తెలిపింది. అలాగే సిఆర్‌పిఎఫ్ స్కూళ్లకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. ద్వారకా, ప్రశాంత్ విహార్‌లలో ఉన్న స్కూళ్లను బాంబులతో పేల్చేస్తామన్నారు.

# రేపు సిఎంగా నితీశ్ ప్రమాణం

### - ప్రధాని మోడీ, అమిత్‌షా, కేంద్ర మంత్రులురాక - ఎన్‌డిఎ పాలిత సిఎంలకు ఆహ్వానం
### - ప్రతిపక్ష నేతగా ఉండలేను: తేజస్వి - ఓటమికి నాదే బాధ్యత: ప్రశాంత్ కిశోర్



**పాట్నా, నవంబరు 18:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈ నెల 20వ తేదీ గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. సిఎంగా నితీశ్ బాధ్యతలు చేపట్టడం ఇది పదోసారి. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి పాట్నాలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్‌తోపాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎన్‌డిఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించారు. ఇటు మంత్రివర్గ కూర్పుపై ఎన్‌డిఏ నేతలతో సిఎం నితీశ్‌కుమార్ సమాలోచనలు జరుపుతున్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి చొప్పున బిజెపికి 15 లేదా 16, జెడియుకు 14, ఎల్‌జెపికి 3, హెచ్‌ఏఎం 1, ఆర్‌ఎల్‌ఎంకు 1 మంత్రి పదవి దక్కనున్నట్లు సమాచారం. జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝూ మీడియాతో మాట్లాడుతూ.. "నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని బీహార్ ప్రజలు ఇటీవల ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఆశీర్వదించారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి కృషి చేస్తాం. గురువారం నితీశ్ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం కొలువుదీరనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రధాని మోడీ, బిజెపి సీనియర్ నాయకులు, కేంద్ర మంత్రులు హాజరవుతున్నారు" అని తెలిపారు. నితీశ్‌తోపాటు ఎంత మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయబోతున్నారని మాత్రం ఖచ్చితంగా చెప్పలేనని సంజయ్ కుమార్ ఝూ తెలిపారు. ఎన్‌డిఏ కూటమిలోని అన్ని పార్టీలకు కేబినెట్‌లో ప్రాతినిధ్యం ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు నేడు జరగనున్న బిజెపి లెజిస్లేటివ్ పార్టీ నాయకుడి ఎన్నిక కోసం కాషాయ పార్టీ పార్లమెంటరీ బోర్డు కేంద్ర పరిశీలకులను నియమించింది. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అర్జున్ సఇంగ్, ఉత్తర్‌ప్రదేశ్ డిప్యూటీ సిఎం కేశవ్ ప్రసాద్ మౌర్యలను నియమించింది. అటు కాంగ్రెస్ పార్టీ 43 మంది నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇటీవల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారని, అలాగే పార్టీ నిబంధనలు అతిక్రమించారని తాఖీదులిచ్చింది. ఆర్‌జెడి శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన తేజస్వి యాదవ్, ప్రతిపక్ష నేతగా కొనసాగలేనని పార్టీ అధిష్టానానికి తెలియ జేశారు. విపక్ష నేతగా మరో సీనియర్ నాయకుడిని ఎన్నుకోవాలి, ఏకాభిప్రాయంతో నియమించాలని లాలూప్రసాద్‌కు స్పష్టంగా చేసారు.

## ఒడిశా ప్రముఖ గాయకుడు హుమేన్‌సాగర్ కన్నుమూత

**భువనేశ్వర్, నవంబరు 18:** ఒడియాలో ప్రముఖ గాయ కుడు హుమేన్‌సాగర్ 35వ ఏట అస్వస్థతతో కన్ను మూసారు. స్థానిక ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్న సాగర్ బహుళ అవయవాలు విఫలం చెందడంతో అత్య వసర వార్డులోనే చికిత్స పొందుతూ చనిపోయినట్లు ఎయిమ్స్ వైద్యులు శ్రీకాంత్ బెహెరా వెల్లడించారు. ఈనెల 14వ తేదీ ఎయిమ్స్‌లో చేరారని బైలేటరల్ న్యుమోనియా, అక్యూట్ క్రానిక్ లివర్ ఫైయిల్యూర్, డైలేటెడ్ కార్డియోమైయోపథి, తీవ్రస్థాయి ఎల్వీ సిస్టోలిక్‌డిస్‌ఫంక్షన్, మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్ మోడ్స్, రిఫ్రాక్టరీషాక్, తీవ్రస్థాయిలో శ్వాసకోస ఇబ్బందులు, అనూరిక్ అక్యూట్ కిడ్నీ గాయాలు, ఎన్‌సెఫలోపతి, హెపటో పథీ, థ్రంబోసైటోపేనియా, కోగ్యులోపతి వంటి రుగ్మ తలు ఆయన్ను చుట్టుముట్టాయి. చికిత్సకు కూడా స్పందించడం లేదని, వ్యాధులు తీవ్రస్థాయికి చేరుకున్నాయని ఆయన వివరించారు. ఆయన్ను అత్యవసర ఐసియులోనే ఉంచి నిపు ణులైన వైద్యబృందం ఆయన్ను 24 గంటలపాటు పర్య వేక్షించిందని సోమవారం రాత్రి కన్నుమూసినట్లు తెలిపారు.

pnb Housing Finance Limited Ghar Ki Baat

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22 K.G. మార్గ్, న్యూఢిల్లీ-110001.
ఫోన్లు: 011-23357171, 23357172, 23705414, వెబ్‌సైట్: www.pnbhousing.com
హైదరాబాద్ బ్రాంచి:- 4వ అంతస్తు, పోర్టీ డేవిడ్‌సన్ షోరూమ్ పైన, రోడ్ నం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.

[illegible]

| రుణ ఖాతా నం. | రుణగ్రహీత & సహరుణగ్రహీత పేరు/చిరునామా | హామీదారు (లు) పేరు/చిరునామా | తనఖా పెట్టిన ఆస్తి(లు) | డిమాండు నోటీసు తేదీ | డిమాండు నోటీసు తేదీ నాటికి బకాయి మొత్తం |
|---|---|---|---|---|---|
| HOU/HYD K/0322/ 97344, B.O. హైదరాబాద్ | [illegible] | NA | [illegible] | 04.11.2025 | రూ. 35,36,705.14 [illegible] 04-11-2025 నాటికి |

ప్రదేశం : హైదరాబాద్, తేది: 18.11.2025
సం/- అధీకృత అధికారి, (M/s PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)



ఆలయం రెండో ప్రాకారం డిజైన్

## అమరావతిలో వెంకటేశ్వరస్వామి ఆలయానికి రెండో ప్రాకారం - 27న సిఎం శంకుస్థాపన

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని ప్రాంతం వెంకటపాలెంలో టిటిడి నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి రెండో ప్రాకారం నిర్మించాలని టిటిడి నిర్ణయించింది. ఈ నెల 27న సిఎం చంద్రబాబు చేతుల మీదూ ఈ పనులకు శంఖుస్థానన చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 11.30 గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తిరుమల మాదిరిగా ఇక్కడ కూడా రెండో ప్రాకారం రూపుదిద్దుకోనుంది. పడమర,ఉత్తరం, దక్షిణం,దిక్కుల్లో 5 అంతస్థులో గాలి గోపురాలు...తూర్పు వైపున 7 అంతస్థులతో మహా రాజగోపురం నిర్మించనున్నారు. అంతర్భాగంలో మహా రాజగోపురానికి అభిముఖ్యంగా ఆంజనేయ స్వామి ఆలయం,ఉత్సవ మండపం, కోనేరు మొదలైనవి రానున్నాయి. వెంకటపాలెం వెంకటేశ్వరాల యానికి అతి తక్కువ కాలంలోనే విశేష ప్రాచుర్యం లభించింది.ఈ ఆలయానికి శనివారంతో పాటు ఇతర దినాల్లోను వేర్వేరు ప్రాంతాలను భారీగా భక్త జనం తరలివస్తుంటారు.ఆలయంలో స్వామివారి మూలవిరాట్ సందర్శనానికి భక్తులకు టీటీడీ నేరుగా అవకాశం కల్పించింది.

## రెండోఘాట్‌లో ద్విచక్రవాహనదారుడిపై పడిన బండరాయి

**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోడు మంగళవారం వేకువజాము నుండి బలమైన వర్షం కురవడంతో తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో బండరాయిజారి ద్విచక్రవాహన దారుడిపై పడింది. ప్రమాదవశాత్తు అతను హెల్మెట్ ధరించి ఉండటంతో ప్రాణాలు దక్కాయి. తిరుమలలోని లగేజీ కౌంటర్‌లో బాయ్‌గా పనిచేస్తున్న లోకేశ్(40)గా గుర్తించారు. తిరుపతి నుండి తిరుమలకు విదులకు వెళుతున్న సమయంలో రెండోఘాట్‌లో ఉన్నఫళంగా బండరాయిజారి తలపై పడింది. ఈ సంఘటనతో అతను రోడ్డుపై కుప్పకూలాడు. తీవ్రరక్తస్రావం కావడంతో అపస్మారకస్థితిలో చేరాడు. తోటి భక్తులు విజిలెన్స్‌కు సమాచారం అందించడంతో 108 అంబులెన్స్‌లో తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించి ప్రథమచికిత్స చేశారు.అనంతరం స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. వర్షం కురుస్తుండటంతో ఘాట్‌లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అలిపిరి టోల్‌గేట్‌లో విజిలెన్స్ సిబ్బంది జాగ్రత్తలు చేసి పంపుతున్నారు. వర్షం కురుస్తుండటంతో బండరాళ్ళు జారిపడు తున్నాయి.

## రైలు ఢీకొని ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి

**కావలి (నెల్లూరు), నవంబర్ 18, ప్రభాతవార్త :** రైలు ఢీకొని పూండ్ల అవిలాష్ రూన్ (19) ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి చెందిన సంఘటన కావలి పట్టణంలో జరిగింది.కొండాపురం, మండలం సాయి పేట గ్రామానికి చెందిన పూండ్ల సురేష్, అనిత దంపతుల కుమార్తె పూండ్ల అవిలాష్ రూన్ రైలు ఢీకొని మంగళవారం అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది.జిఆర్పి పోలీసుల, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు అవిలాష్ రూన్ అనే విద్యార్థిని పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుతుందని తెలియజేశారు. ఇటీవల అనారోగ్య కారణంగా స్వగ్రామం నుంచి కళాశాలకు వచ్చి వెళుతుండదని తెలియజేశారు.మంగళవారం యధావిధిగా వారి గ్రామం నుంచి కళాశాలకు రావడం జరిగిందని తెలియజేశారు. నేడు పరీక్షలు ఉన్నందున రికార్డ్స్ కొరకు రైల్వే ట్రాక్ దాటుకొని వెళుతున్న క్రమంలో కాన్పూర్ నుండి బెంగళూరుకు వెళుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందడం దిగిందని తెలియజేశారు.మృతదేహం వద్ద లభించిన ఆధారాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం జరిగింది.

## ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను ఆహ్వానించిన నితీశ్‌కుమార్

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ను ఆహ్వానించారు. ఈ నెల 20వ తేదీన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బిహార్ వెళ్లనున్నారు. పాట్నాలో జరిగే నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఇరువురు నేతలు హాజరుకానున్నారు. బిహార్ ఎన్నికల్లో వి.దీ.తి. తరపున మంత్రి లోకేష్ ఎన్నికల ప్రచారం చేశారు. బిహార్ పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు కార్మికులపై సిఎం చంద్రబాబు వ్యాఖ్యలుఅభ్యంతరకరం: వైఎస్ షర్మిల



**విజయవాడ,నవంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:** విశాఖ ఉక్కు కార్మికులపై ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరం మని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని " ఎక్స్'న వేదికగా చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, ఉక్కు పరిశ్రమ కార్మికులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెండింగ్ జీతాలు ఇప్పించాలని, ప్రైవేటీకరణ లేదని ప్రధానితో బహిరంగ ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఎంత ఉత్పత్తికి అంతే వేతనం అంటూ అధికారులు సర్క్యులర్ జారీ చేయడాన్ని షర్మిల తప్పుబట్టారు. 30 వేల మంది కార్మికులను 18 వేలకు కుదించారని, ఉక్కు ఉత్పత్తికి కావాల్సిన ముడి సరుకు తగ్గించారని, 45 రోజుల పాటు సరిపాడా నిల్వ ఉండాల్సిన ముడి సరుకును కేవలం 5 రోజులకు మించి నిల్వలు పెట్టడం లేదన్నారు. ఐరన్ ఓర్ అందక నెలకు వారం రోజులు ఉత్పత్తి ఆపుతున్నారని తెలిపారు. తప్పులన్నీ యాజమాన్యం దగ్గర పెట్టుకుని కార్మికులపై నిందలు మోపడం సరికాదన్నారు. విశాఖ కార్మికులకు సీఎం చంద్రబాబు తీరని అన్యాయం చేయాలనుకుంటున్నారన్నారు. ఆయన మాటలకు విశాఖ స్టీల్స్ జరుగుతున్న దానికి భిన్నమైన పరిస్థితులున్నాయన్నారు.,సీఎం విశాఖ స్టీల్స్ ప్రైవేటీకరణ జరగదంటారు.కేంద్రం మరో విధంగా వ్యవహరిస్తుందన్నారు.ఈ విషయంలో కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం దూది రైతుకు దుఃఖం తెచ్చి పెట్టింది. ఏపీ ప్రభుత్వం మక్క రైతుల రెక్కలు విరుస్తుందని షర్మిల ఎక్స్ వేదికలోనే మరో పోస్టింగ్‌లో ఆరోపించారు. మద్దతు ధర లేక రాష్ట్రంలో పత్తి రైతు చిత్తు అవుతుంటే, మొక్కజొన్న రైతు విలవిలలాడుతున్నాడు అన్నారు. మోంతా తుఫాను ధాటికి దిగుబడి తగ్గి రైతు దిగాలు పడుతుంటే.. చేతికొచ్చిన అరకొర పంటకైనా గిట్టుబాటు ధర పెట్టకుండా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది అన్నారు. పొలం మీదే పంటలకు రైతులు నిప్పు పెడుతుంటే రైతు సుభిక్షం లాంటి మాటలు చంద్రబాబు గారు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. క్వింటా పత్తికి కనీస మద్దతు ధర రూ.8110 ఉంటే మార్కెట్ లో గరిష్టంగా రూ.7వేలు పెట్టడం లేదు అన్నారు. వర్షాలకు రంగు మారిందని, తేమ ఉందని, పురుగు సోకిందని కొర్రీలు పెట్టడం దుర్మార్గం అన్నారు. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టి పత్తి పండిస్తే 6 క్వింటాలు కూడా దిగుబడి రాలేదని అన్నారు మార్కెట్ ధరతో పోల్చితే ఇంకా రూ 10 వేలు నష్టమేనన్న రైతుల బాధలు వర్ణనాతీతం అన్నారు. మొక్కజొన్నలకు కనీస మద్దతు ధర రూ. 2400 ఉండగా మార్కెట్ లో ధర రూ. 1400 కూడా ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. తుఫాను ప్రభావంతో ఎకరాకు దిగుబడి 10 క్వింటాలకు తగ్గితే, రూ.35వేలు పెట్టిన పెట్టుబడికి వచ్చే రాబడి రూ.20వేల కన్నా ఎక్కువ లేకపోవడం ఆందోళనకరం అన్నారు. పత్తి, మొక్కజొన్నే కాదు.. చంద్రబాబు గారి ఏడాదిన్నర పాలనలో ఏ పంటకు మద్దతు ధర లేదు అన్నారు. మిరపకు రూ.12 వేలు మద్దతు ధర ఉంటే రైతుకి దక్కింది రూ.6వేలే అన్నారు. వేరుశెనగకు రూ.8వేలు ఉంటే రైతుకి ఇచ్చింది రూ.4వేలు. కంది పంటకు మద్దతు ధర మీద రూ.2వేలు నష్టం అన్నారు. పెసరకు రూ. 3500 నష్టం. మినుములకు క్వింటాకు రూ. 14 వందల నష్టం. పొగాకు పంట క్వింటాకు రూ.13వేల నష్టానికి, ఉల్లి గడ్డ కిలో 4 రూపాయలకు అమ్ముకున్న దుస్థితి పట్టింది .

# రాజధాని వరద ముంపు నివారణకు రెండో పంపింగ్ స్టేషన్‌కు టెండర్లు

- 595 కోట్ల వ్యయంతో నిర్మాణం,8,400 క్యూసెక్కుల సామర్థ్యం - కొండవీటి వాగు వరద నీటిని ఎత్తిపోసేందుకు పథకం - గుంటూరు ఛానల్‌పై రెండు వరసల బ్రిడ్జి

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని వరద నివారణ ప్రణాళికలో భాగంగా రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ)సోమవారం టెండర్ ప్రకటన విడుదల చేసింది. మొత్తం రూ.595 కోట్ల వ్యయంతో(పన్నులతో కలిపి) 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో ఈ పంపింగ్ స్టేషన్‌ను నిర్మిస్తారు. ఉండవల్లి వద్ద 2014-19 మధ్య నిర్మించిన మొదటి పంపింగ్ స్టేషన్‌కు పక్కనే దీన్ని నిర్మిస్తారు. పంపింగ్ స్టేషన్‌ను గుత్తేదారు సంస్థే 15 ఏళ్ళ పాటు నిర్వహించేలా టెండర్ నిబంధన రూపొందించారు.ఇప్పుడు కట్టబోయే పంపింగ్ స్టేషన్‌లో ఒక్కొక్కటి 6వేల హార్స్‌పరవ్ సామర్థ్యం గల 13 మోటార్లు ఉంటాయి.కొండవీటి వాగు రాజధాని అమరావతి మీదుగా వెళ్ళి ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. అమరావతికి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో పాటు,పాలవాగు వంటి ఇతర చిన్న వాగులు,వంకలు కూడా కొండవీటి వాగులో కలుస్తాయి. కృష్ణా నదికి వరద లేనప్పుడు...కొండవీటి వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తే ఆ నీను కృష్ణానదిలో కలవకుండా వెనక్కి తన్నుతుంది. అలాంటి పరిస్థితి తలెత్తినప్పుడు రాజధాని ప్రాంతం ముంపునకు గురి కాకుండా ఉండేందుకు వరద నివారణ ప్రణాళికను సీఆర్‌డీఏ తయారు చేసింది. కొండవీటి వాగుకు తీవ్ర స్థాయిలో వరద పోటెత్తితే గరిష్టంగా 23 వేల క్యూసెక్కుల జలాలు వస్తాయని అంచనా.వాటిని కృష్ణానదిలోకి ఎత్తిపోసేందుకు మూడు పంపింగ్ స్టేషన్లు అవసరమవుతాయని ప్లాన్ చేశారు. ఈ మేరకు మొదటిది ఉండవల్లి వద్ద 5,000క్యూసెక్కుల సామర్థ్యంలో 2019కి ముందే నిర్మించారు. ఇప్పుడు 8,400 క్యూసెక్కుల సామర్థంతో రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. మూడో పంపింగ్ స్టేషన్‌ను వైకుంఠపురం వద్ద 8,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థంతో నిరి మ్మస్తారు.ప్రకాశం బ్యారేజి సమీపంలో కొండవీటి వాగు,గుంటూరు ఛానల్‌పై ప్రస్తుతం ఉన్న బ్రిడ్జికి సమాంతరంగా...రెండు వరసల బ్రిడ్జి,షిప్‌లాక్ నిర్మాణానికి రూ.55.85 కోట్ల అంచనా వ్యయంతో ఏడీసీ టెండర్లు పిలిచింది. కృష్ణా కరకట్ట మీదుగా రాజధాని లోకి రాకపోకలు ప్రస్తుతం ఈ బ్రిడ్జి మీదుగానే సాగుతున్నాయి. కరకట్ట రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలన్నది ప్రతిపాదన.దానికి తగ్గట్టుగా నాలుగు వరుసల బ్రిడ్జిపలు కూడా అవసరం. ఇందులో భాగంగా తొలుత రెండు వరుసల బ్రిడ్జి నిర్మిస్తారు. అది అందుబాటులోకి వచ్చాక... ప్రస్తుతం ఉన్న సన్నటి బ్రిడ్జిని తొలగించి..అక్కడ రెండు వరుసలతో బ్రిడ్జి నిర్మిస్తారు. రాజధానిలో అభివృద్ధి చేస్తున్న కాలువల్లో జల విహారానికి కూడా సీఆర్‌డీఏ ఏర్పాటు చేస్తోంది.రాజధానిలోని కాలువల్లోంచి బోట్లు కృష్ణానదిలోకి వెళ్ళేందుకు వీలు గా..ఇప్పుడు నిర్మించనున్న బ్రిడ్జికి షిప్‌లాక్ ఏర్పాటు చేయనున్నారు.

## మాజీ సిఎం జగన్ అక్రమాలస్తుల కేసు బ్యాంకు గ్యారంటీతో స్థిరాస్తి పత్రాల విడుదల

**విజయవాడ,నవంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:**వైసిపి అధినేత జగన్ అక్రమాలస్తుల కేసు దర్యాప్తులో భాగంగా సిబిఐ స్థంభింపచేసిన జగతి పబ్లికేషన్స్,ఇందిరా టెలివిజన్ కరెంట్ ఖాతాల నిర్వహణ నిమిత్తం హామీగా సమర్పించిన రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన స్థిరాస్థి పత్రాలను రూ.4.95 కోట్లకు బ్యాంకు గ్యారంటీ తీసుకుని విడుదల చేయాలంటూ సిబీఐ కోర్టును తెలంగాణ హైకోర్టు నిన్న ఆదేశించింది. బెంగుళూరు సమీపంలో నల్లూరు లోని రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన రూ.6.30 కోట్ల విలువైన 9 ఎకరాల స్థిరాస్థి పత్రాలకు బదులుగా నిందితులుగా ఉన్న కంపెనీల నుంచి బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. 2012 లో ఇదే కోర్టు ఆదేశాలతో హామీగా సమర్పించిన రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన మూడు స్థిరాస్థులను విడుదల చేయాలంటూ జగతి పబ్లికేషన్స్,జనని ఇన్‌ఫ్రా,ఇందిరా టెలివిజన్‌లు పిటీషన్లు వేశాయి. వీటిపై జస్టిస్ జె.శ్రీనివాస రావు విచారించారు. పిటీషనర్ల తరపు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి వాదిస్తూ తమ ఖాతాలకు రేషన్ ఇన్‌ఫ్రా ఇచ్చిన హామీ ఉపసంహరించుకుంటున్నందున ప్రత్యామ్నా యంగా బ్యాంకు గ్యారంటీ లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను గ్యారంటీగా ఇస్తామన్నారు. సిబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదిస్తూ సండూర్ కంపెనీ నుంచి క్లాసిక్ రియాల్టీ,దాన్నుంచి రేవన్ ఇన్‌ఫ్రాకు నిధులు వచ్చాయన్నారు. అందువల్ల ఇది జగన్ అక్రమాస్థుల కేసులో నేరపూరిత సొమ్మేనని,కేసు విచారణ పూర్తయ్యేదాకా ఆస్థుల పత్రాలను విడుదల చేయరాదని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి రేషన ఇన్‌ఫ్రా ఆస్థులకు ప్రత్యామ్నాయంగా పిటీషనర్ కంపెనీలు బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తున్నందున దర్యాప్తు సంస్థకు ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. పిటీషనర్ల నుంచి బ్యాంకు గ్యారంటీ తీసుకొని రేవన్ ఇన్‌ఫ్రా స్థిరాస్థి పత్రాలు విడుదల చేయాలని ఆదేశించారు.

## హిడ్మా ఎన్కౌంటర్ పై న్యాయ విచారణ జరిపించాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ

**విజయవాడ, నవంబర్ 18:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మా, అతని భార్య, మావోయిస్టులను ఎన్కౌంటర్ చేయడంపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో ఈరోజు మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మాను, అతని భార్యతో సహా ఆరుగురిని పోలీసులు ఎన్కౌంటర్ చేసి చంపటం దుర్మార్గం. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టు నేతలు ప్రకటించినప్పటికీ కేంద్రం దమనకాండ కొనసాగించటం గర్హనీయం. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాల్సింది పోయి, ఎన్కౌంటర్ల పేరుతో నిర్ధాక్షిణ్యంగా చంపటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆంధ్ర, తెలంగాణ బోర్డర్లో ఈరోజు జరిగిన ఎన్కౌంటర్ పై న్యాయ విచారణ జరిపించాలి.

## సామాజిక పరిస్థితుల రీత్యా క్రైస్తవ సంఘాలన్ని ఐక్యంగా ఉండాలి : రాష్ట్ర యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు




ఎపి యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ లోగో ఆవిష్కరణ దృశ్యం

**విజయవాడ,నవంబరు18,ప్రభాతవార్తప్రతినిధి:** సమకాలీన సామాజిక పరిస్థితుల రీత్యా క్రైస్తవ సంఘాలన్ని ఐక్యంగా ఉండాలని ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు పిలుపునిచ్చారు. పాస్టర్లు, దైవజనులంతా సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.రాష్ట్రంలో తీవ్ర సమస్యగా మారిన క్రైస్తవ స్మశానవాటికలరు స్థలాల కేటాయింపు, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థ నుండి చర్చిల నిర్మాణం, క్రిస్టియన్ సామాజిక భవనాలు నిర్మాణం, జెరుసులేం యాత్ర తదితరాల నిమిత్తం రూ.500కోట్లు ఏడాదికి కేటాయించవలసి ఉందని వారన్నారు.

ఈ దిశలో ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ పనిచేస్తుందని స్పష్టం చేసారు.

అర్హత కలిగిన పాస్టర్లుకు ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్లు ద్వారా మ్యారేజీ రిజిస్ట్రేషన్ లైసెన్స్ ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు.ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ కాల్‌సెంటర్ 9398185701 ద్వారా పాస్టర్లుకు వైద్యసేవ లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్‌లోగోను నేతలంతా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ జయప్రకాశ్ గంజికుంట అధ్యక్షత వహించారు.

దహించి అగ్ని మినిస్ట్రీస్(రాజమండ్రి) వ్యవస్థాపకులు డాక్టర్ థామస్,విశిష్ట అతిధులుగా ఎపియుపిఎఫ్ రాష్ట్ర చీఫ్ అడ్వజర్(క్రిస్టియన్ ఎఫైర్స్) రెవ.పాదర్ ఇన్నయ్య బెల్లంకొండ.స్టేట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ వడ్లమూడి,ఈ కార్యక్రమంలో ఎపియుపిఎఫ్ ఉపాధ్యక్షుడు బిసప్ పి.సుందరరావు,బిషప్ నతానియేల్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ప్రకాశ్, కార్యదర్శి రెవరెండ్ పి.యోహుషవా, కోశాధికారి కె.మోజేస్.ముఖ్య సలహాదారు డాక్టర్ పి,మాణిక్యాలరావు,.రెవరెండ్ డి దేవసహాయం, బ్రదర్ గాంధీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి సర్కిల్ క్యాజువల్ లేబర్ సిబ్బందిని కొనసాగించాలి

### కేంద్ర పురావస్తు శాఖ

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి కడపలోని గండికోట, సిద్ధవటం, ఒంటిమిట్ట, పుష్పగిరి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్, దానవలపాడు, పెద్దముడియం తదితర ప్రాంతాల్లో 11 మంది పనిచేస్తున్నా సర్కిల్ క్యాజువల్ సిబ్బందికి న్యాయస్థానం ఆదేశాల మేరకు 1/30 స్టేటస్ ఇవ్వాలని కేంద్ర పురావస్తు శాఖకు ఆదేశాలు ఇచ్చింది.రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలైన లేపాక్షి,గండికోట నాగార్జునకొండ, అమరావతి, గండికోట, శాలిగుండం, తదితర ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్ సింగ్ రావత్ కు, కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షె కావత్ కు ఢిల్లీలో మంగళవారం వినతి పత్రాన్ని అందించిన అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు మరియు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు.రాష్ట్రంలోని ప్రముఖ స్మారకాలు కట్టడాలు అయిన అమరావతి, నాగార్జున కొండ,బ ట్టిప్రోలు, గుంటుపల్లి,గండికోట, లేపాక్షి, గుత్తి కోట, చంద్రగిరి పోర్టు, శాలిగుండం,శంకరం లాంటి ప్రముఖ చారిత్రక పర్యాటక ప్రాంతాల్లో సేవలు కొనసాగిస్తున్నార.

# తిరుమల సమాచారం

## టిటిడి బర్డ్‌ట్రస్ట్‌కు భారీ విరాళం



**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి బర్డ్ ట్రస్ట్‌కు ఓ దాత భారీ విరాళం అందించాడు. మంగళవారం రాత్రి హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోషిణినాడార్ బర్డ్ ట్రస్ట్‌కు 2కోట్ల రూపాయలు డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఆలయంలోపల అందజేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో వచ్చే వేసవిలో సద్గమయ



**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థుల్లో నైతిక విలువలు, మానవీయధర్మాలు వ్యక్తిత్వవికాసం నిర్మాణానికి శిక్షణనిర్వహించేందుకు వచ్చే వేసవిలో సద్గమయ కార్యక్రమం నిర్వహించాలని టిటిడి హిందూ ధర్మప్రచారపరిషత్ కార్యనిర్వాహక కమిటీ నిర్ణయించింది. తెలుగురాష్ట్రాల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ శిక్షణ నిర్వహించేందుకు నిర్ణయించారు. తిరుమలలో అఖండహరినామసంకీర్తనకు 7,856 భజన బృందాలు రిజిష్టర్ అయ్యాయని, వాటి నైపుణ్యాన్ని పరిశీలించి జిల్లా స్థాయిలో భజనప్రదర్శనలను ఏర్పాటుచేసి వాటినిక్రమ బద్ధీకరించేందుకు నిర్ణయించారు. టిటిడి హిందూ ధర్మప్రచారపరిషత్ కార్యనిర్వాహక కమిటీసమావేశం మంగళవారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌తో కలసి బోర్డు సభ్యులు జానకిదేవి, మహేందర్‌రెడ్డి, హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరామ్‌రఘునాథ్ పాల్గొన్నారు.

## వడ్డీకాసుల వెంకన్నకు వజ్రాలు పొదిగిన యజ్ఞోపవీతం



**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి ప్రియభక్తుడు వజ్రాలుపొదిగిన బంగారు యజ్ఞోపవీతం బహుకరించారు. నీలోఫర్‌కేఫ్ యజమాని బాబురావు కుటుంబం గతంలో తిరుమలకు వచ్చి ఇష్టదైవాన్ని దర్శించుకున్న సమయంలో సాక్షాత్తు స్వామివారే తనకు యజ్ఞోపవీతం కావాలని కోరినట్లు మనసులో తోచింది. దీంతో దాదాపు కిలో బంగారం ,కోటి రూపాయలు వజ్రాలతో తయారుచేయించిన ఈ అమూల్యమైన విరాళం యజ్ఞోపవీతాన్ని బాబురావు కుటుంబం టిటిడికి అందజేసింది. గతంలో దర్శనానికి వచ్చినపుడు స్వామివారు అడగటం తన భక్తితో ఆ దేవునికి ఇప్పుడు సమర్పించుకోవడం జరిగిందని దాత తెలిపారు. ఆలయ అధికారులు ఈ విరాళాన్ని అందుకున్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి : ప్రముఖులు



**తిరుమల,నవంబర్ 18ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో తెలంగాణ మంత్రి పొన్నంప్రభాకర్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, సినీనిర్మాత నాగవంశీ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. జోరువాన కురుస్తున్నా భక్తులు స్వామివారిని దర్శించుకోవడం విశేషం.

## మరింత లోతుగా అప్పన్నకు సిట్ ప్రశ్నలు



**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి కల్తీనెయ్యితో సరిపెట్టుకున్నారని బలమైన ఆరోపణలపై సిబిఐ సిట్ అధికారులు మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఏ చిన్నఅప్పన్నను కస్టడీలో విచారణ చేశారు. రెండవరోజు మంగళవారం అలిపిరి సిట్ కార్యాలయం మరికొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. టిటిడి వ్యవహారాల్లో ఎవరు కలగజేసుకోమన్నారు, నెయ్యి సరఫరా చేసిన డెయిరీలతో పిఏగా నీకు ఎలాంటి అర్హత ఉంది, భారీగా నగదు ఎలా వచ్చింది అనే కోణంలో వివరాలు రాబట్టారని, కొన్నిటికి సమాధానాలు దాటవేశాడనేది తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో నలుగురు ప్రధాన నిందితులు తమిళనాడు ఏఆర్ డెయిరీ ఎండి రాజశేఖరన్, నెయ్యిసరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌లోని పరాగ్‌డెయిరీ,ప్రీమియర్ అగ్రిపుడ్స్,అల్ఫామిల్క్‌పుడ్స్, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒఅపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను సిట్ నాలుగునెలల క్రిందటే అరెస్టుచేసిన విషయం విదితమే. వారినుండి రాబట్టిన కీలక సమాచారంతో అప్పన్న వైవి సుబ్బారెడ్డి చెబితే కల్తీనెయ్యి వ్యవహారంలో తలదూర్చాడనేది సిట్ వద్ద ఆధారాలు. కొందరు టిటిడి మార్కెటింగ్ ,కొనుగోళ్ళ ఉద్యోగులను సిట్ అధికారులు లోతుగా విచారణ సాగించినట్లు తెలిసింది. 2020-24 మధ్య కాలంలో వైవి వ్యవహారాలను చక్కబెట్టడం, లావాదేవీలు,ఆర్థికపరమైన అంశాల్లో కీలకంగా వ్యవహరిచాడనేది సిట్ వద్ద ఉన్న సమాచారం. దానిమేరకు ఇప్పుడు పలుకోణాల్లో విచారణలో కొన్ని వాటికి సమాధానం చెప్పడంలేదనేది తెలిసింది. అప్పన్న ఖాతాలో పెద్దమొత్తంలో ఆర్థికలావాదేవీలపై ప్రధానంగా దృష్టి సారించింది. కల్తీనెయ్యి కొనుగోలుచేసిన వ్యవహారంలో ప్రస్తుతం మాజీలుగా ఉన్న టిటిడిలో పనిచేసిన కీలక నేతలు, అధికారులను నేటి నుండి విచారణ చేయనుంది. త్వరలోనే సిట్ అధికారులు గత బోర్డులో కొనుగోళ్ళకమిటీ సభ్యులను విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది.సిబిఐ డిఐజి మురలీరాంభా నేతృత్వంలోని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీలు, సిఐలు అసలు సూత్రధారులను పట్టుకునే దిశగా సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఈ కేసు క్లైమాక్స్‌కు తీసుకురానున్నారు.

## కేసులోని వారందరికీ భద్రత కల్పించాలి

### పరకామణి కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** సంచలనం కలిగించిన తిరుమల పరకామణి భవనంలో చోరీ కేసు విచారణ తుదిదశకు చేరుకోవడంతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరై రెండోసారి విచారణకు వస్తున్న పూర్వ ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయాన్ని న్యాయస్థానం పరిగణనలోనికి తీసుకుంది. ఈ కేసులో నిందితులు, సాక్షుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసులో కీలకనిందితుడు రవికుమార్‌తో బాటు సాక్షులు అందరికీ పూర్తిస్థాయి భద్రత కల్పించాలని రాష్ట్ర సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్‌ను మంగళవారం ఆదేశించింది. కేసు విచారణ ముగిసేంత వరకు వారికి ఎలాంటి హానికలగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. విచారణ సమయంలో కూడా అనవసర ఇబ్బందులు తలెత్తకుండా ,సాక్షుల భద్రతకు ప్రాధన్యాతనివ్వాలని సూచించింది. పరకామణి చోరీ కేసు విచారణ వేగంగా సాగుతున్న సమయంలో ఇటీవల పూర్వ ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ అసహజంగా మరణించడం తీవ్ర కలకలం రేపింది. మొదట అనుమానాస్పదమృతిగా కేసు చూసినా ఆ తరువాత హత్యగా నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో సాక్షుల భద్రతకు ప్రాధాన్యత నివ్వాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిం.ది తదుపరి డిసెంబర్ 2వతేదీకి విచారణ వాయిదా వేసింది. ఇప్పటికే సిఐడి అధికారులు ఈ కేసులో దర్యాప్తును కూడా హైకోర్టుకు తెలిపినట్లు తెలిసింది.

# గ్రంథాలయ వారోత్సవాల పోటీలు

పెదనందిపాడు నవంబర్ 18 (ప్రభాతవార్త)శాఖా గ్రంథాలయం ప్రత్తిపాడు నో మంగళవారం 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలల్లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు స్వర్ణాఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర.పర్యావరణ పరిశుభ్రత అనే అంశాల పై వ్యాసరచన పోటీలు మరియు. గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత .అనే అంశం పై వక్తృత్వం పోటీలు నిర్వహించారు.ఈపోటీలల్లో విద్యార్థిని, విద్యార్థులు



50 మంది పైగా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకుగ్రంథాలయాధికారి బి.అరుణఅధ్యక్షత వహించి మాట్లాడుతూ. విద్యార్థుల విద్యతో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనటం భవిష్యత్తులో వారి జీవితానికి మలుపునిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లు అక్షయ స్కూల్ హిందీ టీచర్ ఆర్ త్రివేణి. ఎం మోనికల పర్యవేక్షణలో నిర్వహించడమైనది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లోస పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# రావిపాడు జిజిపాలెంలో పొలం పిలుస్తోంది...

పెదనందిపాడు నవంబర్ 18 (ప్రభాతవార్త)పెదనందిపాడు మండలంలోని రావిపాడు. గోరిజవోలు గుంట పాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎం గంగాదేవి మాట్లాడుతూ ఆత్మ శిక్షణా కార్యక్రమంలో రైతులకు రబి




పంటలలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులు మరియు సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు.నూతన శనగ పంట రకాలు వాటిలో దిగుబడి గురించి రైతులకు తెలియజేశారు. రైతులుకు మొక్కజొన్న, మిరప మొదలైన పంటల్లో వచ్చే తెగుళ్ల గురించి నివారణ మార్గాలను గురించి తెలియపరిచారు. తదుపరి ప్రత్తి పొలాలను సందర్శించి ముంతా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల వలన కొన్ని పొలాల్లో గులాబీ రంగు పురుగు వచ్చి ఉన్నదని దీని నివారణకు సమగ్ర సస్య రక్షణ పద్ధతులు అనగా పత్తి చేలల్లో లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవడం. వేప సంబంధిత మందులను పిసికారి చేసినట్లయితే పురుగు యొక్క ఉధృతి తగ్గుతుందని .అదేవిధంగా ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే ఇమామేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు ఒక లీటర్ చొప్పున పిసికారి చేయాలని లేదా ఇండాక్సి కార్బ్ ఒక మిల్లీమీటర్ ఒక లీటర్ నీటిలో కలిపి పిసికారి చేసుకోవాలని తెలియజేశారు. అదే విధంగా సీఎం యాప్ నందు రైతులు పత్తిని మద్దతు ధర 8110 అమ్ముకోవాలంటే రైతు సేవా కేంద్రంలో వి ఏ ఏ ల దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం విద్యానవన సహాయకులు ఉన్నారు. రైతుల అధిక సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ లో పాల్గొన్న పి.ఏ.యస్ కళాశాల విద్యార్థులు

పెదనందిపాడు నవంబర్ 18 (ప్రభాతవార్త) పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థుల చేత " టొబాకో మరియు డ్రగ్స్ కి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ



చేయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యసనం సమాజాన్ని మెల్లగా నాశనం చేస్తోంది అని. ఇది వ్యక్తిగత జీవితం మాత్రమే కాదు, కుటుంబాలు, గ్రామాలు, పట్టణాలు.దేశం మొత్తాన్నే ప్రభావితం చేస్తోంది. భారత ప్రభుత్వం ప్రారంభించిన"నషా ముక్త్ భారత్ అభియాన్" లక్ష్యం డ్రగ్స్‌లేని, ఆరోగ్యకరమైన భారత దేశాన్ని నిర్మించడం. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో విద్యా సంస్థలు, యువజన సంస్థలు మరియు మహిళా సంఘాల పాత్ర అత్యంత ముఖ్యమైనది అన్నారు. ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలి అని. యువతలో చైతన్యం రేకెత్తించి, డ్రగ్స్ నుండి దూరంగా ఉండి, సాంప్రదాయ విలువలను నిలబెట్టుకుందాం మన్నారు. మాదకద్రవ్యాలకు"నో (లేదు)" అని చెప్పడం చిన్న నిర్ణయం కావొచ్చు, కానీ అది ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక దేశాన్ని రక్షి చే నిర్ణయం అని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పెదనందిపాడు సోమేశ్వర ఆలయంలో ఘనంగా మాస శివరాత్రి పూజలు

పెదనందిపాడు నవంబర్ 18 (ప్రభాతవార్త) పెదనందిపాడు శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం కార్తీకమాస శివరాత్రి పర్వదిన సందర్భంగా . అర్చక స్వాములు. వద్దమూడి చంద్రశేఖర్ శర్మ .పట్టాభి శరత్ కుమార్ శర్మలు స్వామివారికి తొలుత గణపతి



పూజ. గోపూజ .మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం. లలిత సహస్ర పారాయణం. సపరివారే దేవతార్చన తదితర కార్యక్రమాలతో పాటు .పవమాని దంపతులచే గణపతి హోమం. నవగ్రహములహోమం. శివ కేశవుల హోమం కార్యక్రమా లను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితర సురేష్ బాబు. దాసరి శేషగిరిరావు. దాసరి సత్యనారాయణ. డి ఎల్ ఎన్ ప్రసాద్. దాసరి శివ. వి రాజేష్. రమాదేవి. కుసుమాంబ. కళావతి. రామచంద్ర రావు. తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండగగా కొమ్మూరు శివాలయంలో కోటి దీపార్చన

పెదనందిపాడు నవంబర్ 18 (ప్రభాతవార్త)చరిత్రలో అత్యంత ప్రాశస్త్యం కలిగిన కాకుమాను మండలం కొమ్మూరు లోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం మాస శివరాత్రి సందర్భంగా కోటి దీపార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా కన్నుల పండుగ లా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున వేల సంఖ్యలో



పాల్గొని. భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి పెదనందిపాడు టిడిపి



సీనియర్ నాయకులు రావి శివరామకృష్ణయ్య దంపతులు 9 కింటాల్ బియ్యం అందించారు. దాతకు ఆలయ ఈవో జిడుగు వెంకట నారాయణ, ఆలయ చైర్మన్ పావులూరి సాంబశివరావు, ప్రధాన అర్చకులు జంధ్యాల హరిబాబు ఆధ్వర్యంలో. జంధ్యాల నాగేశ్వరరావు జంధ్యాల శ్రీనివాసరావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభ్యులు మండవ శ్రీనివాసరావు, పెద్ది నాగేశ్వరరావు, దొప్పలపూడి నాగేంద్రయ్య, చెన్నుపాటి రాంబాబు, దొప్పలపూడి నవీన్ లు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కాకుమాను గ్రూపు దేవాలయాల ఈవో యజ్ఞ నారాయణ. తదితర ప్రముఖులు ఆలయాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు.

# ప్రపంచ రేడియాలజీ దినోత్సవం

మంగళగిరి నవంబర్ 18 ప్రభాతవార్త: ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియో గ్రాఫర్స్ టెక్నాలజిస్ట్స్ , తిరుపతి అకడమిక్ క్లబ్ ఆధ్వర్యంలో"సింపోజియం ఆన్ ఎమ్మారై కార్యక్రమం తిరుపతి అపోలో క్లినిక్‌లో విజయవంతంగా నిర్వహించారు.ప్రపంచ రేడియాలజీ దినోత్సవం 2025 సందర్భంగా



ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మారై సంబంధిత ఆధునిక అంశాలపై నిపుణులు ఉపన్యాసాలు అందించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రెజెంటేషన్ సెషన్‌లో ఎన్నారై అలైడ్ అండ్ హెల్త్ కేర్ కాలేజీ విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ఎమ్మారై బ్రెస్ట్, ఎమ్మారై ఆర్టిఫ్యాక్ట్స్ అంశాలను అత్యుత్తమంగా ప్రతిభ ప్రదర్శించిన వారికి ప్రశంసలను, బహుమతులు అందుకున్నారు. విద్యా రంగంలో ఇలాంటి ప్రతిభావంతమైన విద్యార్థులు ముందుకు రావడం ప్రశంసనీయమని నిర్వాహకులు రంగరావు, శివ,బాషా అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థులను రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ అంకమ్మరావు అభినందించారు.

# యర్రబాలెంలో మహిళ గొంతు నులిమి హత్య

మంగళగిరి, నవంబర్ 18, ప్రభాతవార్త : మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని యర్రబాలెం గ్రామంలో ఓ మహిళ హత్య కు గురైన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. మచిలీపట్నం చెందిన కిలిమి లక్ష్మి ౣ పార్వతి (29) ను ఆమె భర్త కిలిమి శంకర్ రెడ్డి (34) గొంతు నులిమి హత్య చేసిన ఘటనపై మంగళగిరి గ్రామీణ సీఐ ఏవి బ్రహ్మం, గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ లు కేసు నమోదు చేశారు. గ్రామీణ సీఐ బ్రహ్మం, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ లు తెలిపిన వివరాల మేరకు ఐదు సంవత్సరాల క్రితం శంకర్ రెడ్డి-లక్ష్మి ౣ పార్వతికి వివాహం జరిగింది. వైవాహిక



కలహాల కారణంగా దాంపత్య జీవితం దెబ్బతిని, ఇద్దరూ దూరంగా ఉంటున్న పరిస్థితి. ఈ క్రమంలో లక్ష్మి ౣ పార్వతి యర్రబాలెంలో నివసిస్తూ ఉన్నది.మంగళవారం మధ్యాహ్నం 3.50 గంటల సమయంలో తన భర్త శంకర్ రెడ్డి ఆమె నివాసానికి వచ్చి ఆమెపై దాడి చేయడంతో బాధితురాలు అరుస్తూ.. కేకలు వేస్తూ పక్కింటికి పారిపోయింది. అయినా నిందితుడు వెంటపడి వెళ్లి, లోపల నుండి తలుపు గడియపెట్టి, లక్ష్మీ ౣ పార్వతి గొంతు నులిమి హత్య చేసినట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో తేలినట్టు తెలుస్తుంది. సంఘటనా స్థలాన్ని గ్రామీణ సిఐ బ్రహ్మం, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ లు పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితుడు పరారీలో ఉండగా, అతడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని మంగళగిరి గ్రామీణ సిఐ బ్రహ్మం తెలిపారు

## మాదకద్రవ్యాల ప్రభావంపై వక్తృత్వ పోటీలు



తాడేపల్లి,నవంబర్ 18,ప్రభాతవార్త : స్థానిక శాఖా గ్రంధాలయంలో 58వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా సీనియర్స్ విభాగంలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంమీద చిత్రలేఖనం పోటీలు,మధ్యాహ్నం విద్యార్థులపై మాదకద్రవ్యాల ప్రభావం అంశం మీద వక్తృత్వ పోటీలు నిర్వహించారు.కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఎం.జ్యోతి,డి.సునీత,ఆర్.శ్రీలత లు పాల్గొన్నారు.ఈ పోటీల్లో 62మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంధాలయ అధికారి షేక్ నాగూర్‌భాష తెలిపారు.

# డెల్టాలో వరికోతలు

## 30 నుంచి 32 బస్తాల వరకు దిగుబడులు....

## రెండవ పంటకు విత్తనాలు సిద్ధం చేస్తున్న రైతాంగం..

కొల్లిపర,నవంబరు 18 ప్రభాతవార్త: డెల్టా ప్రాంతం..కొల్లిపర మండలం..ఇక్కడ రైతాంగం అంతా కష్టజీవులే..ఆరుగాలం శ్రమించి..పంటలకు అధిక పెట్టుబడులు పెట్టి మంచి దిగుబడులు అందించగల రైతులు ఎందరో ఉన్నారు..ఈ మండలంలోని వల్లభాపురం,మున్నంగి,కొల్లిపర,తూములూరు,అత్తోట గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలలో ఈ ఏడాది సుమారు ఖరీఫ్‌లో 6 వేల హెక్టార్ల కు పైగా వరి పంట వెదసాగు చేసినట్లు తెలుస్తోంది.మండలంలోని కొన్ని గ్రామాల పంటపొలాల్లో గత రెండు





రోజుల నుంచి యంత్రాలతో పంటను కోసి నూర్పిడి చేస్తున్నారు.ఇటీవల వచ్చిన మొందా తుఫాన్ గాలులకు పంట నేలకొరిగి పంటరాలిపోయి మండల రైతాంగం పంటలు నష్టపోవటంతో ఈ ఏడాది ఆశించిన దిగుబడులు రావటంలేదని చెప్పాలి.వరి పంట గాలులకు దెబ్బతినగా మిగిలిన పంట ఎక్కువ శాతం 30 నుంచి 32 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నట్లు తెలుస్తోంది...వెదసాగు చేసిన రైతులు యంత్రాలతో పంటను నూర్పిడి చేస్తూ బయటకు వచ్చిన ధాన్యాన్ని ట్రాక్టరులో కార్చి మెరక ప్రదేశానికి తరలిస్తున్నారు.మెరక ప్రదేశంలో పట్టాలు వేసి ధాన్యాన్ని ఆర బెడుతున్నారు.వాతావరణంలో ఏదైనా మార్పులు చోటు చేసుకుంటే వెంటనే పంటను రక్షించుకునేందుకు రైతులు ముందుగానే మంచి టార్పాలిన్ పట్టాలను కూడా సిద్ధంగా ఉంచుతున్నారు..ఈ సంవత్సరం మండలంలో అత్యధిక శాతం వెదసాగు చేసారు.మిషన్ ద్వారా వరిని నూర్చితే గంటకు సుమారు రూ.2800 ఖర్చు అవుతుందని కౌలు రైతులు తెలియజేసారు.కౌలు రైతులు అవకాశాన్ని బట్టి అమ్ముకుంటే..వ్యాపారస్తులు ఆ ధాన్యాన్ని కూలీలతో బస్తాలకు ఎత్తించి లారీల ద్వారా ఎగుమతులు చేస్తున్నారు.ప్రస్తుతం నూర్చిన ధాన్యం ధర 75 కిలోలు బస్తా రూ.1470 నుండి రూ.1500 వరకు ధరలు పలుకుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు.మరికొందరు రైతులు రానున్న రోజుల్లో ఇంకా మంచి ధరలు వస్తాయనే ఆశతో ధాన్యం బస్తాలలో నింపి గోడౌన్ కు తరలించేందుకు సిద్ధం అవుతున్నారు.

**రబీలో రెండవ పంటగా మొక్కజొన్న,జొన్న సాగుకు సిద్ధం అవుతున్న రైతాంగం**

మండలంలో రబీలో సాగుకు రెండవ పంటగా మొక్కజొన్న,జొన్న ప ంటలు సాగుచేసేందుకు రైతులు సిద్ధం అయ్యారు.కోతలు కోసాక భూమి పదును చూసుకుని విత్తనాలు పొలాలలో నాటేందుకు సిద్ధం అవుతున్నారు.ప్రవేటు కంపెనీలు మొక్కజొన్న విత్తనాలు రైతులకు అమ్మించేందుకు డీలర్లును సిద్ధం చేసుకున్నారు.విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రతలు పాటిస్తూ తప్పనిసరిగా డీలరు వద్ద బిల్లులు తీసుకోవాలని వ్యవసాయాధికారులు తగు సూచనలు చేస్తున్నారు.

# తెలుగుభాషను పరిరక్షించుకోవాలి





కొల్లిపర,నవంబరు 18 ప్రభాతవార్త: గ్రంధాలయాల ద్వారా పాఠకులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని లైబ్రరియన్ నాగసాంబశివనాయక్ పేర్కొన్నారు. మంగళవారం 58 జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని వల్లభాపురం,తూములూరు,మున్నంగి శాఖా గ్రంధాలయం వద్ద విద్యార్థులకు ఆటలు, చిత్రలేఖనం,క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సాంబశివనాయక్ మాట్లాడుతూ సమాజా నికి విజ్ఞానాన్ని అందించడంలో గ్రంధాలయాల పాత్ర ఎంతో ఉందన్నారు. తూములూరు గ్రంధాలయంలో లైబ్రరియన్ సత్యమ్మ మాట్లాడుతూ తెలుగుభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.మున్నంగి గ్రంధాలయంలో లైబ్రరియన్ జ్యోతి మాట్లాడుతూ గ్రంధాలయంలో అమూల్యమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రామస్తులు సద్వినియోగించుకోవాలన్నారు.విద్యార్ధిదశ నుంచే గ్రంధాలయాలకు వెళ్ళి పుస్తక పఠనం చేయటం ఎంతో మంచిదన్నారు.ఆయా కార్యక్రమాలలో గ్రామ పెద్దలు,విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు రూ.102 కోట్లు రుణాలు ఇచ్చాం..!!



కొల్లిపర,నవంబరు 18 ప్రభాతవార్త: రైతులకు రూ.102 కోట్ల వరకు ఇప్పటి వరకు వివిధ రూపాల్లో రుణాలు ఇవ్వటం జరిగిందని కొల్లిపర సహకార సంఘం బ్రాంచి మేనేజర్ బాజీబాబా అన్నారు.మంగళవారం మండల కేంద్రం కొల్లిపర ప్రాధమిక సహకార పరపతి సంఘం ఆద్వర్యంలో 72 వ అఖిలభారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సహకార సంఘం సీనియర్ ఇన్‌స్పెక్టర్లు భావన్నారాయణరాజు,పి.ప్రసాద్,బ్రాంచి మేనేజర్ బాజీబాబా,సూపర్‌వైజర్ ప్రవీణ్,సీఈవోలు గుదిబండి శివనాగిరెడ్డి,ఎ.పూర్ణారెడ్డి, విజయభాస్కర్, వెంకట్రావు హాజరై జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేసారు.ఈ సందర్భంగా బాజీబాబా మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో రైతులకు రూ.7 కోట్ల 61 లక్షలు వరకు ఇవ్వటం జరిగిందన్నారు.ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో రైతులు,గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

కొల్లిపర,నవంబరు 18 ప్రభాతవార్త: రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు,మంగళవారం మండల పరిధిలోని చివలూరులో వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.



నూర్పిళ్ళుపై తీసుకోవలసిన జాగ్రతలపై తగిన సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయటానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.రైతులు ధాన్యాన్ని అమ్మదలచినట్లయితే రైతు సేవా కేంద్రంలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను ప్రోత్సహించాలి:మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 18 (ప్రభాతవార్త): గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించేలా, గ్రంథాలయ ఉద్యమకారులు సేవలను స్మరిస్తూ నిర్వహిస్తున్న58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఐదవరోజు,మంగళవారం తెనాలి మున్సిపల్ కమిషనర్



జాగారపు రామ అప్పలనాయుడు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.మార్కులు, ర్యాంకులు అంటూ అటు తల్లిదండ్రులు ఇటు పాఠశాల యాజమాన్యాలు ఒత్తిడికి గురిచేస్తున్న ఈ రోజుల్లో విద్యార్థులు ప్రతి విషయాన్ని అర్థం చేసుకుని చదివితే అది ఎప్పటికీ మనకి గుర్తుండిపోతుందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఈఎల్వి అప్పారావు,గ్రంథాలయ అభివృద్ధి సంఘం కార్యదర్శి,, స్వరలయ వేదిక వ్యవస్థాపకులు సాయి లక్కరాజు,పట్టణ ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమోళి,గ్రంథాలయ అధికారిణి కడియాల సుజాత పాల్గొన్నారు.

**హ్యాండ్ రైటింగ్ పోటీల్లో విద్యార్థులకు బహుమతి ప్రదానం**




తెనాలి టౌన్ నవంబర్ 18 (ప్రభాతవార్త):పట్టణంలోని మారిస్ పేట లోగల నల్లమోతు చెంచురామానాయుడు మున్సిపల్ హైస్కూల్ నందు, చిల్డ్రన్స్ డే సందర్భంగా, మహారాష్ట్రలో గల రెయిన్బో సెంటర్ నందు జాతీయ స్థాయిలో ఆలిండియా హ్యాండ్ రైటింగ్ పోటీల్లో 300 పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఇద్దరికీ బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డు, గోల్డ్ మెడల్స్19 , సిల్వర్ మెడల్స్ 8,,బ్రాంజ్ మెడల్స్5 రెయిన్బో డైరెక్టర్ కృష్ణ అంతేరియా తెలిపారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పఠాన్ కరీముల్లా అధ్యక్షత వహించగా,చిత్రలేఖన ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మార్వో గోపాలకృష్ణ,ఎంఈఓ లు మేకల లక్ష్మీ ౣనారాయణ, జయంత్ బాబు, విద్యార్థిని, విద్యార్థులకు ప్రధానం చేశారు.అనంతరం తాసిల్దారు గోపాలకృష్ణ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ,పదవ తరగతి పరీక్షాఫలితాల్లో క్రిందటి సంవత్సరం కంటే,ఈ సంవత్సరం ఫలితాల్లో మెరుగుగా ఉండాలని, చదువుతోపాటు సమాజం పట్ల కూడా అవగాహనలు కల్పించాలని మాట్లాడారు. విద్యార్థులు జాతీయస్థాయిలో చేతి రాతలో మంచి పతకాలు వచ్చినందుకు విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.చక్కని రాతతో మంచి మార్కులు సాధించవచ్చు అని కాంపిటేటివ్ పరీక్షలకు వెళ్ళినప్పుడు ప్రథమ స్థాయిలో ఉంటారని ఈ చక్కని రాత పోటీల్లో పాల్గొని ఇన్ని పథకాలు వచ్చినందుకు విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.ఎంఈఓ మేకల లక్ష్మీ ౣనారాయణ మాట్లాడుతూ,విద్యార్థులంతా ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని సాంస్కృతి కార్యక్రమాలు, ఆటలు, చిత్రలేఖనంలో వివిధ రకాల అంశాల్లో పాల్గొని మీ సత్తా చాటుతున్నారని కొనియాడారు. విద్యార్థులంతా చక్కని క్రమశిక్షణతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నందుకు విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాత గా సోమశేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు చిత్రలేఖన ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ ను,విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

## శ్రీ శివలింగేశ్వర స్వామి సేవా సమితిచే అనాధ మృతదేహానికి అంత్యక్రియలు

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 18 (ప్రభాతవార్త): నవంబర్ 9న రైల్వే ట్రాక్ పై అనుమానాస్పదంగా మృతి చెందిన అనాధ మృతదేహానికి పట్టణంలోని శ్రీ శివ లింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.తెనాలి రైల్వే పోలీసుల తెలిపిన సమాచారం మేరకు సుమారు 35



సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పద రీతిలో రైల్వే ట్రాక్ పై పడి చనిపోయి ఉన్నాడు.మృతుడి వివరాలు,అతనికి సంబంధించిన బంధువులు ఎవరూ, తెలియక పోవడంతో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో భద్రపరచగా, మంగళవారం శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమితి అధ్యక్షులు కుర్రాశ్రీను తమ సొంత వాహనంలో, మృతదేహాన్ని పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులో గల మహాప్రస్థానం నందు సాంప్రదాయబద్ధంగా ఖననం చేశారు. ఈ సందర్భంగా కుర్ర శ్రీను మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా, గుంటూరుకు చెందిన శ్రీ స్వామి జ్ఞాన ప్రసన్న పిలుపుమేరకు, ఆపదలో ఉన్న వారికి అన్నం పెడుతూ,అనాధలు నిస్సహాయులు మరణిస్తే వారికి మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించటం లాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, దహనం చేసిన అస్థికలను కాశీలోని గంగానదిలో నిమజ్జనం చేసి తదుపరి పెండ ప్రధానం కూడా చేయటం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ శివ లింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు,మల్లెల వాసు, బి.పోతురాజు,బి. శ్రీను పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డును సందర్శించిన మున్సిపల్ కమీషనర్



తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 18 (ప్రభాతవార్త): పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులో గల డంపింగ్ యార్డ్ ను మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా యార్డ్ ప్రాంగణాన్ని పరిశీలిస్తూ యార్డ్ లోని వర్మీ కంపోస్ట్ వెండ్రి కంపోస్ట్ తయారీ యూనిట్లను పరిశీలించారు. అనంతరం అధికారులకి అక్కడ పనిచేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీధి కుక్కల శస్త్ర చికిత్స కేంద్రాన్ని పరిశీలించి ప్రతిరోజు ఎన్ని శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా యార్డ్ సిబ్బందికి డంపింగ్ యార్డ్ నిర్వహణలో మరింత మెరుగు పరచాలని సిబ్బందికి కావలసిన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

## కార్తీక మాసం సందర్భంగా శ్రీ చంద్రమోళీశ్వరస్వామికి విశేష పూజలు

తెనాలి టౌన్ నవంబర్ 18 (ప్రభాతవార్త): పవిత్రమైన కార్తీకమాసం సందర్భంగా,పట్టణంలోని మారిస్ పేటలో వేంచేసిన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమోళీశ్వర స్వామి వారి దేవస్థానంలో, మంగళవారం కార్తీకమాస విశేష పూజా మహోత్సవం నిర్వహించారు. శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత శ్రీ



చంద్రమోళీశ్వరస్వామి వారి దేవస్థానం ఆహ్వాన కమిటీ అధ్యక్షులు గ్రంధి సేతు మాధవరావు,కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధర్ రావు,కోశాధికారి వరద వెంకట శేషగిరిరావు,సభ్యులు,పేరు బోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ మరియు అర్చకులు,పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



కొల్లూరు, నవంబరు 18 (ప్రభాతవార్త) : మండల కేంద్రమైన కొల్లూరు సెంటర్‌లోని రైతు సేవా కేంద్రం ఆర్ఎస్‌కె వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు ప్రారంభించారు. మంగళవారం ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025-26 సందర్భంలో బాపట్ల జిల్లా సివిల్ సప్లైస్ మరియు జిడిసిఎంఎస్ ఆధ్వర్యంలో రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. జీడీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, జాయింట్ కలెక్టర్ భావన్, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మీ, తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు, కొల్లూరు మండలంలోని కూటమి నాయకులు, పాల్గొన్నారు.

19-11pg10exHNWMJQE 12 GNT_19-11pg10exHNWMJQE.qxd 18/Nov/25 11:18 PM Page 1



### ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు

# సాత్విక్, చిరాగ్ జోడీ



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 సాత్విక్‌చిరాగ్ జోడీ రెండో రౌండ్‌కు చేరుకుంది. ఇదే సమయంలో ట్రీసా, గాయత్రి జోడీ నిష్క్రమించింది. మంగళవారం సిడ్నీలో జరిగిన బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 ఈవెంట్ అయిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి దూసుకెళ్లారు. టాప్ సీడ్ భారత ద్వయం చైనీస్ తైపీకి చెందిన చాంగ్ కోచి-పో లివీలను 48 నిమిషాల్లో 25-23, 21-16 తేడాతో ఓడించి, చైనీస్ తైపీకి చెందిన మరో జంట సు చింగ్ హెంగ్ మరియు వు గువాన్ జున్‌తో రౌండ్ ఆఫ్ 16 పోరుకు సిద్ధమైంది.అయితే, మహిళల డబుల్స్‌లో, నాల్గవ సీడ్ భారత జంట ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ ఇండోనేషియాకు చెందిన ఫెబ్రియానా ద్విపుజి కుసుమ-మెలిసా ట్రయాస్ పుష్పితసరి చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోయారు. ఇండోనేషియాకు చెందిన ఈ మ్యాచ్ 40 నిమిషాల్లో 21-10, 21-14 తేడాతో గెలిచింది. మూడున్నర నెలల తర్వాత భారతీయులకు ఇది మొదటి ఈవెంట్. హాంకాంగ్ సూపర్ 500 మరియు చైనా మాస్టర్స్ సూపర్ 750 లలో వరుసగా ఫైనల్స్ కు చేరుకున్న ప్రపంచ 3వ ర్యాంకర్ సాత్విక్-చిరాగ్, ప్రారంభ గేమ్ ప్రారంభంలో 2-6 తేడాతో వెనుకబడ్డారు, తైవాన్ జంట 16-14 వరకు స్వల్ప ఆధిక్యాన్ని కొనసాగించింది. భారత జోడీ 19-17తో ఆధిక్యంలోకి వెళ్లేందుకు ఆట చివరి వరకు కొనసాగింది.

### మహిళల కబడ్డీ ప్రపంచ కప్‌లో

# విజయంతో భారత్ ఆరంభం



**న్యూఢిల్లీ:** మహిళల కబడ్డీ ప్రపంచ కప్ 2025లో థాయిలాండ్‌పై అద్భుతమైన విజయంతో భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించింది. బంగ్లాదేశ్‌లోని మీర్‌పూర్‌లో మంగళవారం థాయిలాండ్‌ను 65-20 తేడాతో భారత్ జట్టు ఓడించింది. 2025 మహిళల కబడ్డీ ప్రపంచ కప్ టోర్నమెంట్‌ను ముందుగా బీహార్‌లోని రాజ్‌గిర్‌లో నిర్వహించాలని నిర్ణయించి, తరువాత అక్కడ నుండి హైదరాబాద్‌కు తరలించారు. మళ్లీ భారత్‌లో పలుమార్లు వాయిదా పడిన తర్వాత టోర్నమెంట్‌ను మీర్‌పూర్‌కు తరలించారు. మీర్పూర్‌కు తరలింపుతో 2025 మహిళల కబడ్డీ ప్రపంచ కప్ భారతదేశం వెలుపల జరిగిన మొట్టమొదటి క్రీడగా నిలిచింది. 13 సంవత్సరాల తర్వాత మహిళల కోసం కబడ్డీ ప్రపంచ కప్ నిర్వహించడం ఇదే మొదటిసారి. 2012లో బీహార్‌లోని పాట్నాలో జరిగిన ఫైనల్‌లో ఇరాన్‌ను ఓడించి, భారత్ మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. థాయిలాండ్‌ను ఓడించిన తర్వాత, భారత్ ఇప్పుడు రాబోయే రెండు రోజుల్లో తమ గ్రూప్ ఎ మ్యాచ్‌లలో బంగ్లాదేశ్ (నవంబర్ 19), జర్మనీ (నవంబర్ 20), మరియు ఉగాండా (నవంబర్ 21)తో తలపడనుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 11 దేశాలు పోటీపడుతున్నాయి. ఆతిథ్య బంగ్లాదేశ్, చైనీస్ తైపీ, ఇరాన్, కెన్యా, నేపాల్, పోలాండ్ మరియు జాంజిబార్ ఇతర దేశాలు పోటీపడుతున్నాయి.

# వరల్డ్ కప్‌లో జర్మనీకి అర్హత

### 6-0తో స్లోవేకియా ఓటమి

**న్యూఢిల్లీ:** స్లోవేకియాను 6-0 తేడాతో ఓడించి జర్మనీ ఫిఫా ప్రపంచ కప్ 2026 కి అర్హత సాధించింది. చివరి క్వాలిఫైయర్‌లో స్లోవేకియాను ప్లేఆఫ్‌లోకి పంపడం ద్వారా జర్మనీ వచ్చే ఏడాది ప్రపంచ కప్‌కు చోటు సంపాదించుకుంది. నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు గత రెండు ప్రపంచ కప్‌లలో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించి, 15 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది, స్లోవాక్‌లు 12 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచాయి. అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవడానికి జర్మన్లు, ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టకుండా ప్రారంభంలోనే నియంత్రణ సాధించే ప్రయత్నం చేశారు. 18వ నిమిషంలో అన్‌మార్క్డ్ నిక్ వోల్టెమేడ్ జర్మనీ తరపున గత మూడు మ్యాచ్‌లలో వరుసగా నాలుగో గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లాడు.సెర్జ్ గ్నాబ్రీ బాక్స్‌లోకి దూసుకెళ్లే సమయంలో స్లోవేకియా కీపర్ మార్టిన్




డుబ్రావ్కా 25వ స్థానంలో అడ్డుకున్నాడు. నాలుగు నిమిషాల తర్వాత గ్నాబ్రీ లియోన్ గోరెట్జ్కా పాస్‌ను పరిపూర్ణంగా అందుకొని గోల్ చేసి 2-0తో స్కోరునుసాధించాడు.ఫ్లోరియన్ విర్ట్జ్36వ ఆటగాడితో లెరాయ్‌సేన్‌ను డుబ్రావ్కాను దాటించి ఆటనుముగించాడు. ఐదు నిమిషాల తర్వాత విర్ట్జ్ వింగర్‌కు మరో అసిస్ట్ అందించి తన రెండవ గోల్‌ను సాధించాడు. విరామం తర్వాత రిడిల్ బాకు మరియు టీనేజర్ అస్సాన్ ఔద్రాగో ఒక్కొక్కరు గోల్ చేశారు.

# ఉమెన్ క్రికెట్ ఫైర్

### ఆక్షన్‌కు కసరత్తు పూర్తి

### స్మృతి రికార్డు ధర రూ.3.50 కోట్లు




**న్యూఢిల్లీ:** మహిళల క్రికెట్‌కు కొత్త ఊపునిచ్చిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) నాలుగో సీజన్‌కు సిద్ధమవుతోంది. ఈ మెగా టోర్నమెంట్ నాలుగో ఎడిషన్ జనవరి 7 నుంచే ప్రారంభం కానుంది. ఈసారి ఐదు ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను సమర్పించగా, టోర్నమెంట్ తేదీలు, వేదికలపై నిర్వాహకులు కసరత్తు పూర్తి చేశారు. దీనికి సంబంధించి వేలంలో ఫ్రాంచైజీలు మొత్తం రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నారు. స్లాబ్స్ ప్రకారంఒక క్రికెటర్‌కు గరిష్టంగా రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశం ఉంది. ప్రపంచ కప్‌లో అద్భుతంగా ఆడిన టీమిండియా సభ్యురాలు స్మృతి మంధానను ఆర్‌సీబీ రికార్డు ధర రూ.3.50 కోట్లకు రిటైన్ చేసుకుంది. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ దీప్తి శర్మను యూపీ వారియర్స్ విడుదల చేయడం ఆశ్చర్యపరిచింది. ఇక ఒక ఫ్రాంచైజీ ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకుంటే,వారి పర్స్‌నుంచి రూ.9.75 కోట్లు తీసివేస్తారు. నలుగురిని చేస్తే రూ.8.75 కోట్లు, ముగ్గురిని చేస్తే రూ.7.75 కోట్లు, ఇద్దరిని రిటైన్ చేస్తే రూ.6 కోట్లు కట్ అవుతుంది. ఈసారి వేలంలో ఎక్కువ డబ్బుతో బరిలోకి దిగుతున్న జట్టు యూపీ వారియర్స్. ఈ జట్టు కేవలం శ్వేత షెరావత్‌ను (రూ.50 లక్షలు) మాత్రమే రిటైన్ చేసుకుంది. అందుకే వారి పర్స్‌లో అత్యధికంగా రూ.14.5 కోట్లు మిగిలి ఉన్నాయి. వేలంలో కీలక ఆటగాళ్లను కొనుగోలు చేసే అవకాశం యూపీ వారియర్స్‌కు ఎక్కువగా ఉంది. రెండో స్థానంలో గుజరాత్ జెయింట్స్ నిలిచింది. బెత్ మూనీ (రూ.3.5 కోట్లు), యాష్ గార్డ్నర్ (రూ.2.5 కోట్లు)ను రిటైన్ చేసుకొని, తమ పర్స్‌లో రూ.9 కోట్లు మిగుల్చుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ కీలక ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. జెమీమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, మెరైన్ కాప్, అన్నబెల్ సదర్లాండ్‌ను చెరో రూ.2.2 కోట్లకు, అలాగే నిక్కీ ప్రసాద్‌ను రూ.50 లక్షలకు రిటైన్ చేసుకుంది. ఈ రిటెన్షన్ తర్వాత ఢిల్లీ పర్స్‌లో రూ.6.75 కోట్లు మిగిలి ఉన్నాయి. మరోవైపు ఆర్‌సీబీ జట్టు స్మృతితో సహా, రిచా ఘోష్ (రూ.2.75 కోట్లు), ఎలిస్సా పెర్రీ (రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్‌ను (రూ.60 లక్షలు) రిటైన్ చేసుకుంది. ఆర్‌సీబీ పర్స్‌లో రూ.6.15 కోట్లు మిగిలాయి. ఇక, అన్ని జట్ల కంటే తక్కువ డబ్బుతో వేలంలోకి దిగుతున్న జట్టు ముంబై ఇండియన్స్. ఈ జట్టు నాట్ సీవర్ బ్రంట్, హర్మన్‌ప్రీత్ కౌర్, హేలీ మ్యాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి. కమలినితో సహా మొత్తం 5 ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. దీంతో వారి పర్స్‌లో కేవలం రూ.5.75 కోట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.

# వరల్డ్ బాక్సింగ్ కప్‌లో హితేష్, పవన్ సంచలన విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత్ బాక్సర్ హితేష్ గులియా సంచలన విజయం సాధించాడు. మాజీ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించాడు. ఫైనల్స్‌లో తొమ్మిది మంది భారతీయుల్లో తొమ్మిది మంది సెమీఫైనల్‌కు చేరుకున్నారు. పవన్ బార్త్వాల్ (55 కిలోలు) మరియు హితేష్ గులియా (70 కిలోలు) టోర్నమెంట్‌లో రెండు అతిపెద్ద ఫలితాలను అందించారు. ప్రపంచ బాక్సింగ్ కప్ బ్రెజిల్ బంగారు పతక విజేత అల్టిన్‌బెక్ నూర్సుల్తాన్‌ను పవన్ ఓడించాడు. వెయిట్ కేటగిరీలో రెండవ సీడ్ అయిన నూర్సుల్తాన్‌ను నెట్టి క్లీన్ ఓపెనింగ్‌లను ఎంచుకున్నాడు. అలాగే హితేష్ రెండుసార్లు ఒలింపియన్, మాజీ ప్రపంచ ఛాంపియన్ సెవాన్ ఒకజావాను ఓడించి, స్ప్లిట్‌డెసిషన్ బౌట్‌లో విజయం సాధించాడు. వీరిద్దరితో పాటు సుమిత్ (75 కిలోలు), నవీన్ (90 కిలోలు), మరియు జదుమణి సింగ్ (50 కిలోలు) సాధించిన విజయాలు భారతదేశం రెండు సెషన్లలో పతక స్వీప్‌ను పూర్తి చేశాయి. హితేష్, ఒకజావా మధ్య రాత్రి జరిగిన మార్క్యూ బౌట్‌లో అత్యంత నాటకీయ ఫలితాలలో ఒకటిగా 3:2 తేడాతో విజయం సాధించింది. ఇద్దరు బాక్సర్లు ప్రారంభంలోనే జాగ్రత్తగా వ్యవహరించి ఓపెనింగ్‌లను అడ్డుకున్నారు, కానీ 2వ రౌండ్ చివరిలో హితేష్ నుండి వచ్చిన శక్తివంతమైన హుక్ అతనికి ప్రారంభంలోనే ఆధిక్యాన్ని ఇచ్చింది. 3వ రౌండ్‌లో ఒకజావా దూకుడుగా



ఎదురుదెబ్బ తగిలింది, కానీ మొదటి రెండు రౌండ్లలో హోమ్ ఫేవరెట్ క్లీన్ వర్క్ అతనికి పతకాన్ని ఖాయం చేసింది. అంతకుముందు 75 కిలోల క్వార్టర్ ఫైనల్స్‌లో సుమిత్ దక్షి ణ కొరియాకు చెందిన కిమ్ హ్యోన్‌టేపై 5:0 తేడాతో విజయం సాధించి పవన్ ఆధిక్యాన్ని

# ఆరు రోజుల లాభాలకు బ్రేక్

### నష్టాల్లో ముగిసిన స్టాక్ సూచీలు




**ముంబయి, నవంబరు 18:** వరుసగా ఆరు రోజులు లాభాల్లో ర్యాలీ తీసిన దేశీయ స్టాక్ మార్కెట్లకు మంగళవారం బ్రేకులు పడ్డాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 277.93 పాయింట్లు నష్టపోయి 84,673.02 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 103.40 పాయింట్లు కోల్పోయి 25,910.05 వద్ద ముగిసింది. ఉదయం సెషన్ ఫ్లాట్‌గా ప్రారంభమైనప్పటికీ, కొద్దిసేపటికే అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్లు నెగెటివ్ జోన్‌లోకి జారుకున్నాయి. ఇటీవల మార్కెట్లు పుంజుకోవడంతో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించారని, దీనికి బలహీన అంతర్జాతీయ సంకేతాలు తోడయ్యాయని విశ్లేషకులు తెలిపారు. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను డిసెంబర్‌లో తగ్గిస్తుందన్న అంచనాలు క్షీణించడం, డాలర్ బలపడటం వంటి కారణాలతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో ఐటీ, మెటల్, రియల్టీ షేర్లు నష్టపోయాయి. అయితే, ప్రైవేట్ బ్యాంకులు కొంతమేర మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ గణాంకాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూసారు. ఫెడ్ పాలసీ నిర్ణయాలపై ఈ డేటా ప్రభావం చూపనుంది. భవిష్యత్తులో ఇండోయూఎస్ వాణిజ్య ఒప్పందంలో పురోగతి, దేశీయ కంపెనీల ఆర్థిక ఫలితాలు మార్కెట్లకు మద్దతునిస్తాయని నిపుణులు భావిస్తున్నారు. ఈరోజు ట్రేడింగ్‌లో దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ సూచీ అత్యధికంగా 1.10 శాతం పతనం కాగా, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, ఎఫ్‌ఎంసీజీ రంగాలు కూడా నష్టాలను చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోగా, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతం మేర నష్టపోయాయి.

# తగ్గిన బంగారం, వెండి ధరలు

### అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం 4033 డాలర్లు

**ముంబయి, నవంబరు 18:**అమెరికా ఫెడ్ రిజర్వు వడ్డీరేట్ల తగ్గింపు సమీప కాలంలో ఉండకపోవచ్చని చేసిన వ్యాఖ్యలతో ఒక్కసారిగా బులియన్ మార్కెట్‌లో ధరలు తగ్గాయి. ఐదు రోజుల్లోనే తులం బంగారంలో ఐదువేలు తగ్గాయి. అంతర్జాతీయంగా కూడా ఔన్స్ బంగారం విలువలు 4033 డాలర్లు పెరగకుండా కట్టడి అయ్యాయి. డాలర్ రూపాయి మారకం విలువల్లో డాలర్ పటిష్టం కావడం, ఫెడ్ రిజర్వు రేట్‌కట్‌పై ఆశలు సన్నగిల్లడమే ఇందుకు కారణమని బులియన్ వర్తకులు చెపుతున్నారు. 24 కేరట్ల బంగారందరలు గ్రాముకు 12,366గా నడిచింది. 22 క్యారెట్లు 18 క్యారట్ల ధరలు కూడా అలాగే క్షీణించాయి. ఢిల్లీ, ముంబయి, కోల్‌కత్తా, బెంగళూరు, చెన్నైలలో ఇదేవిధంగా ప్రతిబింబించాయి. చెన్నైలో 24 కేరట్లు 12,437 రూపాయలు, ఇతర మెట్రో నగరాలలో కూడా ఇదే తరహా అటూ ఇటూగా నమోదయ్యాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పదిగ్రాముల బంగారంధర రూ.1.25 లక్షలు పలుకుతుంటే 22 కేరట్లు 1.14 లక్షలువద్ద ఉంది. ఇటు వెండి కూడా కిలో ఒక్కింటికి 1.56 లక్షలరూపాయలు పలుకు




తోంది. ఈనెల 13న పదిగ్రాముల పసిడిధరలు 1.30 లక్షలవద్ద ఉంది. ఐదురోజుల్లోనే ఐదువేల మేర తగ్గింది. వెండి కిలో కూడా రూ.1.70 లక్షలవరకూ ఉండేది అప్పటితోపోలిస్తే ఇపుడు రూ.15 వేలు తగ్గింది. ఔన్స్ బంగారం 4200 డాలర్లుంటే ఇపుడు 4033గా నడుస్తోంది. వెండి ప్రస్తుతధర ఔన్స్ ఒక్కింటికి 49 డాలర్లుగా ఉంది.



# దేశాభివృద్ధికి 9,9,6 విధానమే శ్రేష్ఠం

### ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కొత్త లెక్కలు

**బెంగళూరు, నవంబరు 18:** ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణ మూర్తి మరోసారి పని సంస్కృతిపై వ్యాఖ్యలు చేసి దేశవ్యాప్త చర్చకు నాందిపలికారు. గతంలో భారత యువత వారానికి 70 గంటలు పనిచేయాలని చెప్పి సంచలనం సృష్టించిన ఆయన, ఈసారి చైనాలో ఒకప్పుడు అమల్లో ఉన్న 996 పని విధానాన్ని ఉదహరించారు. దేశాభివృద్ధి వేగవంతం కావాలంటే యువత ఎక్కువ గంటలు పనిచేయడం తప్పనిసరి అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన 79 ఏళ్ల మూర్తి చైనా అనుసరించిన కఠోర పనివిధానం వల్లే ఆ దేశం ఆర్థికంగా వేగంగా పురోగమించిందని గుర్తుచేశారు. చైనా టెక్ కంపెనీలలో ఒకప్పుడు ప్రాచుర్యంలో ఉన్న 996 విధానం అంటే ఉద్యోగులు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు, వారానికి ఆరు రోజుల పాటు పనిచేయడం. అంటే, వారానికి మొత్తం 72 గంటల పని అన్నమాట. తయారీ రంగంలో భారత్ చైనాను అధిగమించగలదా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ అది సాధ్యమే కానీ, అందుకు అసాధారణమైన నిబద్ధత అవసరమని స్పష్టం చేశారు. ప్రస్తుతం చైనా ఆర్థిక వ్యవస్థ మనకంటే ఆరు రెట్లు పెద్దది. మనం 6.57 శాతం వృద్ధి రేటుతో పర్వాలేదనిపించినా, వారితో పోటీపడాలంటే ప్రతి ఒక్కరూ అసాధారణంగా కృషి చేయాలని ఆయన వివరించారు. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ గురించి ఆలోచించే ముందు యువత తమ కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని మూర్తి పునరుద్ఘాటించారు. ప్రతి పౌరుడు, అధికారి, రాజకీయ నాయకుడు, పారిశ్రామికవేత్త ఇలా ప్రతి ఒక్కరూ తమకు తాము ఉన్నత ప్రమాణాలు నిర్దేశించుకున్నప్పుడే భారత్ చైనాను అందుకోగలదని ఆయన అన్నారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14